


RNI NO:TELTEL/ 2023/89546

# సూర్య రేఖ

తెలుగు దినపత్రిక



## విలేకరులు కావలెను

సమాజంలో మీ కోసం.. మీరు ప్రశ్నించాలని అనుకుంటున్నారా.. అన్యాయాలను అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలి అనుకుంటున్నారా.. ఇంతే కాకుండా సామాజిక నైపు ణ్యం.. సాంస్కృతిక అవగాహన..మీ ద్వారా కల్పించాలనుకుంటున్నారా.. అయితే అక్షర పంజా విసరడానికి మీ ముందుకు వచ్చింది సూర్య రేఖ తెలుగు దినపత్రికకు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. ఆసక్తి కలవారు క్రింది నంబరును సంప్రదించగలరు.

సీనియర్లకు ప్రాధాన్యం

సంప్రదించవలసిన నెం : 9397303326



రంగారెడ్డి | సంపుటి : 2 | సంచిక : 403 | పేజీలు : 8 | ఎడిటర్ : ఎం ప్రేమ్‌రాజ్ | శనివారం 26 ఏప్రిల్ 2025 | వెల : 4/-




# టూర్.. డర్!

## పహల్గాం ఉగ్రదాడితో భయాందోళన

- సమ్మర్‌లో కశ్మీర్ వెళ్లేందుకు పర్యాటకుల ప్లాన్
- భారీగా రద్దయిన వేసవి ప్రయాణాలు
- గత రెండురోజుల్లో తారుమారైన పరిస్థితులు
- ప్రత్యామ్నాయంగా సిమ్లా, కేరళ తదితర ప్రాంతాల ఎంపిక
- నగర పర్యాటక రంగంపై భారీ ప్రభావం

హైదరాబాద్

కాశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడి పర్యాటక రంగంపై పిడుగుపాటుగా మారింది. నగర నుంచి కాశ్మీర్‌కు వెళ్లేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్న పర్యాటకులు తమ ప్రయాణాలను రద్దు చేసుకుంటున్నారు. గత రెండు రోజుల్లోనే పదుల సంఖ్యలో బుకింగ్‌లు రద్దయినట్లు నగరానికి చెందిన పలు ట్రావెల్స్ సంస్థలు వెల్లడించాయి. ఇటీవల పిల్లలకు వేసవి సెలవులు ప్రకటించడంతో వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు నగర వా సులు సన్నద్ధమవుతున్నారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ఊటీ, మనాలి, కొడైకెనాల్, సిమ్లా తదితర ప్రాంతాలతో పాటు ఎక్కువ మంది కశ్మీర్ వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నారు. అనూహ్యంగా పహల్గాంలో పర్యాటకుల పై ఉగ్రవాదులు దాడి నేపథ్యంలో పర్యటనలను రద్దు చేసుకుంటున్నారు. కోవిడ్ అనంతరం పర్యాటకరంగం అనూహ్యంగా విస్తరించింది. హైదరాబాద్ నుంచి ఉత్తరాది రాష్ట్రాలకు వెళ్లేవారి సంఖ్య పెరిగింది. దక్షిణమధ్య రైల్వే ఆధ్యాత్మిక టూర్ల కోసం ప్రత్యేకంగా భారత్‌గౌరవ్ రైళ్లను నడుపుతోంది. హైదరాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి అన్ని ప్రధాన నగరాలకు కనెక్టివిటీ పెరిగింది. సుమారు 70 నగరాలకు విమానాలు రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో గత మూడేళ్లుగా టూరిస్టులు పెరిగారు. ఏటా లక్షలాది మంది వివిధ ప్రాంతాలకు ప్రయాణం - మిగతా3లో



# భారత్ సమ్మిట్ చారిత్రాత్మకమైనది

- కాంగ్రెస్ మూల సిద్ధాంతాలతో భారత్ సమ్మిట్‌ను ఏర్పాటు
- 'గ్లోబల్ జస్టిస్ కోసం ప్రపంచ దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు
- సోషల్ జస్టిస్, శాంతి తదితర అంశాలపై సమ్మిట్‌లో చర్చించారు
- సామాజిక న్యాయం, అభివృద్ధిపై డెలిగేట్స్‌తో చర్చించాం

హైదరాబాద్:

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జరుగుతున్న భారత్ సమ్మిట్ చారిత్మాకమైన దని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. కాంగ్రెస్ మూల సిద్ధాంతాలతో భారత్ సమ్మిట్ ను ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. - మిగతా3లో

# మరోసారి పాకిస్థాన్‌ను ఓడించాలి

- పహల్గాం ఉగ్రదాడిని నిరసిస్తూ హైదరాబాద్‌లో కొవ్వొత్తుల ర్యాలీ
- పీపుల్స్ ప్లాజా నుంచి ఇందిరాగాంధీ విగ్రహం వరకు ప్రదర్శన
- మొత్తం 140 కోట్ల మంది ప్రజలు ఏకమై ఉగ్రవాదంపై పోరాడాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపు
- భారత్‌లోకి చొచ్చుకొచ్చి.. పాక్ ఉగ్రవాదులు దాడి చేయడం హేయమైన చర్య



హైదరాబాద్

జమ్ముకశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడిని నిరసిస్తూ హైదరాబాద్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పీపుల్స్ ప్లాజా నుంచి ఇందిరాగాంధీ విగ్రహం వరకు ప్రదర్శన చేపట్టారు. ఈ ప్రదర్శనలో సీఎం రేవంత్ రెడ్డి సహా పలువురు మంత్రులు, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్, ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ, భారత్ సమ్మిట్‌కు వచ్చిన విదేశీ ప్రతినిధులు పాల్గొన్నారు. భారీ సంఖ్యలో నగరవాసులు పాల్గొని పహల్గాం మృతులకు సంతాపం తెలిపారు. మొత్తం 140 కోట్ల మంది ప్రజలు ఏకమై ఉగ్రవాదంపై పోరాడాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. భారత్‌లోకి చొచ్చుకొచ్చి.. పాక్ ఉగ్రవాదులు దాడి చేయడం హేయమైన చర్య అని అన్నారు. "ఉగ్రవాదంపై పోరులో 140 కోట్ల మంది ప్రజలు ప్రధాని వెంట ఉంటారు. ఈ విషయంలో మోదీకి మద్దతు తెలుపుతున్నా. బాధిత కుటుంబాలకు అండగా ఉండాల్సిన అవసరం ఉంది. 1971లో పాకిస్థాన్‌కు ఇందిరాగాంధీ గట్టిగా బుద్ధి చెప్పారు. ఆనాడు ఇందిరాగాంధీని దుర్గామాతతో వాజ్‌పేయీ పోల్చారు. మరోసారి పాకిస్థాన్‌ను ఓడించాలి. పీవోకేను భారత్‌లో కలపాలి. ఇందిరాగాంధీని గుర్తుకుతెచ్చుకొని పాక్‌కు మరోసారి - మిగతా3లో



## పాక్ పౌరులను తక్షణమే వెనక్కి పంపించండి

- అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు అమిత్ షా ఫోన్
- వీళ్లను రెండు రోజుల్లో వెళ్లిపోవాలని పోలీసులు సూచించినట్లు సమాచారం.
- పాక్ పౌరులకు సంబంధించిన వివరాల పోలీసులు ఆరా

# తెలంగాణ ఉద్యమానికి.. సిద్దిపేటకు పేగు బంధం

- బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు
- చాలా పార్టీలు పుడుతుంటాయి, పోతుంటాయి..
- లంకలో రావణుడి అరాచకాలను అరికట్టడానికి ఆనాడు రామదండు కదిలింది
- నేడు మన రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను ఎదిరించడానికి ఈ గులాబీ దండు



సిద్దిపేట

తెలంగాణ ఉద్యమానికి సిద్దిపేటకు పేగు బంధం ఉందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. నేడు విద్యార్థులు, యువత చేపట్టిన పాదయాత్ర రేపు బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడానికి విజయ యాత్రగా కాబోతున్నదని చెప్పారు. నాడు సిద్దిపేట నుంచే కేసీఆర్ సైకిల్ యాత్ర చేపట్టి వరంగల్ సభకు ఊళ్లకు ఊళ్లు కదిలించారని గుర్తుచేశారు. చాలా పార్టీలు పుడుతుంటాయి, పోతుంటాయి.. కానీ బీఆర్ఎస్ మాత్రం లక్ష్యాన్ని ముద్దాడిందని తెలిపారు. కేసీఆర్ అనే ఒక గొంతు కోట్ల గొంతుకలను ఏకం చేసిందన్నారు. 14 ఏండ్ల ఉద్యమం, పదేండ్ల ప్రభుత్వం, ఇప్పుడు ఏడాదిన్నర ప్రతిపక్షం.. ఏ పాత్ర అయినా బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ పక్షమేనని స్పష్టం - మిగతా3లో



## ఇరు దేశాలు సంయమనం పాటించాలి

- భారత్, పాకిస్థాన్‌లకు ఐక్యరాజ్యసమితి సూచన
- ఉగ్రదాడిని ఐరాస తీవ్రంగా ఖండిస్తోంది
- 'జమ్ముకశ్మీర్‌లో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిని ఐరాస తీవ్రంగా ఖండిస్తోంది
- ఇరుదేశాల మధ్య ఏదైనా సమస్య ఉంటే శాంతియుత చర్చలతో వాటిని పరిష్కరించుకుంటారని ఆశిస్తున్నాం

# యుద్ధం వస్తే.. ఎవరి బలం ఎంత.. సైన్యం ఎంత

**న్యూఢిల్లీ :** భారత్ పాక్ మధ్య ఇప్పుడు పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి నెలకొంది. ఇప్పటికే రెండు దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొనగా.. తాజాగా పహల్గామ్ ఉగ్రదాడ ితో అవి తారస్థాయికి చేరుకున్నాయి. ఇప్పటికే పాకిస్తాన్‌పై అనేక ఆంక్షలు విధించిన భారత్.. కేబినెట్ కమిటీ ఆన్ సెక్యూరిటీ సమావేశమై 5 కీలక నిర్ణయాలు తీసుకుంది. అందులో సింధూ జలాల పంపిణీ ఆపడం, పాక్ వాసులకు వీసాల రద్దు, అట్టారీ సరిహద్దు మూసివేత, భారత్‌లోని పాక్ అధికారుల తొలగింపు, ఇస్లామాబాద్‌లోని భారత అధికారులను వెనక్కి రప్పించడం వంటి కీలక నిర్ణయాలు తీసుకుంది. ఈ నిర్ణయాలకు ప్రతీకారంగా భారత్‌పై పాక్ కూడా అలాంటి నిర్ణయాలే తీసుకుంది. సిమ్లా ఒప్పందం రద్దు, భారత్‌తో వాణిజ్య సంబంధాలు తెంచుకోవడం, పాక్ ఎయిర్‌స్పేస్‌ను భారత్ ఉపయోగించుకోకుండా అడ్డుకోవడం, భారతీయులకు సార్క్ వీసాలు రద్దు, ఇస్లామాబాద్‌లోని భారత దౌత్య అధికారుల తగ్గింపు సహా పలు నిర్ణయాలు తీసుకుంది. ఈ క్రమంలోనే రెండు దేశాల మధ్య యుద్ధవాతావరణం నెలకొంది.భారత్‌తో పోల్చుకుంటే పాకిస్తాన్ జనాభా పరంగా, సైనిక పరంగా, ఆయుధాల పరంగా, ఆర్థిక పరంగా, రాజకీయ పరంగా, అంతర్జాతీయ సహకారం పరంగా అన్ని రంగాల్లో వెనకబడే ఉంది. ఇప్పటికే అడుక్కుతినే స్థాయిలో ఉన్న పాకిస్తాన్.. భారత్‌తో యుద్ధం వస్తే ఇంకా పాతాళానికి పడిపోతుందనే విషయం తెలిసినా.. ఆ దేశం కవ్వింపు చర్యలకు దిగుతూనే ఉంది. విదేశీ మారక నిల్వలు పూర్తిగా అడుగంటిపోయి.. రోజు గడవాలంటే విదేశాలు, విదేశీ సంస్థలు, అంతర్జాతీయ సంస్థల వద్ద చేతులు చాచి అడుక్కుంటోంది. పాక్ ఆర్థిక వ్యవస్థ తీవ్ర పతనావస్థలో ఉంది. మరోవైపు.. అంతర్గతంగా పాక్‌లో అనేక రాజకీయ, వేర్పాటువాద సవాళ్లు ఉన్నాయి. ప్రభుత్వం, సైన్యం మధ్య కూడా సఖ్యత లేదు. ఒకవైపు ప్రత్యేక దేశం కోసం ఎప్పటినుంచో డిమాండ్ చేస్తున్న బలూచిస్తాన్.. ఇటీవలి కాలంలో పాక్‌కు పెద్ద తలనొప్పిగా మారింది. ఇలాంటి సమయంలో భారత్‌తో యుద్ధం అంటే పాకిస్తాన్ ఇంకా నష్టపోవాల్సిన పరిస్థితే ఉంటుంది.మరోవైపు.. సైనిక పరంగా,




ఆయుధాల పరంగా, రక్షణ శాఖ బడ్జెట్ పరంగా చూస్తే.. భారత్‌తో అసలు పాకిస్తాన్ పోటీపడే స్థితిలో కూడా లేదు. భారత్ వద్ద 14 లక్షల మంది సైనికులు ఉండగా.. పాకిస్తాన్ వద్ద కేవలం 6.5 లక్షల మంది సైన్యం మాత్రమే ఉంది. ఇక రిజర్వ్ ఫోర్స్‌లు భారత్ వద్ద 11 లక్షలు ఉండగా.. పాకిస్తాన్‌కు కేవలం 5 లక్షలు మాత్రమే ఉంది. 2024లో భారత రక్షణ బడ్జెట్ 81 బిలియన్ డాలర్లు కాగా.. పాకిస్తాన్ రక్షణ బడ్జెట్ 11 బిలియన్ డాలర్లు మాత్రమే కేటాయించారు. ఫైటర్ జెట్‌లు (సుఖోయ్–30 ఎంకేఐ, రఫేల్) భారత్ వద్ద 600 కంటే ఎక్కువ ఉండగా.. పాకిస్తాన్ వద్ద 350 (జేఎఫ్–17, ఎఫ్–16, మిరాజ్) ఉన్నాయి.యుద్ధ ట్యాంకులు భారత్ వద్ద 4,500కు పైగా ఉండగా.. పాక్ వద్ద కేవలం 2,400 మాత్రమే ఉన్నాయి. నౌకా శక్తిలో భారత్ వద్ద 1 ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్, డిస్ట్రాయర్స్, సబ్‌మెరైన్లు ఉన్నాయి. కానీ పాకిస్తాన్ వద్ద నౌకా శక్తి పరిమిత సంఖ్యలోనే ఉంది. ఇక న్యూక్లియర్ ఆయుధాలు భారత్ వద్ద 160 నుంచి 170 ఉన్నట్లు అంచనా ఉండగా.. అదే పాకిస్తాన్ వద్ద 160 నుంచి 165 అణ్వాయుధాలు ఉన్నట్లు అంచనా ఉంది. ఈ ఒక్క అణ్వాయుధాల విషయంలో మాత్రం భారత్‌ను ఢీకొట్టే సత్తా పాకిస్తాన్‌కు కనిపిస్తోంది. మిస్సైల్ శక్తిలో భారత్ వద్ద అగ్ని, బ్రహ్మోస్ వంటి అగ్రశ్రేణి బాలిస్టిక్ క్షిపణులు, క్రూయిజ్ మిస్సైళ్లు ఉన్నాయి. అదే పాక్ వద్ద షాహీన్, గౌరీ, బాబుర్ మిస్సైళ్లు ఉన్నాయి.పహల్గామ్ ఉగ్రదాడిని భారత్ చాలా తీవ్రంగా పరిగణిస్తోంది. అంతేకాకుండా ఈ దాడి చేసిన ఉగ్రవాదులు ఎక్కడ ఉన్నా తీసుకువచ్చి మట్టిలో కలిపేస్తామని.. స్వయంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర హెచ్చరికలు చేశారు. కేంద్రమంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్ కూడా ఇలాగే తీవ్రంగా స్పందించారు. నేరుగా యుద్ధమార్గాన్నే ఎంచుకోకుండా భారత్ పలు దౌత్య, ఆర్థిక పరంగా చర్యలు తీసుకుంటోంది.యుద్ధం విషయంలో భారత్ పెట్టుకున్న రూల్ మాత్రం ఎన్నటికీ మారదు. మొదట ప్రత్యర్థి దాడి చేస్తేనే.. దానికి ప్రతిస్పందించడం తప్ప.. భారత్ ఎన్నడూ మొదట యుద్ధానికి కాలు దువ్వదు. ప్రస్తుతం ఇరు దేశాల సరిహద్దుల వద్ద పర్యవేక్షణ పెరిగినా, సైన్యం, ఆయుధాలను మోహరించినా.. యుద్ధం జరగడం అనేది చివరి పరిష్కారంగా మాత్రమే రెండు దేశాలు భావిస్తున్నాయి. ఎందుకంటే ఒకసారి యుద్ధం గనక ప్రారంభమైతే.. రెండు దేశాలు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. సైనిక పరంగా పాక్ కంటే అత్యంత బలంగా ఉన్న భారత్.. పాక్ కవ్విస్తే తప్ప యుద్ధభూమిలో అడుగుపెట్టదు. అయితే పాక్ వద్ద అణ్వాయుధాలు భారీగా ఉండటం.. తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఒకసారి అణ్వాయుధాలు ప్రయోగిస్తే.. దాని వల్ల కలిగే నష్టం ఊహించడం కూడా చాలా కష్టంగా ఉంటుంది.

# తాష్కెంట్ ఒప్పందానికీ చెల్లుచీటీ!

### వైదొలిగే యోచనలో పాక్.

### అంతర్జాతీయంగా 'కశ్మీర్ రచ్చ' కోసమే.

భారత్, పాకిస్థాన్ మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు తారస్థాయి కి చేరాయి. కశ్మీర్లోని పహల్గాంలో ఉగ్రవాదుల దుశ్చర్యను నిరసిస్తూ సింధు నదీ జలాల ఒప్పందం అమలును భారత్ నిలిపివేయడం, అందుకు బదులుగా 1972 నాటి సిమ్లా అగ్రిమెంటు అమలును పాక్ సస్పెండ్ చేయడం తెలిసిందే. తాష్కెంట్ ఒప్పందం నుంచి కూడా వైదొలగాలని పాక్ తాజాగా యోచిస్తోంది. 1965లో ఇండియాతో తలెత్తిన యుద్ధానికి ముగింపు పలికేందుకు పాక్ 1966లో తాష్కెంట్ (ఉజ్బెకిస్థాన్) శాంతి ఒప్పందానికి తలూపింది. నాటి సోవియట్ యూనియన్ మధ్యవర్తిత్వంతో 1966 జనవరి 10న తాష్కెంట్ వేదికగా భారత్, పాక్ మధ్య ఈ చారిత్రక శాంతి ఒప్పందం కుదిరింది. నాటి భారత ప్రధానమంత్రి లాల్ బహదూర్ శాస్త్రి, పాక్ అధ్యక్షుడు మహమ్మద్ ఆయూబ్ ఖాన్ ఈ డిక్లరేషన్ మీద సంతకాలు చేశారు. నాటి సోవియట్ రాజకీయవేత్త అలెక్సీ కోసిజిన్ ఈ కార్యక్రమానికి సోవియట్ ప్రతినిధిగా హాజరయ్యారు. భారత్, పాక్ ఇరు దేశాలూ తమ సైనిక బలగాలను ఉపసంహరించుకుని వాటిని యుద్ధానికి ముందు నాటి స్థానాలకు మళ్లించడం, ఒక దేశ అంతర్గత వ్యవహారాల్లో రెండో దేశం జోక్యం చేసుకోకుండా నివారించడంతోపాటు దౌత్య, ఆర్థిక సంబంధాలను పునరుద్ధరించడం వంటివి ఈ డిక్లరేషన్ ప్రధానాంశాలు. అయితే కశ్మీర్ వివాద పరిష్కారంలో తాష్కెంట్ ఒప్పందం విఫలమైంది. 1971లో భారత్, పాక్ నడుమ మరో యుద్ధం సంభవించడం, బంగ్లాదేశ్ అవతరణ పరిణామాలతో




1972లో సిమ్లా ఒప్పందం కుదిరింది. అలా కశ్మీర్లో నియంత్రణ రేఖ ఏర్పాటైంది. అప్పట్నుంచి భారత్, పాక్ ద్వైపాక్షిక సంబంధాల్లో సిమ్లా అగ్రిమెంటుకు ప్రాధాన్యం పెరగడంతో తాష్కెంట్ ఒప్పందం కొన్ని దశాబ్దాలుగా మరుగునపడింది. సిమ్లా అగ్రిమెంటుకే విలువ ఇవ్వకుండా పక్కకు తప్పుకున్న పాక్ తాజాగా ఆరు దశాబ్దాల నాటి తాష్కెంట్ ఒప్పందం నుంచి వైదొలగాలని యోచించడం పెద్ద విశేషమేమీ కాదు. కాకపోతే పాక్ వైఖరిని గమనించడానికి ఇదొక ఉదాహరణ. చారిత్రకంగా ప్రాధాన్యమున్న శాంతిపరమైన బాధ్యతలను నెరవేర్చకుండా తప్పుకోవడం, కశ్మీర్ అంశాన్ని అంతర్జాతీయంగా రచ్చ చేయాలని చూడటం వంటివి పాక్ వ్యూహాలుగా కనిపిస్తున్నాయి. ఇకపై కశ్మీర్ వివాదం ద్వైపాక్షికం కాదని వాదిస్తూనే, ఆ సమస్య పరిష్కారం కోసం తృతీయ పక్షం లేదా అంతర్జాతీయ జోక్యానికి పిలుపు ఇవ్వాలని పాక్ భావిస్తోంది. ఇందులో భాగమే తాష్కెంట్ ఒప్పందానికి పాక్ చెల్లుచీటీ!

# కోడలికి రెండో పెళ్లి చేసి, కన్నీటితో సాగనంపిన 'మామగారు'

కన్నవారిని, ఉన్న ఊరిని వదిలి, కోటి ఆశలతో అత్తింటికి చేరే కోడళ్లను కన్న కూతురిలా చూసుకునే కుటుంబాలు చాలా ఉన్నాయి. కానీ కొడుకు మరణం తరువాత కోడల్ని అక్కున చేర్చుకుని ఆదరించడమే కాకుండా, ఆమెకు మరో జీవితాన్ని ప్రసాదించిన కుటుంబాలు చాలా అరుదుగా ఉంటాయి. అలాంటి ఒక హృద్యమైన కథనం నెట్టింట వైరల్‌గా మారింది. అనేక ప్రశంసలు దక్కించుకుంది. గుజరాత్‌లోని అంబాజీ నివాసి ప్రవీణ్ సింగ్ రాణా. ముదిమి వయసులో ఆదు కుంటాడనుకున్న పెద్ద కుమారుడు సిద్ధరాజ్ సింగ్ అర్థాంతరంగా కన్నుమూశాడు. దీంతో తనతో పాటు కోడలు, నెలల వయస్సున్న చిన్న బిడ్డ అనాథలైపోయారు. కానీ ఇక్కడే ప్రవీణ్ సింగ్ తన పెద్దరికాన్ని చాటుకున్నాడు. కోడలికి తండ్రి స్థానంలో నిలబడ్డాడు. చక్కగా పెళ్లి చేసి అత్తారింటికి సాగనంపాడు. కోడలి, మనవరాల్ని కన్నీటితో సాగనంపడం విశేషంగా నిలిచింది.

**కొడుకు మరణం**

2024లో దీపావళి పండుగ సందర్భంగా ఆకస్మిక గుండెపోటు రావడంతో కన్నుమూశాడు. ఈ సంఘటనతో సిద్ధరాజ్ భార్య కృష్ణ, చిన్నారి దీక్షితతో సహా కుటుంబం మొత్తం దిగ్భ్రాంతికి లోనైంది. ఇక జీవితాంతం భర్తలేకుండా గడపాల్సి ఉంటుందని, తండ్రి లేకుండా తన కుమార్తెను ఎలా పెంచాలంటూ కృష్ణ అంతులేని శోకంలో మునిగిపోయింది.



చుట్టుపక్కల సమాజం కూడా అలానే అనుకుంది. కానీ ప్రవీణ్ మనసు వేరేలా ఆలోచించింది. తన కుమార్తెలా చూసుకున్నాడు. సమాజం అభిప్రాయాలను, భయాలను పట్టించుకోకుండా, తన కొడుకు ప్రాణ స్నేహితుడు సంజయ్‌తో తన కోడలి కృష్ణకు వైభవంగా పెళ్లి జరిపించాడు. కోడలితో పాటు, మనవరాలు దీక్షిత తరలి పోతోంటే, తన తల్లితో వెళ్లిపోయినప్పుడు తాత భావోద్వేగంగా కన్నీళ్లు పెట్టుకున్నాడు. దీంతో నెటిజన్లు ప్రవీణ్,కుటుంబంపై ప్రశంసలు కురిపించారు. ఇలాంటి ప్రేమ, ఆప్యాయతలు కదా నేటి సమాజానికి కావాల్సింది అంటూ వ్యాఖ్యానించారు. కృష్ణను రెండో పెళ్లి చేసుకున్న సంజయ్ ప్రవీణ్‌కు ధన్యవాదాలు తెలిపారు. సిద్ధరాజ్ తన చిన్ననాటి స్నేహితుడనీ, కృష్ణను కొంతకాలంగా తనకు తెలుసునని చెప్పారు. కృష్ణ, దీక్షితను కంటికి రెప్పలా చూసుకుంటానని సిద్ధరాజ్ కుటుంబానికి సంజయ్ హామీ ఇచ్చాడు. తన స్నేహితుడి కుమార్తె , కోడలికి కొత్త జీవితాన్ని ఇవ్వాలనుకున్నాను. దీని గురించి ప్రవీణ్ సింగ్‌తో మాట్లాడాను. ఆయన మా పెళ్లికి అంగీకరించారు అని చెప్పుకొచ్చాడు. అటు కృష్ణ కూడా అత్త మామలకు కన్నీటితో కృతజ్ఞతలు తెలిపింది.

## పాక్ పౌరులను తక్షణమే వెనక్కి పంపించండి

**న్యూఢిల్లీ :** పాకిస్థాన్ పౌరుల విషయంలో కేంద్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసింది. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు శు క్రవారం ఫోన్ చేశారు. పాక్ పౌరుల్ని గుర్తించి తక్షణమే వెనక్కి పంపాలని ఆదేశించినట్లు సమాచారం.



పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాకిస్థానీయుల వీసాలు కేంద్రం రద్దు చేసిన సంగతి తెలిసిందే. వారం లోపు దేశం విడిచిపోవాలంటూ ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలోనే తాజాగా రాష్ట్రాలను కేంద్ర హోం శాఖ మరోమారు అప్రమత్తం చేసింది. మరోవైపు వివిధ రాష్ట్రాల్లో ఉన్న పాకిస్థానీయులపై పోలీసులు నజర్ వేశారు. పాక్ పౌరులకు సంబంధించిన వివరాలను పోలీసులు ఆరా తీస్తున్నారు. హైదరాబాద్ స్పెషల్ బ్రాంచ్‌లో 208 మంది పాకిస్తానీయులు నమోదు అయినట్లు తెలుస్తోంది. వీరిలో లాంగ్ టర్మ్ వీసా ఉన్నవాళు 156 మంది.. షార్ట్ టర్మ్ వీసా కలిగిన వారు 13 మంది ఉన్నట్లు తేలింది. వీళ్లను రెండు రోజుల్లో వెళ్లిపోవాలని పోలీసులు సూచించినట్లు సమాచారం.

**నల్లరిబ్బన్‌లతో నమాజ్‌కు..**

పహల్గాం ఉగ్రదాడిని ఖండిస్తూ.. మృతుల కుటుంబాలకు సంఘీభావం తెలుపుతూ మక్కా మసీదులో నల్ల రిబ్బన్లతో ముస్లింలు నమాజ్‌కు హాజరయ్యారు. మరోవైపు.. శాస్త్రిపురంలోని ఒక మసీదులో ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ నమాజ్ కోసం వచ్చిన వాళ్లకు నల్లటి రిబ్బన్ పంపిణీ చేశారు.

## కశ్మీర్ కొండల్లో ఉగ్రవాదులు

**శ్రీనగర్ :** జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలోని బైసరన్ వ్యాలీలో జరిగిన ఉగ్రదాడి దేశవ్యాప్తంగా ఆగ్రహాన్ని రేకెత్తించింది. లష్కర్?ఎ?తొయిబాతో సంబంధం ఉన్న ది రెసిస్టెన్స్ ఫ్రంట్ (టీఆర్ఎఫ్) బాధ్యత వహించిన ఈ దాడిలో 26 మంది, అందులో 25 మంది భారతీయులు, ఒక నేపాలీ పౌరుడు మరణించారు. ఉగ్రవాదులు కార్బైన్‌లు, అఓ?47 రైఫిళ్లతో పర్యాటకులపై విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. ఈ ఘటన తర్వాత, కేంద్ర ప్రభుత్వం భారత సైన్యానికి పూర్తి స్వేచ్ఛను మంజూరు చేసింది, ఉగ్రవాదులను అంతమొందించేందుకు తీవ్ర శోధన కార్యకలాపాలను ప్రారంభించింది. పహల్గాం దాడి తర్వాత, భారత సైన్యం, స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్ సంయుక్తంగా పూంఛ్, బారాముల్లా, పహల్గాం అడవుల్లో ఉగ్రవాదుల కోసం భారీ శోధనను ప్రారంభించాయి. హెలికాప్టర్‌లు, డ్రోన్‌లతో ప్రతి అంగుళాన్ని జల్లెడ పడుతున్నాయి. ఈ ఆపరేషన్‌లో అత్యాధునిక సాంకేతికత ఉపయోగించబడుతోంది, ఇందులో డీఆర్‌డీఓ అభివృద్ధి చేసిన నెత్రా డ్రోన్‌లు 240 డిగ్రీల కవరేజ్‌తో రియల్?టైమ్ డేటాను అందిస్తాయి. ఇజ్రాయెల్ నుంచి దిగుమతి చేసుకున్న ఇఒ/చి?2090 రాడార్ సిస్టమ్స్ 450 కిలోమీటర్ల పరిధిలో లక్ష్యాలను గుర్తిస్తాయి. ఇస్రో ఉపగ్రహాల నుంచి పొందిన రియల్?టైమ్ ఇమేజరీ ఉగ్రవాదుల స్థానాలను ఖచ్చితంగా గుర్తించడంలో సహాయపడుతోంది.

## ఇరు దేశాలు సంయమనం పాటించాలి




పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడి ని భారత్ సహా యావత్ ప్రపంచం తీవ్రంగా ఖండిస్తోంది. ఐక్యరాజ్యసమితి కూడా ఈ దాడిని హేయమైనదిగా అభివర్ణించింది. జమ్ముకశ్మీర్‌లో ఆందోళనకర పరిస్థితిని ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ నిశితంగా పరిశీలిస్తున్నారని ఐరాస అధికార ప్రతినిధి స్టీఫెన్ దుజారిక్ తెలిపారు. ఉగ్రదాడిని ఐరాస తీవ్రంగా ఖండిస్తోందన్న ఆయన ప్రస్తుతం ఇరుదేశాలు సంయమనం పాటించాలని సూచించారు. 'జమ్ముకశ్మీర్‌లో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిని ఐరాస తీవ్రంగా ఖండిస్తోంది. పౌరులపై దాడి ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. గుటెర్రస్ ఈ ఆందోళనకర పరిస్థితిని నిశితింగా పరిశీలిస్తున్నారు. భారత్–పాకిస్థాన్ దేశాలు సంయమనం పాటించాలని కోరుతున్నాం. ఇరుదేశాల మధ్య ఏదైనా సమస్య ఉంటే శాంతియుత చర్చలతో వాటిని పరిష్కరించుకుంటారని ఆశిస్తున్నాం' అని పేర్కొన్నారు. ఉగ్రదాడికి ప్రతిగా సింధూ నదీ జలాల ఒప్పందం అమలును భారత్ నిలిపివేయడంపై మీడియా ప్రశ్నించగా.. ఈ ఉద్రిక్తతల వేళ ఇరుదేశాలు సంయమనం పాటించి, పరిస్థితులు మెరుగుపడేలా చర్యలు తీసుకుంటాయని ఆశిస్తున్నామని చెప్పారు. గత మంగళవారం మధ్యాహ్నం పహల్గాంలో సైనిక దుస్తుల్లో వచ్చిన ఉగ్రవాదులు పర్యాటకులే లక్ష్యంగా కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. పదుల సంఖ్యలో గాయపడ్డారు. మరికొందరు ప్రాణాలతో తప్పించుకున్నారు.

## ఉగ్రదాడిపై ప్రభుత్వం తీసుకునే ఏ చర్యకైనా మద్దతిస్తాం : రాహుల్‌గాంధీ

భారతీయులంతా ఐక్యంగా ఉండటం చాలా అవసరమని, తద్వారా ఉగ్ర చర్యలను, వారి లక్ష్యాలను దీటుగా ఎదుర్కోవచ్చని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ అన్నారు.



పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని విపక్షాలన్నీ ముక్తకంఠంతో ఖండించాయని, ఈ దాడికి ప్రతిగా ప్రభుత్వం ఏ చర్యలు తీసుకున్నా తాము మద్దతిస్తామని ఆయన స్పష్టంచేశారు. ఇవాళ శ్రీనగర్‌లో పర్యటించిన రాహుల్ గాంధీ.. జమ్ముకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్‌తో, సీఎంతో భేటీ అయ్యారు. అనంతరం ఉగ్రదాడి బాధితులను కలిసి మాట్లాడారు. సమాజాన్ని ముక్కలు చేయడం, సోదరుల మధ్య తగాదాలు సృష్టించడమే ఉగ్రవాదుల పని అని రాహుల్‌గాంధీ అన్నారు. భారతీయులంతా ఐక్యంగా ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడం ఎంతో ముఖ్యమని చెప్పారు. కశ్మీర్‌తోపాటు దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారిపై కొందరు దాడులు చేయడం అత్యంత బాధాకరమని, మనందరం ఐక్యంగా ఉండి ఉగ్రవాదాన్ని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. తాను లెఫ్టినెంట్ గవర్నర్‌తో, ముఖ్యమంత్రితో భేటీ అయ్యానని, దాడి గురించి వారు వివరించారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఉంటుందని వారిద్దరికీ తాను హామీ ఇచ్చానని తెలిపారు.

# తెలంగాణ ఉద్యమానికి.. సిద్దిపేటకు పేగు బంధం

-మొదటిపేజీ తరువాయి

చేశారు. లంకలో రావణుడి అరాచకాలను అరికట్టడానికి ఆనాడు రామదండు కదిలింది. నేడు మన రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను ఎదిరించడానికి ఈ గులాబీ దండు కదిలిందని చెప్పారు. సిద్దిపేట నియోజకవర్గం కేంద్రం రంగదాంపల్లి అమర వీరుల స్థూపం నుంచి వరంగల్ సభ వద్దకు వెయ్యి మంది విద్యార్థి, యువత చేపట్టిన పాదయాత్రను హరీశ్‌రావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'కాశ్మీర్‌లోని పెహల్గాం ఉగ్రదాడిలో మరణించిన వారికి 2 నిమిషాలు శ్రద్ధాంజలి ఘటిద్దాం. ఈరోజు మన సిద్దిపేట నుంచి పాదయాత్రలో బయలుదేరిన విద్యార్థి యువ మిత్రులకు, ఉద్యమకారులకు, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు అందరికీ శిరస్సు వంచి నమస్కారం తెలియజేస్తున్నా. 44 డిగ్రీల ఎండను కూడా లెక్క చేయకుండా 1500 మంది ఈనెల 27న వరంగల్‌లో జరగబోయే పార్టీ రజతోత్సవం కోసం స్వచ్ఛందంగా తరలివచ్చిన మీకు హృదయపూర్వక శుభాకాంక్షలు. తెలంగాణ ఉద్యమానికి సిద్దిపేటకు అవినావాభావ సంబంధం ఉంది. ఆనాటి కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష కైనా, 2001లో బీఆర్ఎస్ పార్టీ ప్రారంభమైన సందర్భమైనా సిద్దిపేటకు పేగు బంధం ఉంది. మీరు చేస్తున్న ఈ పాదయాత్ర రేపటి బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడానికి విజయ యాత్రగా కాబోతున్నది. బీబిఆర్ఎస్ పార్టీ పుట్టిన నాడు చాలామంది చాలా రకాలుగా మాట్లాడారు. గాలి బుడగ లాంటిది, పాలపొంగు లాంటిదని, అమాసకు పుట్టింది పున్నానికి పోతది అని కూడా అన్నారు. మనల్ని అన్న వాళ్లు ఆగమయ్యారు తప్ప బీఆర్ఎస్ పార్టీ ఆగం కాలేదు. చాలా పార్టీలు పుడుతుంటాయి.. పోతుంటాయి. కానీ బీఆర్ఎస్ పార్టీ లక్ష్యాన్ని ముద్దాడింది. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన పార్టీగా చరిత్రలో నిలిచింది. కేసీఆర్ నాయకత్వంలో అంబేద్కర్, గాంధీల మార్గంలో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించాం. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ బోధించు, సమీకరించు, పోరాడు అని అన్నారు. అదే పద్ధతిలో కేసీఆర్, ప్రొఫెసర్ జయశంకర్ ప్రజలందరికీ తెలంగాణ ఎందుకు అవసరమో బోధించారు. సమైక్యవాదులపై, ఢిల్లీ పెద్దలపై పోరాటం చేసి రాష్ట్రాన్ని సాధించారు. 1969లో చాలామంది అమరులయ్యారు. ఎంతోమంది విద్యార్థులు మరణించారు.



పోలీస్ కాల్పుల్లో 369 మంది చనిపోయారు. ఆనాటి హింసను దృష్టిలో పెట్టుకొని మలిదశ ఉద్యమంలో కేసీఆర్.. గాంధీ గారు చూపిన బాటలో తెలంగాణ ఉద్యమాన్ని ముందుకు నడిపారు. 14 ఏండ్ల ఉద్యమం, 10 ఏళ్ల ప్రభుత్వం, ఇప్పుడు ఏడాదిన్నర ప్రతిపక్షం. ఏ పాత్ర అయినా బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ పక్షం. రాష్ట్ర సాధన కోసం, మన ఆత్మగౌరవం కోసం 14 ఏండ్లు పోరాటం చేశాం. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి సంక్షేమాల్లో దేశానికి ఆదర్శంగా నిలిపాం. ధాన్యం ఉత్పత్తిలో, తలసరి ఆదాయంలో, జీఎస్డీపీలో తెలంగాణను నంబర్ వన్‌గా నిలిపాం. అంతేకాదు డాక్టర్ల ఉత్పత్తిలో కూడా తెలంగాణ మొదటి స్థానంలో ఉంది. తెలంగాణ రాష్ట్రం ప్రారంభించిన పథకాలు మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, రైతుబంధు వంటి పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయి. కాంగ్రెస్ పార్టీ 420 హామీలు ఇచ్చింది. ఆ పార్టీ చెప్పిన మోసపూరిత మాటలు, అబద్ధపు హామీలు ప్రజలకు అర్థమయ్యాయి. ఓడినా, గెలిచినా ప్రజల పక్షాన, ప్రజల మధ్యలో ఉండి కొట్లాడే పార్టీ బీఆర్ఎస్ మాత్రమే. ఈరోజు ఈ పాదయాత్ర కాంగ్రెస్ పార్టీకి చెంపపెట్టు కావాలి. ఆరోజు లంకలో రావణుడు చేసే అరాచకాలను ఎదిరించడానికి రామదండు కదిలింది. అలాగే ఈరోజు కాంగ్రెస్ పార్టీ, రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను ఎదిరించడానికి ఈ గులాబీ దండు కదిలింది. మూడు రోజులపాటు 70 కిలోమీటర్లు పాదయాత్ర చేసి గులాబీ దండు రజతోత్సవ సభను విజయవంతం చేయడానికి కదిలింది. ఈ పాదయాత్ర విజయవంతం చేయడానికి అందరూ క్రమశిక్షణతో ట్రాఫిక్‌కు ఇబ్బందులు జరగకుండా నడవాలి. ఎవరికి చిన్న ప్రమాదం కానీ గాయం కానీ జరిగితే నా గుండె బాధపడుతుంది. కాబట్టి అందరూ జాగ్రత్తగా వ్యవహరించాలని కోరుతున్నా. పాదయాత్రలో ప్రజలకు కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అరాచకాలను వివరించండి. ప్రతిరోజు మధ్యాహ్నం, రాత్రి భోజన సమయంలో మిమ్మల్ని కలుసుకుంటాను. గ్రామాల వారీగా, మండలాల వారీగా, పట్టణాల వారీగా టీములు క్రమశిక్షణతో ముందుకు సాగాలి. మీకు అన్ని వసతులను ఏర్పాటు చేస్తాం. కంటికి రెప్పలా చూసుకునేందుకు మన పార్టీ సీనియర్ నాయకులు మిమ్మల్ని పర్యవేక్షిస్తారు.' అని తెలిపారు.

# గూగుల్‌లో ట్రెండింగ్ టాపిక్‌గా పహల్గామ్

**హైదరాబాద్ :** జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడిపై భారతదేశంలో మాత్రమే కాదు, పాకిస్తాన్‌లో కూడా వాతావరణం వేడెక్కింది. మంగళవారం అంటే ఏప్రిల్ 22న జరిగిన ఈ దాడిపై ఒకవైపు భారతదేశంలో కోపం, ఆవేదన వ్యక్తం చేస్తుంది. మరోవైపు పాకిస్తాన్ ఇంటర్నెట్ వినియోగదారులు కూడా ఈ ఘటన గురించి ఆరా తీస్తున్నారు జరుగుతున్న చర్చల్లో పాల్గొంటున్నారు. భారత్ చేపట్ట చర్యల గురించి తెలుసుకుంటున్నారు. ఈ దాడి తరువాత పాకిస్తాన్‌లోని సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ చీ (గతంలో ట్విట్టర్) గూగుల్‌లో దీనికి రిలేటెడ్‌గా ఉండే కీవర్డ్స్ వేగంగా ట్రెండ్ అవుతున్నాయి. నివేదికల ప్రకారం, పాకిస్తాన్‌లోని ప్రజలు పెద్ద సంఖ్యలో 'పహల్గాం, పహల్గాం ఎటాక్, కాశ్మీర్, పుల్వామా, జమ్ము ' వంటి పదాల గురించి వెతుకుతున్నారు. ఈ ఉగ్రవాద ఘటన తరువాత భారతీయ సోషల్ మీడియాలో హ్యాష్‌ట్యాగ్‌లు ట్రెండ్ అవుతుండగా, పాకిస్తాన్‌లో కూడా ఈ దాడిపై ప్రజల ఆసక్తి కనిపిస్తోంది. సోషల్ మీడియాలో పాకిస్తాన్ వినియోగదారులు ఈ దాడిపై వేర్వేరుగా స్పందిస్తున్నారు. ఈ దాడిపై పొరుగు దేశం పాకిస్తాన్ నుంచి ఒక అధికారిక ప్రకటన కూడా వచ్చింది. పాకిస్తాన్ రక్షణ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ ఈ ప్రకటన విడుదల చేశారు. ఈ దాడిలో పాకిస్తాన్‌కు ఎలాంటి సంబంధం లేదని ఖండించారు. అయితే, సోషల్ మీడియాలో పాకిస్తాన్ వినియోగదారుల ప్రతిస్పందన ద్వారా ఈ ఘటన అక్కడ కూడా కలకలం రేపిందని స్పష్టమవుతోందిఅదే సమయంలో భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తీవ్రంగా



స్పందించారు. ఉగ్రవాదాన్ని భారతదేశం సహించదని ఆయన అన్నారు. అంతేకాదు దానికి తగిన ప్రతిస్పందన ఇస్తుందని అన్నారు. అలాగే ఈ దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ఆయన ప్రగాఢ సంతాపం తెలిపారు. ఢిల్లీలోని ఒక కార్యక్రమంలో రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ, 'ఈ దాడి అమానుషమైనది మాత్రమే కాదు, సిగ్గుచేటు ప్రయత్నం. దీనికి స్పందన కచ్చితంగా బలంగా ఉంటుంది. చేసిన వాళ్లనే కాకుండా దీని వెనుక ఉన్న వారిని కూడా బయటకు లాగుతాం' అని అన్నారు. గూగుల్‌లో ట్రెండ్ అవుతున్న కీవర్డ్‌లు భారతదేశం మాత్రమే కాదు, పాకిస్తాన్ ప్రజలు కూడా పహల్గాం దాడికి సంబంధించిన వివరాలు తెలుసుకోవడానికి ఆసక్తిగా ఉన్నారని స్పష్టంగా తెలుస్తోంది. సెర్చ్ ట్రెండ్స్ ద్వారా పాకిస్తాన్ పౌరులు భారత్-పాక్ సంబంధాలపై దీని ప్రభావాన్ని గురించి ఆందోళన చెందుతున్నారని వెల్లడైంది.

# కేటీ రామారావుకు ఫుల్ పవర్స్

**హైదరాబాద్ :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాత్రం వచ్చే ఎన్నికల్లో కీలకంగా మారనున్నారు. ఎన్నికల్లో ఆయనే అంతా డిసైడ్ చేసేటట్లున్నారు. కేసీఆర్ పార్టీ అధినేతగా ఉన్నప్పటికీ ఆయన గౌరవం ఆయనకు ఉంటుంది. ఆయన సలహాలు, సూచనలు మాత్రమే తీసుకుంటారు. కేసీఆర్ చెప్పే వ్యూహాలను రాజకీయంగా అమలు చేయనున్నారు. అంతే తప్ప నియోజకవర్గాల్లో కేసీఆర్ జోక్యం మాత్రం ఇక ఉండకపోవచ్చని అంటున్నారు. ఇక వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే కేటీఆర్ ముఖ్యమంత్రి అవుతారు. కేసీఆర్ రాజకీయంగా యాక్టివ్ గా ఉండకపోవచ్చన్న ఊహాగానాలు గులాబీపార్టీలో జోరుగా ఊపందుకుంటున్నాయి. అదే సమయంలో కేటీఆర్ ను ప్రసన్నం చేసుకోవడానికి నేతలు కూడా క్యూ కడుతున్నారు. వచ్చే ఎన్నికలకు ముందు అంటే రానున్న ఏడాది తాను తెలంగాణ వ్యాప్తంగా పాదయాత్ర చేస్తానని ఇప్పటికే ప్రకటించారు. ఇప్పటికే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఉన్న కేటీఆర్ వచ్చే ఏడాది పాదయాత్ర చేసిన తర్వాత కీలకమైన నిర్ణయాలు తీసుకునే అవకాశముంది. ఇప్పటికే అక్టోబరు నెలలో బీఆర్ఎస్ అధ్యక్షుడి ఎంపిక జరుగుతుందని కూడా కేటీఆర్ ప్రకటించారు. ఇక తాజాగా కేటీఆర్ రాజేంద్ర నగర్ ఉప ఎన్నికల్లో పటోళ్ల కార్తీక్ రెడ్డి పేరును ప్రకటించడం కూడా ఈ చర్చకు కారణమయింది. ఏ మాత్రం కేసీఆర్ తో సంబంధం లేకుండా ముందుగానే, ఉప ఎన్నికల ఊసే లేకముందే అభ్యర్థిని ప్రకటించడంతో ఇంకా కారు స్టీరింగ్ కేటీఆర్ చేతుల్లోనే ఉన్నట్లు స్పష్టమయింది. కేసీఆర్ కూడా తొలి పదేళ్ల పాటు ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఇక పెద్దగా ఆయన రాష్ట్రం కోసం పనిచేయాలన్న ఆకాంక్ష కూడా లేదు. దీంతో పాటు ఎక్కువ కాలం ఫామ్ హౌస్ లోనే పరిమితమవుతున్నారు. వ్యవసాయంలోనే ఆయన ఎక్కువ గడుపుతూ చాలా వరకూ సేద తీరుతున్నారు. వ్యవసాయ క్షేత్రం అంటే ఆయనకు మక్కువ. రాజకీయంలో అంచులన్నీచూశారు. పార్లమెంటు సభ్యుడిగా, కేంద్ర మంత్రిగా, రాష్ట్ర ముఖ్యమంత్రిగా పనిచేసిన కేసీఆర్ కు మిగిలిన రాజకీయ నేతలకు మాదిరిగా పెద్ద లక్ష్యాలు ఏవీ ఉండవు. కానీ తాను స్థాపించిన పార్టీని మరొకసారి అధికారంలోకి తీసుకు వస్తే చాలునన్న భావనలో ఉన్నారు. అందుకే ఈసారి ఎన్నికలలో కేటీఆర్ క్రియాశీలకంగా మారనున్నారు. టిక్కెట్లను కూడా ఆయనే కేటాయించనున్నారు. ఇది ఫైనల్ అంటూ గులాబీ పార్టీలే అభిప్రాయపడుతున్నాయి.

## మంత్రి వర్గం వాయిదాల పర్వంతోనే సరి..

**హైదరాబాద్:** ఇదిగో.. అదిగో.. అన్నారు. కొందరైతే డేట్ కూడా ఫిక్స్ చేశారు. తీరా చూస్తే ఏదీ లేదు. వాయిదాల పర్వం కొనసాగుతూనే ఉంది. తెలంగాణలో మంత్రివర్గ విస్తరణ ఎప్పుడనేది.. అసలు అంతుచిక్కని ప్రశ్నగా మారిపోయింది. అయితే ఇప్పుడు మీనాక్షి నటరాజన్ కామెంట్స్‌తో మరోసారి కేబినెట్ అంశం తెరపైకొచ్చింది. మంత్రివర్గ విస్తరణ ఎవరి పరిధిలో ఉంటుందన్న టాపిక్‌పై తెలంగాణలో హాట్‌హాట్ డిబేట్స్ నడుస్తున్నాయిమంత్రివర్గ విస్తరణ కోసం ఎన్నాళ్లుగానో ఎదురుచూపులు.. అంతకంతకూ పెరిగిపోయిన ఆశావహులు.. కాలం గడిచిపోతున్నా పదవీ కాంక్ష నెరవేరని నాయకుల ప్రయత్నాలకు ఫుల్‌స్టాప్ పడింది. ఇప్పట్లో కేబినెట్ విస్తరణ కష్టమేనన్న సంకేతాలతో కొన్నాళ్లుగా నేతలంతా సైలెంట్ అయిపోయారు. అయితే లేటెస్ట్‌గా మంత్రివర్గ విస్తరణపై రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్ చేసిన వ్యాఖ్యలు సరికొత్త చర్చకు తెరలేపాయి. కేబినెట్ విస్తరణ అంశం ముఖ్యమంత్రి పరిధిలో ఉందంటూ పేర్కొనడం చర్చనీయాంశంగా మారింది. ఈ కామెంట్సే ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారాయి. మొన్నటిదాకా కేబినెట్ విస్తరణ అంశం కాంగ్రెస్ హైకమాండ్ చేతిలో ఉంటుందని చెబుతూ వచ్చారు సీఎం రేవంత్ రెడ్డి. పార్టీ కోసం కష్టపడ్డ నాయకులనే మంత్రిపదవి వరిస్తుందని.. ఆ నేతలు ఎవరనేది మాత్రం నిర్ణయించేది అధిష్టానమే పదేపదే చెప్పారు రేవంత్‌రెడ్డి. దీంతో ఖాళీగా ఉన్న ఆరు మంత్రి పదవుల కోసం ఎంతోమంది సీనియర్లు అధిష్టానం పెద్దలను కలవడం, లేఖలు రాయడం జరిగింది. సీనియర్ నేత జానారెడ్డి కూడా హైకమాండ్‌కు లెటర్ రాశారు. రంగారెడ్డి జిల్లాకు ఛాన్సివ్వాలని ఖర్గేకు, కేసీ వేణుగోపాల్‌కు లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. ఇక ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అయితే ఓ అడుగు ముందుకేసి.. తనకు మంత్రి పదవి ఇవ్వకపోతే పార్టీకే రాజీనామా చేస్తానంటూ పార్టీ పెద్దలకే అల్టిమేటం ఇచ్చారు. అలాగే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లానుంచి బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఢిల్లీ చుట్టూ చక్కర్లు కొట్టారన్న ప్రచారం జరిగింది. ఇటు నల్గొండ నుంచి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సైతం ఢిల్లీ పెద్దలతో లాబీయింగ్ జరిపినట్లు జోరుగా ప్రచారం నడిచింది. ఇలా ఒక్కరేంటి? మంత్రివర్గంలో చోటు దక్కించుకోవాలన్న తపనతో ఎందరో నేతలు హస్తినబాట పట్టారు. మరికొందరు విజ్ఞప్తి లేఖలు ఢిల్లీకి పంపారు. మొత్తంగా? కేబినెట్ విస్తరణపై సీఎం రేవంత్ ఒకలా.. తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ మరోలా మాట్లాడటంతో నేతలంతా కన్ఫ్యూజన్‌లో పడ్డట్లు తెలుస్తోంది. మరీ ఈ కేబినెట్ విస్తరణ కన్ఫ్యూజన్‌పై క్లారిటీ రావాలంటే కాస్త ఆగాల్సిందే..!

## 'భారత్ సమ్మిట్ చారిత్రాత్మకమైనది"

-మొదటిపేజీ తరువాయి

భారత్ సమ్మిట్ లో గ్లోబల్ జస్టిస్ కోసం ప్రపంచ దేశాల ప్రతినిధులు పాల్గొన్నారన్నారు. హెచ్ఐసీసీ వేదికగా తొలిరోజు జరిగిన భారత్ సమ్మిట్ గురించి మల్లు భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడారు. 'గ్లోబల్ జస్టిస్ కోసం ప్రపంచ దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. సోషల్ జస్టిస్, శాంతి తదితర అంశాలపై సమ్మిట్ లో చర్చించారు. సామాజిక న్యాయం, అభివృద్ధిపై డెలిగేట్స్ తో చర్చించాం. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల పట్ల విదేశీ ప్రతినిధులు సంతోషం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ న్యాయ్ కార్యక్రమం పట్ల డెలిగేట్స్ హర్షం వ్యక్తం చేశారు. ఉగ్రవాదుల దాడికి నిరసనలో విదేశీ ప్రతినిధులు పాల్గొంటామని అన్నారు. కశ్మీర్ ఉగ్రవాద దాడిపై దేశ వ్యాప్తంగా నిరసనలు వ్యక్తం అవుతున్నాయి. నెక్లెస్ రోడ్డులో జరిగే కొవ్వొత్తుల ర్యాలీలో విదేశీ ప్రతినిధులు పాల్గొంటారు' అని మల్లు భట్టి విక్రమార్క తెలిపారు.

## మరోసారి పాకిస్థాన్‌ను ఓడించాలి

-మొదటిపేజీ తరువాయి

గట్టిగా బుద్ధి చెప్పాలి. అభివృద్ధి పథంలో నడుస్తున్న భారత్‌పై ఉగ్రదాడి జరిగింది. పార్టీలు, సిద్ధాంతాలకు అతీతంగా ఉగ్రవాదంపై పోరు జరపాలి. అందరం ఏకమై తీవ్రవాదాన్ని అంతం చేసి ప్రపంచానికి ఆదర్శంగా నిలవాలి. ఉగ్రదాడికి పాల్పడిన వారికి కఠినంగా శిక్షించాలి" అని అన్నారు.

## ఎన్‌డీఎస్ఏ నివేదిక చూసి సిగ్గుపడండి.. బీఆర్ఎస్‌పై ఉత్తమ్ ఆగ్రహం




**హైదరాబాద్, ఏప్రిల్ 25:** బీఆర్ఎస్‌పై మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై ఎన్‌డీసీఏ (నేషనల్ డ్యామ్ సేఫ్టీ ఆథారిటీ) ఇచ్చిన నివేదికను చూసి బీఆర్ఎస్ నేతలు సిగ్గు పడాలంటూ మండిపడ్డారు. కాళేశ్వరంతో అద్భుతాలు సృష్టిస్తున్నామని చెప్పి లక్ష కోట్ల ప్రాజెక్ట్ కట్టారని.. ఎన్‌డీఎస్ఏ నివేదిక చూసి బీఆర్ఎస్ సిగ్గుపడాలన్నారు. 'మీరే డిజైన్ చేశారు.. మీరే కట్టారు.. మీరుండగానే కూలిపోయింది' అని తెలిపారు. మేడిగడ్డ సుందిళ్ళ నిరుపయోగంగా ఉన్న రికార్డు స్థాయిలో పంటలు పండాయని తెలిపారు. అబద్ధాలు తప్పులపై బతకాలని బీఆర్ఎస్ అనుకుంటోందని.. అది కుదరదని స్పష్టం చేశారు. నిర్మాణం చేసిన వాళ్ళు.. చేయించిన వాళ్ళు రైతులకు ద్రోహం చేశారని ఆరోపించారు. 'ఎన్‌డీఎస్ఏను రేవంత్ రెడ్డినో.. నేనో వేసింది కాదు. దేశంలో బెస్ట్ ఎక్స్‌పర్ట్స్ ఎన్‌డీఎస్ఏలో ఉన్నారు. మీరు అధికారంలో ఉన్నప్పుడే ఎన్‌డీఎస్ఏ వచ్చింది ' అని చెప్పుకొచ్చారు. రైతులకు బీఆర్ఎస్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్‌డీఎస్ఏ రిపోర్టుపై అధ్యయం చేస్తామన్నారు. వచ్చే కేబినెట్‌లో ఎన్‌డీఎస్ఏపై చర్చించి చర్యలు తీసుకుంటామన్నారు. ఎవడి అయ్య జాగీరు అని కట్టారని ప్రశ్నిస్తూ.. కాళేశ్వరం రైతుల కోసం కాదు జేబులు నింపుకునేందుకు కట్టారు అంటూ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు

## టూర్.. డర్!

-మొదటిపేజీ తరువాయి

చేస్తున్నారు. కాశ్మీర్ లో సాధారణ పరిస్థితులు నెలకొనడంతో అక్కడి ప్రకృతి అందాలను వీక్షించేందుకు ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు. జైపూర్, ఉదయ్‌పూర్ వంటి చారిత్రక నగరాల్లో డెస్టినేషన్ వెడ్డింగ్స్‌కు డిమాండ్ భారీగా పెరిగింది.

**10 వేల మందికిపైగా..**

కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు పర్యాటకుల రాకపోకలు విస్తరించాయి. 'మే మొదటి వారంలోనే హైదరాబాద్ నుంచి కశీమ్‌ర్‌కు వెళ్లేందుకు 5 గ్రూపులు బుక్ అయ్యాయి. ఇప్పుడు వాళ్లంతా తమ టూర్లను రద్దు చేసుకున్నారు. ఇప్పుడు పరిస్థితి అంతా తలకిందులైంది' అని హిమాయత్‌నగర్‌కు చెందిన ట్రావెల్ ఏజెంట్ పవన్ విచారం వ్యక్తం చేశారు. కాశ్మీర్ ఉగ్ర ఘటన నేపథ్యంలో ఈ రెండు నెలల్లో తెలుగు రాష్ట్రాల నుంచి కశ్మీర్‌కు వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకున్న సుమారు 10 వేల మందికి పైగా పర్యాటకులు టూర్లను రద్దు చేసుకున్నట్లు ట్రావెల్స్ సంస్థలు అంచనా వేశాయి.

**అమర్‌నాథ్ యాత్రపై ప్రభావం..**

మరోవైపు జూలైలో జరగనున్న అమర్‌నాథ్‌యాత్రపైనా పహల్గాం దాడి ఘటన ప్రభావం చూపే అవకాశం ఉంది. ప్రస్తుతం తమ వద్ద నమోదు చేసుకున్న 70 బుకింగ్‌లు నిలిచిపోయినట్లు అమీర్‌పేట్‌కు చెందిన ఓ సంస్థ ప్రతినిధి పేర్కొన్నారు. అమర్‌నాథ్ యాత్రకు వెళ్లేందుకు ఆసక్తి చూపిన ఎంతోమంది ఇప్పుడు సందిగ్ధంలో పడిపోయారు. ప్రస్తుతం నెలకొన్న ఉద్రిక్త వాతావరణం సద్దుమణిగి జూలై వరకు సాధారణ పరిస్థితులు నెలకొంటే మార్పు రావచ్చు. కాశ్మీర్ పర్యటనలను రద్దు చేసుకున్న వాళ్లు చాలామంది సిమ్లా, ఉత్తరాఖండ్, ఊటీ, మనాలీ వంటి ప్రాంతాలను ప్రత్యామ్నాయంగా ఎంపిక చేసుకుంటున్నారు.

## అక్బర్ నగర్‌లో ఎంపి వంశీకృష్ణ పర్యటన

**పెద్దపల్లి :** రామగుండం అక్బర్ నగర్ లో ఎన్టిపిసి బూడిద పైప్ లైన్ పగిలి ఇండ్లలోకి చేరి దెబ్బతిన్న ఇండ్లను పెద్దపెల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ పరిశీలించారు. నష్టపోయిన తమను ఆదుకోవాలనీ అయనను కాలనీ వాసులు కోరారు. ఎన్టిపిసి అధికారులను పైప్ లైన్ పగలడానికి గల కారణాలు ఎంపి తెలుసుకున్నారు. వంశీ మాట్లాడుతూ ఫ్లాయాస్ అనేది ఒక విషపూర్తిమైంది... అలాంటి విషయం లో ఎన్టిపిసి యాజమాన్యం జాగ్రత్తలు పాటించాలి. ఈ యాష్ వల్ల అనారోగ్య సమస్యలు ఏర్పడతాయని అన్నారు. బూడిదతో నిండిన ఇళ్లను పరిశీలించి బాధితులను ఓదార్చారు. పైప్ లైన్ ప్రమాదంపై ఎన్టిపిసి అధికారులతో చర్చించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని హెచ్చరించారు. రామగుండం ప్రజల రక్షణే ఎన్టీపీసీ ప్రథమ బాధ్యత. ఈ నిర్లక్ష్యాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్తానని అన్నారు.

## తాడేపల్లిగూడెం నిట్ సమీపంలో రోడ్డు ప్రమాదం.

**ఒకరు మృతి..మరోకరికి తీవ్ర గాయాలు**

**తాడేపల్లిగూడెం :** నిట్ దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. మరోకరికి తీవ్ర గాయాల్యాయి. ఆగి ఉన్న లారీని ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ద్విచక్ర వాహనంపై ఇద్దరు యువకులు ప్రయాణిస్తున్నారు. కరణం వెంకటేశ్వరరావు (30) సంఘటన స్థలంలోని మృతిచెందగా, నవీన్ అనే యువకుడు తీవ్ర గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గాయలైన నవీన్ కి చికిత్స నిమిత్తం తాడేపల్లిగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వెంకటేశ్వరావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియాస్పత్రికి తరలించారు.

## సంపాదకీయం

# అమెరికా కౌలు రైతుల దీనగాథలు


భారత దేశంలోను, అమెరికాలోను కౌలు రైతుల చట్టాలు, సమస్యలు, భూకామందుల దోపిడీ దాదాపు ఒకే విధంగా ఉన్నాయి. అమెరికాలోని వ్యవసాయ కుటుంబాల మొత్తం జనాభా 2 శాతం మాత్రం ఉంటే, భారత దేశంలో 68% ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారు. అర్ధవలస, అర్ధభూస్వామ్య వ్యవస్థ, పెట్టుబడిదారీ వ్యవస్థలో ఉన్న వ్యవసాయ వ్యత్యాసం ఇదే. ఉద్యమాలు లేదా వ్యవసాయ సంక్షోభం, రైతుల ఆత్మహత్యల ఫలితంగా పాలక ప్రభుత్వాలు ప్రత్యేక పథకాలు, కౌలుదారీ చట్టాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. భారతదేశంలోని వివిధ రాష్ట్రాలు కౌలుదారీ చట్టాలు చేశాయి. 1950లో తెలంగాణ కౌలుదారీ చట్టం, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1956లో చేసిన ఆంధ్రా కౌలుదారీ చట్టం, 2011లో అధీకృత కౌలుదారీ చట్టం, 2019లో వైసిపి ప్రభుత్వం తెచ్చిన పంట సాగుదార్ల రక్షణ చట్టం మొదలైనవి రైతాంగ ఉద్యమాల ఫలితంగా వచ్చినవే. ఈ అన్ని చట్టాలలోనూ కౌలు ఒప్పందం ఉండాలని, సంస్థాగత రుణాలు, పంట నష్టపరిహారాలు పొందటానికి భూయజమాని అనుమతి ఉండాలని పేర్కొన్నాయి. ఆ విధంగా కౌలుదారీ చట్టాలు అలంకారప్రాయంగా మారాయి. అమెరికాలోనూ కౌలు చట్టాలు ఈ విధంగానే ఉన్నాయి. అమెరికా వ్యవసాయ శాఖ అంచనా ప్రకారం 2017లో 90 కోట్ల ఎకరాల సాగు భూమి ఉంటే, 2024 నాటికి 87 కోట్లు, 60 లక్షలకు తగ్గిందని, తగ్గుదల 3 శాతమని ఎకనమిక్స్ రీసెర్చ్ సర్వీసు ద్వారా తెలియచేయబడింది. 2017 వ్యవసాయ కమతాలు 20 లక్షల 40 వేలు ఉండగా, 2022 నాటికి 20 లక్షల 3 వేలకు తగ్గాయి. 2000 సంవత్సరంలో అమెరికాలో సగటు కమతం భూమి 442 ఎకరాలు కాగా, 2022 నాటికి 441 ఎకరాలకు పెరిగింది. అమెరికాలో 50 ఎకరాల కన్నా తక్కువ భూమి కలిగిన చిన్నకమతాలు 6 లక్షల, 71 వేలు ఉన్నాయి. ఈ కమతాలు సంఖ్య తగ్గటం, మధ్యస్థ భూకమతాలు కూడా తగ్గటం వలన 2 వేల ఎకరాల కన్నా ఎక్కువ భూ విస్తీర్ణం కలిగిన కమతాలు పెరిగి సగటు కమతం భూ విస్తీర్ణం పెరిగింది. సంవత్సరానికి 3 లక్షల 50 వేల డాలర్ల కన్నా తక్కువ ఆదాయం వచ్చిన కమతాలను చిన్న కమతాలు అంటారు. ఇవి మొత్తం కమతాల్లో 86% గా (10 లక్షల 72 వేలు) ఉన్నాయి. సంవత్సరానికి 10 లక్షల డాలర్ల కన్నా ఎక్కువ ఆదాయం పొందే వాటిని పెద్ద కమతాలు అంటారు. మొత్తం కమతాల్లో ఇవి 4%గా ఉన్నాయి. వీటి మొత్తం వ్యవసాయ ఉత్పత్తిలో 48 శాతంగా ఉంది. అమెరికాలో వ్యవసాయ భూమి ఎక్కువ భాగం (సుమారు 60 లేక 70%) వ్యక్తిగత లేదా కుటుంబ కమతాలుగా ఉంది. 2014 లో ఒక సర్వే ప్రకారం 96% కమతాలు కుటుంబ యాజమాన్యంలో ఉన్నాయి. ఇవి 52 కోట్ల, 80 లక్షల ఎకరాలు కలిగి ఉన్నాయి.ల అమెరికాలో కౌలు సేద్యం కీలక పాత్ర పోషిస్తున్నది. మొత్తం రైతుల్లో 28% అంటే 5 లక్షల, 70 వేల మంది కౌలు రైతులు ఉన్నారు. సేద్యంలో, ఉత్పత్తిలో కౌలు రైతులు ముఖ్య భూమిక వహిస్తున్నారు. మొత్తం వ్యవసాయ భూమిలో 40 శాతం (35 కోట్ల, 30 లక్షల ఎకరాలు) కౌలు రైతులు సేద్యం చేస్తున్నారు. ఇందులో 80 శాతం ఎటువంటి వ్యవసాయం చేయని భూకామందుల భూములే ఉన్నాయి. భారత దేశంలో లాగానే అమెరికాలో కూడా ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీలు, పంట రుణాలు కౌలు రైతులకు అందటం లేదు. కౌలు ఒప్పందం కూడా సంవత్సరం లేదా అంతకన్నా తక్కువగా ఉంది. చాలా కౌలు ఒప్పందాలు ముఖ్యంగా చిన్న రైతులు చేసుకునే ఒప్పందాలు భారత దేశంలో లాగానే నోటి మాటపై ఆధారపడి ఉంటాయి. అందువల్ల చట్టపరమైన కౌలు గుర్తింపు ఉండదు. అమెరికా వ్యవసాయ శాఖ కార్యక్రమాల్లో (సబ్సిడీలు, రుణాలు) దరఖాస్తు చేసుకునేందుకు కౌలు రైతులు ఫార్మర్ ఆపరేటింగ్ ప్లాన్ సమర్పించాలి. ఇందుకు కౌలు ఒప్పందం లేదా భూమి యజమాని నుండి లిఖితపూర్వక అనుమతి అవసరం. ఫలితంగా చాలా మంది కౌలురైతులు సబ్సిడీలు, రుణాలు పొందలేకపోతున్నారు. 2022లో అమెరికా ప్రభుత్వం రైతులకు 15.6 బిలియన్ డాలర్ల సబ్సిడీలను ప్రకటించింది. 1995 నుండి 2021 వరకు 478 బిలియన్ డాలర్ల సబ్సిడీలు పంపిణీ చేయబడ్డాయి. ఇడబ్లుజి (ఎన్విరాన్‌మెంట్ వర్కింగ్ గ్రూపు) నివేదిక ప్రకారం అందులో పైస్థాయిలో ఉన్న (పెద్ద, ధనిక కమతాలు) భూ యజమానులే 79% (సుమారు 377 బిలియన్ డాలర్లు) సబ్సిడీల రూపంలో పొందారు. అతి చిన్న కమతాలు కలిగిన 80% రైతులు కేవలం 9% సబ్సిడీలు మాత్రమే అందాయి. కౌలు రైతులు సబ్సిడీలకు అర్హులైనా చాలా సందర్భాల్లో భూయజమానులే వాటిని పొందారు. సబ్సిడీలు పొందటానికి రైతు సంవత్సర ఆదాయం 9 లక్షల డాలర్ల కన్నా తక్కువ ఉండాలి. ఈ నిబంధన ప్రకారం చిన్న రైతులకే ఎక్కువగా సబ్సిడీలు అందాలి. లిఖితపూర్వక కౌలు ఒప్పందం లేకపోవటం, భూయజమాని అనుమతి పత్రం లేకపోవటంతో కౌలు రైతులు సబ్సిడీలకు దూరంగా ఉన్నారు. అమెరికాలో నేడు కౌలు రైతులు సంక్షోభంలో ఉన్నారు. కౌలు రైతులకు సొంత భూమి లేకపోవటం, భూమిని అధిక రేటుకు కౌలుకు తీసుకోవటం, పంట ఖర్చులు పెరగటం, పండించిన పంటలకు తగిన ధరలు లభించకపోవటం, వాతావరణ మార్పులు కౌలు సేద్యం పై ప్రతికూల ప్రభావం చూపటం, సబ్సిడీలు, రుణాలు అందకపోవటం, దేశంలో ఆర్థిక మాంద్యం ఎర్పడినప్పుడు కౌలు రైతుల జీవనోపాధిపై ప్రతికూల ప్రభావం చూపటం కౌలు సేద్య సంక్షోభానికి కారణంగా ఉంది. ఫలితంగా రైతుల ఆత్మహత్యలు కొనసాగుతున్నాయి. అమెరికాలోని సెంట్రల్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రీవెన్సన్ (సిడిసి) ప్రచురించిన ఒక అధ్యయనం ప్రకారం వ్యవసాయం, అటవీ, మత్స్యరంగాల్లో పని చేసే వారిలో ఆత్మహత్యల రేటు ప్రతి లక్ష మందిలో 36 గా ఉంది. ఇది సాధారణ జనాభా మరణాల రేటు (లక్షకు 14.4) కన్నా చాలా ఎక్కువగా ఉంది. 2020లో యూనివర్సిటీ ఆఫ్ ఐవోవా అధ్యయనం ప్రకారం రైతులలో వ్యవసాయ సంబంధిత వృత్తుల్లో ఉన్న వారిలో ఆత్మహత్యల రేటు ప్రతి లక్షకు 43.7గా ఉంది. కౌలు సేద్యపు సంక్షోభం, రైతుల ఆత్మహత్యలు, కౌలురైతుల ఆందోళన నేపథ్యంలో అమెరికా ప్రభుత్వం కొత్త వ్యవసాయ చట్టాన్ని తయారు చేస్తున్నది. ఈ చట్టం ద్వారా కౌలు రైతులు, భూకామందులతో చేసుకునే ఒప్పందాల్లో సబ్సిడీలు, బీమా ప్రయోజనాలు పొందే హక్కును చేకూర్చేలా చేసే మార్గదర్శకాలు, ప్రభుత్వ చేసే సహాయాన్ని యజమానులు అడ్డుకోకుండా చేస్తుందని, నేరుగా కౌలురైతులు సహాయం పొందే అవకాశం కల్పిస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ఇది ఎంతవరకు అమలు జరుగుతుంది అన్నదాని కోసం అమెరికా కౌలురైతులు ఎదురు చూడాల్సిందే. ఎందుకంటే అమెరికా ప్రభుత్వం పెద్ద భూఎస్టేట్ దారుల, కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలు కాపాడేది కావటమే. అందుకు భిన్నంగా వ్యవసాయ చట్టం ఉండదు. భూమిలేని కౌలురైతులకు అవసరం మేరకు భూపంపిణీ చేయాలి. సంక్షేమ పథకాలు, సబ్సిడీలు, రుణాలు కౌలు రైతులకే ఎక్కువ అందాలి. పంటలకు తగిన ధరలు లభించాలి. లిఖితపూర్వక కౌలు ఒప్పందం జరగాలి. పెద్ద భూక్షేత్రాలపై భూపరిమితి విధించి మిగులు భూములు భూమిలేని కౌలురైతులకు పంపిణీ చేయాలి. ఇవి అమలు జరిగితేనే అమెరికాలో కౌలు రైతుల సమస్యలు పరిష్కరించబడతాయి. కౌలు సేద్యపు సంక్షోభం, రైతుల ఆత్మహత్యలు, కౌలురైతుల ఆందోళన నేపథ్యంలో అమెరికా ప్రభుత్వం కొత్త వ్యవసాయ చట్టాన్ని తయారు చేస్తున్నది. ఈ చట్టం ద్వారా కౌలు రైతులు, భూకామందులతో చేసుకునే ఒప్పందాల్లో సబ్సిడీ లు, బీమా ప్రయోజనాలు పొందే హక్కును చేకూ ర్చేలా చేసే మార్గదర్శకాలు, ప్రభుత్వ చేసే సహా యాన్ని యజమానులు అడ్డుకోకుండా చేస్తుందని, నేరుగా కౌలురైతులు సహాయం పొందే అవకాశం కల్పిస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు చెబు తున్నారు. ఇది ఎంతవరకు అమలు జరుగుతుంది అన్నదాని కోసం అమెరికా కౌలురైతులు ఎదురు చూడాల్సిందే. ఎందుకంటే అమెరికా ప్రభుత్వం పెద్ద భూఎస్టేట్ దారుల, కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలు కాపాడేది కావటమే.

# అసమాన శిల్పి గణపతి స్థపతి



ఆధునిక కాలంలో పలు దేవాలయాలు, అపురూప నిర్మాణాలు చూసినపుడు శిల్ప కళకు ప్రతిరూపం అయిన గణపతి స్థపతి వెంటనే స్ఫురణకు రాక మానరు. ఉలి చప్పుళ్ల మధ్య ప్రపంచంలో కళ్లు తెరిచి, ఉలి చప్పుళ్లకే జీవితాన్ని అంకితం చేసి, ఉలి చప్పుళ్ల మధ్యే కళ్లుమూసిన వందలాది దేవుళ్లకు వేలాది ఆలయాలను నిర్మించిన, శిల్పీకరించిన గణపతి స్థపతి అసమాన శిల్పి. దేశం గర్వించదగ్గ శిల్పకళా నిపుణులు. హుస్సేన్ సాగర్‌లోని జిబ్రాల్టర్ రాక్‌పై బుద్ధ విగ్రహం, హైదరాబాద్‌లో బిర్లా మందిర్, చోళ, విజయనగర శిల్పకళారీతుల కలయికతో మహానంది ఆలయ గోపురాలు, పిట్స్‌బర్గ్‌లోని బాలాజీ దేవాలయం, కంచి సమీప 100 స్తంభాలతో నిర్మించిన మణి మంటపం, బద్రీనాథ్ దేవాలయ మహామండపం, తిరుమలలో వసంతరాయ మంటపం, ఇలా ఒక్కొక్క నిర్మాణంలో గణపతి స్థపతి శిల్పకళా చాతుర్యానికి సజీవ సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. గణపతి స్థపతి (26 ఏప్రిల్ 1931 - 7 ఏప్రిల్ 2017) ప్రముఖ స్థపతి, వాస్తు శిల్పి. పూర్తిపేరు సత్తయ్య ముత్తయ్య గణపతి. శ్రీశైలం దేవస్థాన పునరుద్ధరణ, భద్రాచలం రామాలయ మహామండప గోపురాల నిర్మాణంతో గణపతి స్థపతి పేరు తెర మీదకు వచ్చింది. దివంగత ప్రధాని ఇందిరా గాంధీ చేత బంగారు గొలుసు, 60 తులాల డాలర్‌ను బహూకరించప బడి, సత్కరింప బడిన గొప్పతనం ఆయనది. తిరుమలలో వసంతరాయ మంటపాన్ని పునర్నిర్మించి, ఆస్థాన స్థపతి పదవిని దక్కించుకొన్న ప్రతిభ ఆయనది. నాటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు కోరిక మేరకు హైదరాబాద్‌లో హుస్సేన్ సాగర్‌లోని జిబ్రాల్టర్ రాక్‌పై 58 అడుగుల ఎత్తు, 350 టన్నుల బుద్ధుని విగ్రహాన్ని ప్రతిష్ఠింప చేసిన ఘనత ఆయనది. 1931, ఏప్రిల్ 26న ముత్తు స్థపతి, గౌరీ అమ్మన్ లకు సంతానంగా జన్మించిన గణపతి, ఆరేళ్ల చిరుత ప్రాయంలోనే ఉలిని చేతబట్టి అలవోకగా చెక్కడం అభ్యాసం చేశారు. సాంప్రదాయ ఆలయ, వాస్తు, శిల్ప శాస్త్రాలను, కుటుంబ పెద్దల దగ్గర 17 సంవత్సరాల పాటు శిక్షణ పొందారు. శిల్పాలు చెక్కడం లోనూ, ఆలయాలను నిర్మించటం లోనూ కొత్త ఒరవడిని సృష్టించి, ప్రతిభా పాటవాలను ప్రదర్శిస్తున్న గణపతి తమిళనాడు వదిలి, తెలుగునాట కాలు మోపారు. శ్రీశైలం దేవస్థాన పునరుద్ధరణ, భద్రాచలం రామాలయ మహామండప గోపురాల నిర్మాణంతో పేరు తెచ్చుకొన్న గణపతి స్థపతి నైపుణ్యం గురించి, విన్న నాటి దేశ ప్రధాని ఇందిరాగాంధీ, బద్రీనాథ్ దేవాలయ మహామండప పని అప్పగించారు. మండప భాగాలను హైదరాబాద్‌లో తీర్చిదిద్ది, బద్రీనాథ్‌కు తరలించి నిర్మించిన తీరుకు అచ్చెరువొందిన ఆమె, ఒక బంగారు గొలుసు, 60 తులాల డాలర్‌ను బహూకరించి సత్కరించారు. తిరుమల తిరుపతి దేవస్థానాల పిలుపునందుకొని, తిరుమలలో వసంతరాయ మంటపాన్ని పునర్నిర్మించి, ఆస్థాన స్థపతి పదవిని దక్కించుకొన్నారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖలో స్థపతిగా చేరిన గణపతి స్థపతి, ఉమ్మడి రాష్ట్రంలో వందల, వేల ఆలయాలను నిర్మించి, ప్రధాన స్థపతిగా ఎదిగారు. తరతరాల ప్రాచీన వాస్తుశిల్ప సంప్రదాయం, నిరంతరం కొనసాగాలన్న తపనతో, తన ఆధ్వర్యంలో దేవాదాయ శాఖలో ఒక శిల్ప కళాశాలను స్థాపించి, కొన్ని వందల మంది శిల్పుల్ని తయారుచేసి, కొరతను తీర్చారు. రాష్ట్ర వ్యాప్తంగా, శిథిలాలయాలను పదిలం చేస్తూ, లేనిచోట కొత్త వాటిని కడుతూ తలమునకలై ఉన్న గణపతి స్థపతికి శ్రీశైలం జలాశయ నీటి ముంపు దేవాలయాల తరలింపు ఒక సవాలుగా మారింది. కర్నూలు, మహబూబ్ నగర్ జిల్లాల్లోని 102 గ్రామాల్లో ముంపునకు గురైన దాదాపు 108 దేవాలయాలను ఊడదీసి ఎగువన1978%-%89 మధ్య చారిత్రక కార్యక్రమం చేపట్టి, పునర్నిర్మించిన ఘనతను దక్కించుకొన్నారు. వాస్తు, శిల్ప విద్యను అందుబాటు లోకి తేవడానికి పూనుకుని, తమిళ, సంస్కృత భాషల్లోనున్న వాస్తు, శిల్ప, ఆగమ శాస్త్రాలను తెలుగులోకి అనువదించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పెదపాటి నాగేశ్వరరావు సహకారంతో రూపధ్యాన రత్నావళి, కాశ్యప శిల్ప శాస్త్రాలను వెలువరించారు. నిరంతర అధ్యయనంతో పాటు, పరిశోధనలపై దృష్టి సారించిన గణపతి స్థపతి, తెలుగు విశ్వవిద్యాలయం, సచివాలయం భవనాల్లో ఆధునికతకు, సాంప్రదాయ వాస్తును జోడించి, కొత్త ఒరవడిని సృష్టించారు. ఒకసారి అమెరికా వెళ్లిన అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావుకు, న్యూయార్క్‌లో గణపతి స్థపతి తారస పడిన సందర్భంలో, లిబర్టీ స్టాట్యూ లాంటి పెద్ద విగ్రహాన్ని హైదరాబాద్‌లో నెలకొల్పే ప్రయత్నం చేయాలి అన్న ఎన్టీఆర్ కోరికను సాకారం చేసి, హుస్సేన్ సాగర్‌లోని జిబ్రాల్టర్ రాక్‌పై 58 అడుగుల ఎత్తు, 350 టన్నుల బుద్ధుని విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఆ విగ్రహం కోసం యాదగిరి గుట్టకు సమీపంలోని రాయగిరి నుంచి 100 అడుగుల రాయిని, 100 చక్రాల వాహనంపై హైదరాబాద్‌కు తరలించి, గణపతి స్థపతి ప్రపంచ ఖ్యాతిని సంపాదించారు. హైదరాబాద్‌లో బిర్లా మందిర్ రూప శిల్పి ఆయనే. సింహాచలం, కాళేశ్వరం, వేములవాడ లాంటి అనేక ప్రాంతాల్లో పలు ఆలయాలకు కొత్త సొగసులు అద్దారు. శ్రీశైలం, మహానంది ఆలయ గోపురాలను చోళ, విజయనగర శిల్పకళారీతుల కలయికతో నిర్మింప చేశారు. విదేశాల్లో సైతం ఆలయాలను నిర్మించి, తెలుగు శిల్పుల కీర్తిని దశదిశలా విస్తరింప చేయటలో భాగంగా, పిట్స్‌బర్గ్‌లోని బాలాజీ దేవాలయాన్ని నిర్మించారు. ఈ ఆలయం అమెరికా తిరుపతిగా ప్రసిద్ధి చెంది, రోజూ వేల మంది భక్తులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దారు. గణపతి స్థపతి శిల్పకళా చాతుర్యాన్ని గుర్తించిన భారత ప్రభుత్వం, 1990లో అత్యున్నత పురస్కారమైన పద్మశ్రీ ద్వారా గౌరవించింది. ఆయన ప్రతిభకు గుర్తింపుగా, శిల్పకళానిధి, కళైమామణి, శిల్పకళా రత్న వంటి బిరుదులెన్నో వరించాయి. వందలాది దేవుళ్లకు వేలాది ఆలయాలను నిర్మించిన గణపతి స్థపతి కంచి కామకోటి పీఠ పరంపరలోని 68వ పీఠాపతులైన శ్రీశ్రీశ్రీ చంద్రశేఖర సరస్వతి స్వామికి పరమ భక్తులు. శంకరాచార్య ఆకాంక్ష మేరకు, కంచి సమీపంలో నున్న ఒరుక్కై గ్రామంలో తన అద్భుత శిల్పకల్పనా చాతుర్యంతో మలచిన 100 స్తంభాలతో నిర్మించిన మణి మంటప నిర్మాణం, తన చిరకాల వాంఛగా తరచూ పేర్కొనేవారు గణపతి స్థపతి. శంకరాచార్య ప్రమాచార్య శుభాశీస్సులతో అక్కడే శంకర శిల్పశాలను స్థాపించి, వాస్తు, శిల్ప, ఆగమ శాస్త్రాల్లో విద్యార్థులకు శిక్షణనిస్తూ గణపతి స్థపతి, ఏప్రిల్ 7న, ఈ పార్థివ దేహాన్ని వదిలి వెళ్లారు. ఆ మహాశిల్పి ఈ నేలను వదిలినా, ఆయన సృష్టించిన అపురూప, అపూర్వ శిల్పాలు, నిర్మించిన ఆలయాలు, ఆయన శిల్పకళా ప్రతిబింబాలై కళ్లముందు సజీవంగా కదలాడుతూనే ఉన్నాయి.

# అసమాన గణిత శాస్త్రజ్ఞుడు



ప్రపంచ ప్రసిద్ధిగాంచిన గణిత మేధావుల్లో ఒకరిగా గుర్తింపు సాధించిన భారతీయుడు శ్రీనివాస రామానుజన్. గత సహస్రాబ్దిలో ప్రపంచానికి అత్యుత్తమ గణితశాస్త్ర సిద్ధాంతాలను, సూత్రాలను అందించిన అత్యుత్తమ అ'గణిత' మేధావి శ్రీనివాస రామానుజన్ భారతీయుడు కావడం మనందరికీ గర్వకారణం. అపారమైన మేధస్సుతో భారత దేశపు కీర్తిని ప్రపంచ గణిత శిఖరాలపై ఎగురవేసిన మహా గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్. శ్రీనివాస రామానుజన్ అయ్యంగార్ (డిసెంబర్ 22, 1887ఏప్రిల్ 26, 1920) 20వ శతాబ్దంలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన గొప్ప గణిత మేధావులలో ఒకరు. ఆయనకు పది సంవత్సరాల వయసులోనే గణిత శాస్త్రంతో అనుబంధం ఏర్పడింది. పదమూడేళ్లకే ఎస్ఎల్ లోనీ త్రికోణమితిపై రాసిన పుస్తకాన్ని ఔపోసన పట్టడమే కాదు తను సొంతంగా సిద్ధాంతాలు కూడా ప్రారంభించారు. కుంభకోణం గవర్నమెంటు కాలేజీలో చేరిన రామానుజన్ గణితం మీదే శ్రద్ధ చూపి మిగిలిన సబ్జెక్టులపై దృష్టి పెట్టక పోవడంతో ఎఫ్.ఎ. పరీక్ష తప్పారు. ఆ తరువాత మద్రాస్‌లోని పచ్చయ్యప్ప కాలేజీలో చేరారు. అక్కడ ప్రతిభను గమనించిన ప్రొఫెసర్ సింగారవేలు ముదలియార్, రామానుజన్‌తో కలిసి మ్యాథమెటికల్ జర్నల్స్‌లో క్లిష్టమైన సమస్యలను చర్చించి సాధిస్తుండేవారు. మ్యాజిక్ స్క్వేర్స్, కంటిన్యూడ్ ఫ్రాక్షన్స్, ప్రధాన సంఖ్యలు, పార్టిషన్ ఆఫ్ నంబర్స్, ఎలిప్టిక్ ఇంటిగ్రల్స్ వంటి విషయాలపై రామానుజన్ విశేష పరిశోధనలు చేశారు. 1729 సంఖ్యను రామానుజన్ సంఖ్యగా పిలుస్తారు. తీవ్రమైన అనారోగ్యంతో హాస్పిటల్లో ఉన్నప్పుడు కూడా హార్డీతో 1729 సంఖ్య యొక్క ప్రత్యేకతను తెలియజెప్పి ఆయన్ను ఆశ్చర్య చకితుణ్ణి చేశారు. రామానుజన్ అనారోగ్యంతో హాస్పిటల్లో వున్నపుడు, హార్డీ ఆయనను పలుకరించటానికి వెళ్లి మాటల మధ్యలో తాను వచ్చిన కారు నంబరు 1729, దాని ప్రత్యేకత ఏమైనా ఉన్నదా ? అని అడిగారు. అందుకు రామానుజన్ తడుము కోకుండా ఆ సంఖ్య ఎంతో చక్కని సంఖ్య అని, ఎందుకంటే రెండు విధాలుగా రెండు ఘనముల మొత్తముగా వ్రాయబడే సంఖ్యా సమితిలో అతి చిన్నసంఖ్య అని తెల్పారు. (1729 = 1గీ3 o 12గీ3 = 9గీ3 o 10గీ3 ). ఈ సంఘటన గణితంపై ఆయనుకున్న అవ్యాజమైన అనురాగానికి, అంకిత భావానికి నిదర్శనం. మహా మేధావులు కూడా సాధించలేని సమస్యలను అలవోకగా ఎలాంటి పుస్తకాల సాయం లేకుండా సాధించి, ప్రపంచం దృష్టిని తనవైపు తిప్పుకున్న భారతీయ గణిత మేధావి శ్రీనివాస రామానుజన్. రామానుజన్ ఆ కాలంలో సుప్రసిద్ధులైన ఆయిలర్, గౌస్, జకోబి మొదలైన సహజ సిద్ధమైన గణిత మేధావులతో పోల్చదగిన వారు. రామానుజన్ లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించిన హార్డీ, అసలు తను గణిత శాస్త్రానికి చేసిన అత్యుత్తమ సేవ రామానుజాన్ని కనుగొనడమే అని వ్యాఖ్యానించడం విశేషం.. 15ఏళ్ళకే రామానుజన్‌లోని తెలివితేటలను ప్రపంచానికి చాటడానికి దోహదం చేసిన గ్రంథం జార్జ్ స్క్వూచ్‌సిడ్జ్‌కార్ రాసిన 'సినాప్సిస్'. అందులో ఆల్‌జీబ్రా, అనలిటికల్ జామెట్రీ వంటి విషయాల మీద దాదాపు 6165 సిద్ధాంతాలున్నాయి. వీటి నిరూపణలు చాలా కష్టంగా ఉండేవి. పెద్దపెద్ద ప్రొఫెసర్‌లు సైతం అర్థం చేసుకోలేకపోయిన ఈ సిద్ధాంతాలను, సూత్రాలకు రామానుజన్ ఎటువంటి పుస్తకాలను తిరగేయకుండా వాటి సాధనలను అలవోకగా కనుక్కునేవారు. 3,500 గణిత ఫలితాలను సమీకరించిన రికార్డును సొంతం చేసుకున్న మేధావి. 1903లో మద్రాసు విశ్వ విద్యాలయంలో స్కాలర్‌షిప్ వచ్చింది. లెక్కల వల్ల కొడుకుకి పిచ్చి పడుతుందేమోనని భయపడిన రామానుజం తండ్రి ఆయనకు పెళ్ళి చేశారు. సంసారం గడవటం కోసం 25 రూపాయల వేతనం మీద రామానుజన్ గుమాస్తాగా చేరారు. చిత్తు కాగితాలను కూడా బహు జాగ్రత్తగా వాడుకుంటూ గణితమే లోకంగా బతికేవారు. గణితంలో ఆయన ప్రదర్శిస్తున్న ప్రజ్ఞను చూచి ఏ డిగ్రీ లేకపోయినా మద్రాసు విశ్వ విద్యాలయం నెలకు 75 రూపాయల ఫెలోషిప్ మంజూరు చేసింది. 1913లో మద్రాస్ పోర్ట్‌ట్రస్ట్‌కు వచ్చిన ప్రసిద్ధ గణిత శాస్త్రవేత్త డా.వాకర్ రామానుజన్ పరిశోధనలు చూసి ఆశ్చర్యపోయి, రామానుజన్ కనుగొన్న 120 పరిశోధనా సిద్ధాంతాలను ఆ కాలంలో ప్రసిద్ధుడైన కేంబ్రిడ్జి ప్రొఫెసర్ గాడ్ ఫ్రెహెరాల్డ్ హార్డీ (1877-1947)కి పంపారు. ఉన్నతస్థాయి గణితజ్ఞుడు రాయగల ఆ ఫలితాలను చూసి వెంటనే రామానుజన్‌ను జి.హెచ్.హార్డీ కేంబ్రిడ్జి యూనివర్శిటీకి ఆహ్వానించారు. జీవిత చరమాంకంలో రామానుజన్ రాసిన మ్యాజిక్ స్క్వేర్, ప్యూర్ మాథ్స్‌కు చెందిన నెంబర్ థియరీ, మాక్ తీటా ఫంక్షన్స్ చాలా ప్రసిద్ధి పొందాయి. 33 ఏళ్ళకే ఆయన 1926, ఏప్రిల్ 26న మరణించారు. ఫెలో ఆఫ్ ద ట్రినిటీ కాలేజి గౌరవం పొందిన తొలి భారతీయుడిగానూ, ఫెలో ఆఫ్ ద రాయల్ సొసైటీ గౌరవం పొందిన రెండో భారతీయుడిగానూ ఆయన చరిత్రకెక్కారు. రామానుజన్ స్వరాష్ట్రమైన తమిళనాడు, ఆ రాష్ట్ర వాసిగా ఆయన సాధించిన విజయాలకు గుర్తుగా ఆయన జన్మదినమైన డిసెంబర్ 22 ను రాష్ట్ర సాంకేతిక దినోత్సవంగా ప్రకటించింది. భారత ప్రభుత్వం 1962 వ సంవత్సరంలో ఆయన 75వ జన్మదినం నాడు, సంఖ్యా శాస్త్రంలో ఆయన చేసిన విశేష కృషిని కొనియాడుతూ స్మారక తపాలా బిళ్ళను విడుదల చేసింది. 2012లో అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ రామానుజన్ పుట్టినరోజును జాతీయ గణిత దినోత్సవంగా ప్రకటించారు. 125వ జయంతి సందర్భంగా 2014ను భారత ప్రభుత్వం జాతీయ గణితశాస్త్ర సంవత్సరంగా ప్రకటించింది. రామానుజన్ ఆ కాలంలో సుప్రసిద్ధులైన ఆయిలర్, గౌస్, జకోబి మొదలైన సహజ సిద్ధమైన గణిత మేధావులతో పోల్చదగిన వారు. రామానుజన్ లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించిన విదేశీ ప్రొఫెసర్ హార్డీ, అసలు తను గణిత శాస్త్రానికి చేసిన అత్యుత్తమ సేవ రామానుజాన్ని కనుగొనడమే అని వ్యాఖ్యానించడం విశేషం..

# ఇన్ఫంట్ హాండ్లూం హాండిక్రాఫ్ట్ ఎగ్జిబిషన్ ని ప్రారంబిస్తున్న ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దిన్,నిర్వహకులు రిబ్బన్





**మెహిదీపట్నం,ఏప్రిల్ 25 (సూర్యరేఖ)** కార్వాన్ నియోజకవర్గం పరిధిలోని లంగర్ హౌస్ భాపుఘాట్ ప్రాంతంలో 60 రోజుల పాటు నిర్వహించు ఇన్ఫంట్ హాండ్లూం హాండిక్రాఫ్ట్ ఎగ్జిబిషన్ నిర్వహకులు రాబ్సన్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమ ప్రారంబోత్సవానికి ముఖ్య అతిథులుగా కార్వాన్ నియోజకవర్గం ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దిన్ హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంబించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కౌసర్ మాట్లాడుతూ...వేసవి సెలవుల్లో చిన్నపిల్లలకు విజ్ఞానంతో కూడిన వినోదం అందించేందు నిర్వహకులు రాబ్సన్ ఇన్ఫంట్ హాండ్లూం హాండిక్రాఫ్ట్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఎగ్జిబిషన్ను లండన్ సిటీ ఇన్ హైద్రాబాద్ థీమ్ తో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ ప్రజలను పెద్ద ఎత్తున ఆకర్షించగలదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. హైద్రాబాద్ నగరంలోనే ఇది ఎంతో ప్రత్యేకత గల ఎగ్జిబిషన్ అని ఆయన అన్నారు. గతంలో ఎవ్వరూ ఇలాంటి ఎగ్జిబిషన్ ని ఏర్పాటు చేయలేదని,నగరంలోని అన్ని ప్రాంతాల ప్రజలు వారి వారి పిల్లలతో ఈ ఎగ్జిబిషన్ ని సందర్శించాల్సిందిగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం కార్పొరేటర్ ఎండి. నసీరుద్దీన్, నాయకులు వజీ ఉజ్జమసిద్ధికి, మహమ్మద్ హారున్ ఫర్ఆన్,ఆమీర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ నియోజకవర్గం చిలుకానగర్ డివిజన్ లో రాజ్యాంగ పరిరక్షణ యాత్ర..

**భారత రాజ్యాంగాన్ని,అంబేడ్కర్‌ను కాపాడుకుందాం..**

**సన్న బియ్యం పథకం అమలు పేదలకు వరం..**

**చిల్కానగర్ లో జై బాపు,జై భీమ్,జై సంవిధాన్ అభియాన్ ర్యాలీ..**




**ఉప్పల్,ఏప్రిల్ 25(సూర్యరేఖ)**రాష్ట్రంలో అమలు చేస్తున్న సన్నబియ్యం పథకం పేదలకు వరంగా మారిందని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పేదల పక్షపాతిగా సన్న బియ్యం పథకాన్ని ప్రవేశ పెట్టి అమలు చేస్తున్నారని తెలిపారు. బీఆర్ అంబేద్కర్ ను అవమానించేలా పార్లమెంటులో హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ జై బాపు,జై భీమ్,జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం చిలకానగర్ లో ర్యాలీ నిర్వహించారు. ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ మందుముల పరమేశ్వర్‌రెడ్డి,చిలుకానగర్ డివిజన్ అధ్యక్షులు రాజేష్ ముదిరాజ్ ఈ సందర్భంగా మాట్లాడారు. భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను,మన రాజ్యాంగాన్ని అవమానించే బీజేపీ,దాని అనుబంధ సంస్థలు దాడులు చేస్తున్నాయని గుర్తు చేశారు. ఈ దాడులను క్షేత్రస్థాయి నుంచే తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. భారత రాజ్యాంగాన్ని కాపాడు కోవాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగాన్ని కాపాడుకుంటూ అంబేద్కర్‌ను గౌరవించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యంలో ప్రజాపాలన నడుస్తుందన్నారు. యువ వికాసం వంటి పథకాలు నిరుద్యోగులకు వరంగా మారుతాయన్నారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు,రేషన్ కార్డుల అందేలా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో చిలకనగర్ డివిజన్ అధ్యక్షులు ములకలపల్లి రాజేష్ ముదిరాజ్, ఆగం రెడ్డి,కొంపల్లి బాలరాజు,బొట్టు రాజేష్,నల్లవల్లి మహేందర్ అమరేశ్వరి,గండికోట గణేష్,దండుగుల్ల శంకర్ మాము నజీర్ శ్రీరాములు,జంగన్న, సుబ్బారావు,నారోజు రాధాకృష్ణఅమర్,సత్యం, బీఎం.కిరణ్, జగదీశ్వర్,పిట్టల సాయిలు,పాశం శ్రావణ్,సురేష్ గుప్తా, అల్తాఫ్ అర్జున్ గీత,సంపూర్ణ, సమత రంగమ్మ బి.జ్యోతి కె.జ్యోతి,విజయ, భాగ్యలక్ష్మి, సునీత,నౌకాంత్ రెడ్డి,కిరణ్,సోనా, సందీప్ విక్కీ,ప్రణీత్ అభినయ్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు,డివిజన్ సీనియర్ నాయకులు కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉప్పల్ లో ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ..

**ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఉమాగౌరీ**






**ఉప్పల్,ఏప్రిల్ 25 (సూర్యరేఖ )** ప్రపంచం మలేరియా దినోత్సవం సందర్భంగా ఉప్పల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మేడ్చల్, మల్కాజగిరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వరల్డ్ మలేరియా డే,-2025 కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఉమా గౌరీ ముఖ్య అతిథిగా హాజరై జండా ఊపి ర్యాలీని ప్రారంభిచారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఉమాగౌరీ మాట్లాడుతూ...ప్రతి ఒక్కరూ మలేరియా ఎలా వస్తుందో అవగాహన కలిగి ఉండాలని దోమలు వ్యాపించ కుండా చర్యలు తీసుకోవాలని,అందుకు ప్రతి ఒక్క ఆశ కార్యకర్తలు వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ప్రజలకు అవగాహన శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎన్ విడిసిపి డిస్ట్రిక్ట్ ప్రోగ్రామ్స్ ఆఫీసర్ డాక్టర్ వై.శ్రీదేవి మాట్లాడుతూ... దోమలు పెరగకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని అందుకోసం ప్రతి రోజూ నిలవ ఉన్న నీటిని శుభ్రం చేసుకోవాలని,కూలర్లు,నీటి తొట్టిలు కొబ్బరి చిప్పలు,ఇతర వాటిల్లో నీరు నిలువ ఉండ కుండా చూడాలని,వీటిపై అవగాహన కల్పించ వలసిన గురుతర భాద్యత ఆశలపై ఆరోగ్య సిబ్బంది పై ఉందని అన్నారు. అందరూ కలిసి కట్టుగా అంకిత భావంతో పనిచేస్తే 2030 వరకు మలేరియా వ్యాధిని పూర్తిగా నిర్మూలించ వచ్చు అని అన్నారు. ఈ కార్యక్రమంలో మల్కాజగిరి డివిజన్ డిప్యూటీ డిఎం హెచ్ ఓ డాక్టర్ శోభరాణి,కీసర డివిజన్ డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ సత్యవతి,డిస్ట్రిక్ట్ ప్రోగ్రామ్స్ ఆఫీసర్స్ డాక్టర్ చంద్రకళ డాక్టర్ గీత,డాక్టర్ మల్లీశ్వరి,డాక్టర్ కౌశిక్,ఏవో.డాక్టర్ వినోద్,ఉప్పల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని డాక్టర్ షౌసిల్యారాణి,కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ మహేష్ గౌడ్,పిహెచ్ఎన్ కరుణాదేవి,హెల్త్ సూపర్వైజర్ భోగా ప్రకాష్ ఉప్పల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న ఆశ వర్కర్లు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# రజతోత్సవ మహాసభను జయప్రదం చేయాలి

**బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ మహాసభకు భారీగా తరలడానికి సన్నాహక సమావేశం..**

**కార్వాన్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇన్చార్జీ ఠాకూర్ జీవన్ సింగ్**



**మెహిదీపట్నం,ఏప్రిల్ 25 (సూర్యరేఖ)**బీఆర్ఎస్ పార్టీ వరంగల్లో నిర్వహించు రజతోత్సవ మహాసభను జయప్రదం చేయడాని కార్వాన్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇన్చార్జీ ఠాకూర్ జీవన్ సింగ్ ఆద్వర్యంలో ముఖ్య నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీవన్ సింగ్ మాట్లాడుతూ. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో పట్టణం మొదలుకొని ప్రతి గ్రామం వరకు జరిగిన అభివృద్ధి పనులతో అన్ని వర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో ఉండేవారని,కేసీఆర్ రైతులను కన్నబిడ్డలుగా చూసుకునే వారిని అన్నారు. నేడు కాంగ్రెస్ ప్రభూత్వం అన్నదాతలతో పాటు అన్ని వర్గాల ప్రజలను విస్మరించిందన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ చెప్పిన బూటకపు వాగ్దానాలను నమ్మి ఒటు వేసి, మోసపోయామని ప్రజలు గ్రహించి నేడు బీఆర్ఎస్ పార్టీ వైపు చూస్తున్నారని ఆన్నారు. కేసీఆర్ తల పెట్టిన మహాసభను జయప్రదం చేసేందుకు నాయకులు కార్యకర్తలు,పార్టీ అభిమానులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని జీవన్ సింగ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ల అధ్యక్షులు కార్వాన్ రఘు,లంగర్ హౌస్ చంద్రకాంత్లు. డిమల్కాపూర్ ఆదిత్యా యాదవ్, జియాగూడ జి.బాబు. టోలిచౌకి అల్తాఫ్, గొల్కొండ జబ్బార్ సీనియర్ నాయకులు ముత్యాల బాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

## మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా సమావేశంలో పాల్గొన్న పరమేశ్వర్ రెడ్డి



**ఉప్పల్,ఏప్రిల్ 25 ( సూర్యరేఖ)** మేడ్చల్ మ ల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సింగి రెడ్డి హరివర్ధన్ రెడ్డి అధ్యక్షతన జిల్లాలోని మేడ్చల్ ఉప్పల్ కుత్బు ల్లాపూర్,కూకట్ పల్లి మల్కాజ్గిరి ఇన్చార్జులు మాజీ ఎమ్మెల్యేలు మల్లిపెది సుధీర్ రెడ్డి,కూన శ్రీశైలంగౌడ్,వజ్రేష్ యాదవ్, టిపిసిసి జనరల్ సెక్రటరీ నర్సారెడ్డి బూపతి రెడ్డి,లతో సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కో-ఆర్డినేటర్ బడంగ్పేట్ మాజీ మేయర్ పారిజాత నరసింహారెడ్డి హాజరయ్యారు.

# జమ్మూ కాశ్మీర్ పహల్గామ్ ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించిన ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ



**కామారెడ్డి,ఏప్రిల్ 25(సూర్యరేఖ)** షబ్బీర్ ఆలీ హైదరాబాద్ లోని ఆయన నివాసంలో ముస్లిం మత పెద్దలతో సమావేశం నిర్వహించారు. ముక్త కంఠంతో అందరూ ఈ దాడిని ఖండిస్తూ శుక్రవారం మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని వారి కుటుంబాలకు దేవుడు ధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థించాలన్నారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ. జమ్మూ కాశ్మీర్ పహల్గామ్ లోని పర్యటకుల బృందాన్ని లక్ష్యంగా చేసుకొని వారిపై జరిగిన భయంకరమైన ఉగ్రదాడిని ఖండిస్తున్నామని తెలిపారు. ఇది అమానవీయ చర్య అని విచారం వ్యక్తం చేస్తూ. ఉగ్రవాద దాడిలో మరణించిన వారి ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తున్నాను అన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడుతున్న వారిని బహిరంగంగా కఠినాతి కఠినంగా శిక్షించాలని కలలో కూడా ఇలాంటి చర్యలు పాల్పడా లంటే వెన్నులో వణుకు పుట్టే విధంగా శిక్ష అమలు చేయాలన్నారు. కాశ్మీర్ లోని పహల్గామ్ లో జరిగిన ఉగ్రవాద దాడిని భారతదేశాన్ని మాత్రమే కాకుండా యావత్ ప్రపంచాన్ని కుదిపేసింది. ఈ దాడిలో చాలా మంది పర్యాటకులు చనిపోయారు. అనేక మంది తీవ్రంగా గాయపడ్డారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఉగ్రవాదానికి మతం ఉండదని చిన్న చీమకు కూడా హాని తలపెట్ట వద్దని ఇస్లాం చెప్తుంది అన్నారు. ప్రభుత్వం ఉగ్రవాదంపై తీసుకునే ఎలాంటి చర్య అయినా సరే మా మద్దతు ఉంటుంది. మానవత్వం ఉన్నవారు ఎవరైనా సరే ఈ హేయమైన చర్యను ఖండించాల్సిందే అన్నారు.

## ఉగ్రవాదుల దాడి హేయమైన చర్య

**మల్లాపూర్ మాజీ కౌన్సిలర్ కేశవరం ఆంజనేయులు**



**ఉప్పల్, ఏప్రిల్ 25 (సూర్యరేఖ)** భారత పర్యాటకులపై కాశ్మీర్ లోని పహల్గాం,బైసరాన్ లోయ లో ఉగ్రవాదులు జరిపిన దాడి హేయమైన చర్య అని మల్లాపూర్ మాజీ కౌన్సిలర్ బిజెపి సీనియర్ నాయకులు కేశవరం ఆంజనేయులు అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ. ఉన్మాదుల దాడిలో 26 మంది భారతీయులను పొట్టన పెట్టుకోవడం చాలా బాధాకరమని,ఇది ప్రపంచ మానవాళికే గొడ్డలి పెట్టు అని ఈ దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ దాడిలో పాల్గొన్న 6 టెర్రరిస్టులను గుర్తించి కఠిన చర్యలు తీసుకో వాలని కోరారు. మృతుల ఆత్మకు శాంతి కలగాలని,దుఃఖంతో విలపిస్తున్న మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. భారతీయ పర్యాటకులను కాపాడే క్రమంలో టెర్రరిస్టుల బుల్లెట్లకు బలైన సయ్యద్ ఆదిల్ హుస్సేన్ షా సాహసాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

# టెక్స్ అకాడమీ చేత ఉచిత కంప్యూటర్ కోర్సులు






**కార్పొరేట్ కమ్యూనికేషన్స్ మేనేజర్ మోహన్ దాస్**

**శివంపేట,మార్చి 25 (సూర్యరేఖ)** మెదక్ జిల్లాలోని శివంపేట మండలంలోనీ కొత్తపేట గ్రామంలోని గ్లాండ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మసిటికల్ సైన్సెస్ కళాశాలలో టెక్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఫార్మసీ విద్యార్థిని,విద్యార్థులకు ఉచితంగా కంప్యూటర్ కోర్సులను అందిస్తున్నట్లు కార్పొరేట్ కమ్యూనికేషన్స్ మేనేజర్ మోహన్ దాస్ తెలిపారు. ఫార్మసీజి విభాగాలకు చెందిన విద్యార్థులను ఎంపిక చేసేందుకు ఉచిత ఆన్లైన్ స్కాలర్షిప్ పరీక్ష నిర్వహించింది.పరీక్షలో విజయం సాధించిన విద్యార్థిని,విద్యార్థులకు ఉచిత కంప్యూటర్ కోర్సులను అందించను న్నారు.ఈ సందర్భంగా ఉచిత ఆన్లైన్ పరీక్షను నిర్వహించినందుకు గ్రాండ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మసిటికల్ సైన్సెస్ కాలేజీ ప్రొఫెసర్ కమ్ ప్రిన్సిపాల్ డాక్టర్ శివ సుబ్రహ్మణ్యం టెక్స్ అకాడమీకి ధన్యవాదాలు తెలిపారు.ఉచిత స్కాలర్షిప్ పరీక్షలో విజయం సాధించిన నీలం సంధ్య,అత్తెల్లి వంశీ,సిద్ధార్థ రెడ్డి,విస్లావత్ చంటి నాయక్,తొగిట కళ్యాణ్ రామ్ గౌడ్,లను విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు ఈ సదావకాశాన్ని వినియోగించు కొని జీవితంలో ఉన్నతా శిఖరాలను అధిరోహిం చాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా ఉచిత ఆన్లైన్ పరీక్షను నిర్వహించినందుకు గ్లాండ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మసిటికల్ సైన్స్ కాలేజ్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ డా.నవీన్ రెడ్డి మాట్లాడుతూ. ఇలాంటి ఉచిత స్కాలర్షిప్ పరీక్ష కోర్సులు, ప్లేస్మెంట్ అందించే డ్రైవ్ల విద్యార్థుల ప్రకాశవంతమైన జీవితానికి ఖచ్చితంగా సహాయపడతాయని అన్నారు.డాక్టర్.కల్లూరి సతీష్ కుమార్ విభాగాధిపతి మాట్లాడుతూ. ఉచిత స్కాలర్షిప్ పరీక్షలో విజయం సాధించిన విద్యార్థులకు ఈ సదావకాశాన్ని వినియోగించుకొని జీవితంలో ఉన్నతా శిఖరాలను అధిరోహించి జీవితంలో స్థిరపడాలని కోరారు.పరీక్ష విభాగం విభాగాధిపతి డాక్టర్ షేక్ రెహానా పర్వీన్ రాజ్కుమార్ మాట్లాడుతూ. విద్యార్థులు చదువుతో పాటు జీవితంలో నిరంతర కృషి తపనతో ఎన్నో విజయాలు సాధించవచ్చన్నారు. కార్పొరేట్ కమ్యూనికేషన్స్ మేనేజర్ మోహన్ దాస్ ఉచిత స్కాలర్షిప్ పరీక్షలో విజయం సాధించిన వారికి,కోర్సులు పూర్తయిన తర్వాత విద్యార్థులకు ఉద్యోగాలు కల్పిస్తామని,టెక్స్ అకాడమీ గ్రూప్ ఆఫ్ కంపెనీల్లో ఉద్యోగులుగా ప్రవేశాలు కల్పిస్తామని తెలిపారు.కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# చిల్కానగర్ డివిజన్ కుమ్మరి కులస్తుల వైకుంఠధామానికి మహర్దశ





**చిల్కానగర్ డివిజన్ కుమ్మరి కులస్తుల వైకుంఠధామం పనులు పూర్తి..**

**కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్**

**ఉప్పల్,ఏప్రిల్ 25 (సూర్యరేఖ)** చిల్కానగర్ డివిజన్లోని కుమ్మరి కులస్తుల వైకుంఠధామంలో అన్ని హంగులతో పనులు పూర్తి చేశామని,అతి త్వరలో ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డితో కలిసి వైకుంఠ దామాన్ని ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ తెలిపారు.శుక్రవారం కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్, జిహెచ్ఎంసి అధికారులు డి.ఈ.వెన్నెల గౌడ్, ఏ.ఈ. రాధిక,లతో కలిసి కుమ్మరి కులస్తుల వైకుంఠధామం పనులను పర్యవేక్షించారు.ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో కలిసి వైకుంఠధామాన్ని ప్రారంభిస్తామని తెలిపారు.గత 30 ,40 సంవత్సరాల నుంచి కుమ్మరి కులస్తుల ప్రత్యేక వైకుంఠధామం కలగా మిగిలిపోయిందని అన్నారు.కుమ్మరి కులస్తులకు ప్రత్యేక వైకుంఠధామాన్ని ఏర్పాటు చేయాలని వారి ప్రతిప్రాధనను పూర్తి చేసామని తెలిపారు. అనంతరం కుమ్మరి కులస్తుల కుల సంఘం నాయకులు మాట్లాడుతూ...గత 40 సంవత్సరాల నుండి కుమ్మరి కులస్తులకు ప్రత్యేకమైన వైకుంఠధామం లేక ఎన్నో అవస్థలు పడ్డామని,ఎంతో మంది నాయకులకు మొర పెట్టుకున్న వారి పదవీ కాలం పూర్తి చేసుకున్నారు.కానీ కుమ్మరి కులస్తులకు ప్రత్యేక వైకుంఠధామం ఏర్పాటు చేయలేదని వాపోయారు. ఈనాడు చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ కుమ్మరి కులస్తుల సంఘం నాయకులు అడిగిన వెంటనే ప్రత్యేకమైన వైకుంఠధామాన్ని అతి స్వల్ప సమయంలో ఏర్పాటు చేయడం నిజంగా కూడా చాలా గొప్ప విషయమని,కుమ్మరి కులస్తులు ఎప్పటికీ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ కి రుణపడి ఉంటామని,వారి నాయకత్వాన్ని బలపరుస్తామని తెలిపారు.వారికి అండగా నిలుస్తామని,వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి డీ.ఈ.వినీల్ గౌడ్,ఏ.ఈ. రాధిక,వర్క్ ఇన్స్పెక్టర్ కేదార్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్,సీనియర్ నాయకులు ఎద్దుల ఎదుల కొండల్ రెడ్డి,కోకొండ జగన్,బాలకృష్ణ గౌడ్,బుద్ధం శ్రీనివాస్ యాదవ్, శ్యామ్,కుమ్మరి సంఘం నాయకులు గుమ్మడిల్లి మల్లేష్,గుమ్మిడేల్లి యాదయ్య గుమ్ముడేల్లి మహేష్, పెంటయ్య భాస్కర్,అశోక్,జంగయ్య,తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ లో చలివేంద్రాన్ని ప్రారంభించిన కార్పొరేటర్ రజితరెడ్డి




**ఉప్పల్,ఏప్రిల్ 25 (సూర్యరేఖ)** కాంగ్రెస్ నాయకులు వేసవిలో దాహం తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఉప్పల్ కార్పోరేటర్ రజితరెడ్డి,ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పరమేశ్వర్ రెడ్డి,లు అన్నారు. ఉప్పల్ శాంతినగర్ బస్టాప్ లో కాంగ్రెస్ నాయకుడు ఈగ రాజేష్ ముదిరాజ్ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని రజిత రెడ్డి,పరమేశ్వర్ రెడ్డి,లు ప్రారంచారు.ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ...వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ముందుకు వచ్చిన ఈగ రాజేష్ ని అభినందిస్తున్నట్లు చెప్పారు.చలివేంద్రం ఏర్పాటు చేయడం గొప్ప విషయమని అన్నారు.ఉప్పల్ ప్రజలు చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో లింగంపల్లి రామకృష్ణ,తెల్కల మోహన్ రెడ్డి,తిక్క ప్రకాష్,ఈగ శంకర్ ముదిరాజ్,తుమ్మల దేవిరెడ్డి,వెంకటేష్ గుప్తా,రాజేందర్ రెడ్డి,మధుసూదన్ రెడ్డి,అలుగుల అనిల్ కుమార్,జనగాం రామకృష్ణ,విజయ్ కుమార్ గుప్తా కుషంగుల్ల సతీష్ ముదిరాజ్,రాముజు సత్యనారాయణ,బోడిగా మల్లేష్ గౌడ్,లఖన్,మమత,రాణీ ,శ్రీనివాస్,మోహన్, తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ రజితోత్సవ సభకు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయండి

**నాచారం కార్పొరేటర్ శాంతి సాయి జన్ శేఖర్**




**ఉప్పల్,ఏప్రిల్ 25 (సూర్యరేఖ)** వరంగల్ లో ఈనెల 27వ తేదీ జరగబోయే బారాస పార్టీ రజతోత్సవ బహిరంగ సభకు నాచారం నుండి పెద్ద సంఖ్యలో నాయకులు,కార్యకర్తలు, అభిమానులు తరలి రావాలని నాచారం కార్పొరేటర్ శాంతి సాయిశేఖర్ పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా నాచారం డివిజన్లోని వివిధ కాలనీలలో సుమారు 32 జెండాలను ఆవిష్కరించేందుకుగాను జెండా దిమ్మెలకు డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయి జన్ శేఖర్ రంగులు వేయించడం జరిగింది. ఆదివారం ఉదయమే ప్రతి కాలనీలో ముఖ్య నాయకుడు జెండా ఆవిష్కరించి బహిరంగ సభకు తరలి వెళ్ళనున్నట్టు నాచారం డివిజన్ కార్పొరేటర్ తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బారసా రాష్ట్ర నాయకులు సాయి జన్ శేఖర్,మేకల ముత్యంరెడ్డి,విఠల్ యాదవ్,దాసరి కర్ణ, కెప్టెన్ కృష్ణ లడ్డు,నరసింహ,శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

## పిడుగుపాటుతో చెలరేగిన మంటలు..



**శివంపేట,ఏప్రిల్ 25 (సూర్యరేఖ)**మెదక్ జిల్లాలోని శివంపేట మండలంలోని అల్లిపూర్ తండా పొలాల్లో గల తాటి చెట్టు పైన పిడుగుపాటు గురై చాలా పెద్ద ఎత్తున మంటలు చిలరేగాయి. ఈదురుగాలులతో ఉరుములతోభారీ వర్షం కురుస్తున్నప్పుడు ప్రజలు వ్యవసాయ క్షేత్రంలో గల చెట్ల కింద ఉండకుండా నివాసాలలకి చేరుకొని చాలా జాగ్రత్తగా ఉండాలి.

## రేణుక ఎల్లమ్మ కళ్యాణానికి హాజరైన కార్పొరేటర్ బన్నాల గీతప్రవీణ్



**ఉప్పల్,ఏప్రిల్ 25(సూర్యరేఖ)** చిల్కానగర్ డివిజన్లోని శ్రీనగర్ కాలనీలో సుజాత లింగం దంపతుల నివాసంలో రేణుక ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణానికి చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మాజీ మెంబర్ బన్నాల గీతాప్రవీణ్ ముదిరాజ్ రేణుక ఎల్లమ్మ అమ్మవారి ఆశీస్సులు పొందారు.అనంతరం కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ మాట్లాడుతూ... రేణుక ఎల్లమ్మ అమ్మవారి ఆశీస్సులు సుజాత లింగం వారి కుటుంబ సభ్యులు కోరుకున్న కోరికలన్నీ తీరాలని,వారి కుటుంబంపై రేణుక ఎల్లమ్మ అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని, అదేవిధంగా ఉప్పల్ నియోజకవర్గ ప్రజలందరిపై రేణుక ఎల్లమ్మ ఆశీస్సులు ఉండాలని,ప్రజలందరూ సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని అమ్మవారిని కోరినట్లు తెలిపారు.

## పారిశుద్ధ కార్మికుల చెత్త బండ్ల పరిస్థితి..



**నిజాంపేట,ఏప్రిల్25(సూర్యరేఖ)** మండల పరిధిలోని జద్చెరువు తండా గ్రామంలో పరిశుద్ధ కార్మికులకు చెత్త బండ్లు సరిగా లేకపోవడంతో పాడైపోయిన రిక్షాలో చెత్తను తీసుకెళుతున్న వైనం చోటుచేసుకుంది. గ్రామాలలో సర్పంచులు లేకపోవడం కార్యదర్శులకు రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయించకపోవడం వల్లనే ఈ పరిస్థితి నెలకొందన్నారు. మండలాలలో ప్రతి గ్రామపంచాయతీలో ఇదే పరిస్థితి నెలకొంది. స్థానిక ఎన్నికలు త్వరగాజరిగినట్లయితే సమస్యల పరిష్కారం అవుతాయన్నారు.

# ఉప్పల్ సీనియర్ సిటిజన్స్ క్లబ్‌కు సొంత భవనం.!





నిర్మాణ పనులను పరిశీలించిన కార్పొరేటర్ రజితాపరమేశ్వర్‌రెడ్డి

**ఉప్పల్,ఏప్రిల్ 25 (సూర్యరేఖ)** ఉప్పల్ సీనియర్ సిటిజన్స్ క్లబ్‌కు సొంత భవనం అందుబాటులోకి రానుంది.ఇప్పటికే భవన నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి.ఉప్పల్ మెయిన్ రోడ్డులో ఉప్పల్ సీనియర్ సిటిజన్స్ క్లబ్‌కు కార్పొరేటర్ మందుముల రజితాపరమేశ్వర్‌రెడ్డి సుమారు 400 గజాల స్థలాన్ని కేటాయించారు. ఇదే కాకుండా క్లబ్‌లో మౌలిక వసతులు,ఇతర ఏర్పాట్లకు రూ.20 లక్షల నిధులను కూడా మంజూరు చేయించారు. సీనియర్ సిటిజన్స్ క్లబ్ భవన నిర్మాణ పనులను శుక్రవారం రజితాపరమేశ్వర్ రెడ్డి,క్లబ్ ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. పనులను సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో వెంకటయ్య గౌడ్,వాకిటి బుచ్చిరెడ్డి, మేకల రామ్ రెడ్డి,సల్లా మల్ల రెడ్డి,మేకల వెంకట్ రెడ్డి మనోహర్ నారాయణ,పాపి రెడ్డి,షమీర్పేట్ యదిరెడ్డి వెంకటేశం సత్యనారాయణ లింగారెడ్డి లాలాపేట నర్సింహ రెడ్డి,వర్కాల రామ్ రెడ్డి,బిస్ ఎన్ఎల్ ప్రభాకర్,మందుముల అంజిరెడ్డి, కోటేశ్వర్ రావు కుమారస్వామి లింగంపల్లి రామకృష్ణ తెల్కల మోహన్ రెడ్డి,తిక్క ప్రకాష్,ఈగ శంకర్ ముదిరాజ్ తుమ్మల దేవిరెడ్డి,వెంకటేష్ గుప్తా, రాజేందర్ రెడ్డి మధుసూదన్ రెడ్డి,అలుగుల అనిల్ కుమార్ జనగాం రామకృష్ణ,విజయ్ కుమార్ గుప్తా కుషంగుల్ల సతీష్ ముదిరాజ్ రాముజు సత్యనారాయణ,బోడిగా మల్లేష్ గౌడ్ లఖన్ మమత రాణీ శ్రీనివాస్,మోహన్ పాల్గొన్నారు.

# మానవ అక్రమ రవాణా పైన రెండు రోజుల శిక్షణ కార్యక్రమం





**ఉప్పల్,ఏప్రిల్ 25 (సూర్యరేఖ)** మానవ అక్రమ రవాణా నిర్మూలించడం అందరి బాధ్యత అని ఆల్వాల్ ప్రాజెక్ట్ సీడీపీఓ స్వాతి, ఉప్పల్ సూపర్వైజర్ వెంకటరమణ,ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ట్రైనింగ్ కో–ఆర్డినేటర్ అంబర్ సింగ్,లు అన్నారు.మానవ అక్రమ రవాణా శిక్షణ కార్యక్రమాన్ని సిపిడిఓ స్వాతి ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. మనుషుల అక్రమ రవాణా నిర్మూలనలో ప్రజలు అందరు భాగస్వామ్యం అయినప్పుడే దీనిని సమూలంగా నివారించవచ్చునని సూచించారు. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ హైదరాబాద్,జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అల్వాల్ ప్రాజెక్ట్ లోని ఉప్పల్ మండలలోని ఉప్పల్ మున్సిపాలిటీ సమావేశం హాల్లో రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా సీడీపీఓ స్వాతి మాట్లాడుతూ.. మానవ అక్రమ రవాణా అనేది ప్రపంచం వ్యాప్తంగా అత్యంత వేగంగా విస్తరస్తూ ఎంతో మంది అమ్మాయిల జీవితాలను నాశనం చేస్తున్న నేరపూరితమైన చర్య..ఆదిలోనే దీన్ని అడ్డుకుంటే మన ఆడపిల్లలను రక్షించుకోవచ్చు,ప్రతి రోజు ఎంతో మంది అమ్మాయిలు మహిళలు దీని బారిన పడుతున్నారు.ముఖ్యంగా పేద మధ్య తరగతి వారు,ఉద్యోగం,ప్రేమ పెళ్లి, సినిమా అవకాశాల పేరుతో మోసాలకు గురి అవుతున్నారు.ప్రతి ఒక్కరు దీనిపై అవగాహనా పెంచుకొని అప్రమతంగా ఉండాలని సూచించారు. ప్రతి అంగన్వాడీ టీచర్ తమ పరిధిలోని మహిళలకు, అమ్మాయిలకు అక్రమ రవాణాపై అవగాహనా కల్పించాలని ఏవైనా సమస్యలు ఉంటే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఇది మానవతా దృక్పతంతో చేయాలనీ,దీని వలన చాలా మంది అమ్మాయిలు రక్షింప బడతారని అన్నారు.ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు అంబర్ సింగ్ మాట్లాడుతూ. మానవ అక్రమ రవాణా నిర్మూలన కొరకు ప్రజ్వల సంస్థ గత 28 సంవత్సరాల నుండి లైంగిక వ్యాపారానికి వ్యతిరేకంగా పనిచేస్తు 29,500 మంది అమ్మాయిలను కాపాడి పునరావాసం కల్పించడం జరిగింది.ఈ సంస్థ వ్యవస్థాపకురాలు పద్మశ్రీ అవార్డు గ్రహిత డాక్టర్ సునీత కృష్ణన్,సంబంధిత ఐసిడిఎస్, డిఆర్డిఏ, పోలీస్ జ్యూడిషల్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ల సహకారంతో పని చేయడం జరుగుతుంది. మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లాలో అన్ని ప్రాజెక్ట్,ల పరిధిలోని అంగన్వాడీ టీచర్స్ కి శిక్షణ ఇచ్చి వారి ద్వారా గ్రామాలలో అవగాహనా కార్యక్రమాలను నిరహించేలా చేస్తూ ఏవైనా సమస్యలు ఉంటే సంబంధిత అధికారులను ఎలా సంప్రదించలో ఈ శిక్షణలో నేర్చుకోవడం జరుగుతుంది.శిక్షణతో భాగంగా మానవ అక్రమ రవాణా ఎలా జరుగుతుంది. ఎవరు దీనికి గురి అవుతారు.లైంగిక వ్యాపారంలోకి వెళ్లిన అమ్మాయిల పరిస్థితులు ఎలావుంటాయి.సైబర్ ట్రాఫికింగ్ (ఆన్లైన్ మోసాలు)వివరిస్తూ ప్రతి గ్రామంలో సమాజ జాగృతి సంఘాలను ఏర్పాటు చేసి,వారి ద్వారా అక్రమ రవాణా సమాచారాన్ని సంబంధిత అధికారులకు అందించాలని ప్రతి ఒక్కరు ఈ విషయాలపట్ల అప్రమతంగా ఉండాలని అన్నారు.ఈ శిక్షణలో ప్రభుత్వం ద్వారా అక్రమ రవాణా సంబంధిత చట్టాలు భారతీయ న్యాయ సంహిత ( బిఎన్ఎస్ ), ఐటిపిఏ,పోకసో,బాల్య వివాహల నిషేధం చట్టం, టోల్ ఫ్రీ నంబర్స్ 1098 (చైల్డ్ లైన్ )100 టపోలీస్ఉ, 181 (మహిళా హెల్ప్ లైన్)1930 (సైబర్ క్రైమ్) సైబర్ వెబ్సైటు ద్వారా ఏవిదంగా కంప్లైంట్ చేయాలో శిక్షణలో నేర్పించారు. ప్రజ్వల ప్రతినిధులు ట్రైనింగ్ కోఆర్డినేటర్ అంబర్ సింగ్ మిథాలీ రాజ్,చిన్న కేశవులు అల్వాల్ ప్రాజెక్ట్ నుండి సూపర్వైజర్లు వెంకటరమణ జయశీల అల్వాల్ ప్రాజెక్ట్ లోని అంగన్వాడీ టీచర్స్ పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ పార్టీ రజితోత్సవ సభకు భారీగా తరలిరండి..

బన్నాల ప్రవీణ్ ముదిరాజ్



**ఉప్పల్,ఏప్రిల్ 25(సూర్యరేఖ)** వరంగల్ ఎల్కతుర్తిలో ఈ నెల 27వ తారీకు జరగబోయే బీఆర్ఎస్ పార్టీ రజితోత్సవ సభ ఏర్పాట్లలో భాగంగా పిస్తా హౌస్ చౌరస్తాలో బీఆర్ఎస్ పార్టీ నూతన జెండా దిమ్మెను ఏర్పాటు చేస్తూ దిమ్మెకు బీఆర్ఎస్ పార్టీ గులాబీ రంగును వేసినట్లు బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ తెలిపారు అనంతరం బీఆర్ఎస్ పార్టీ రజితోత్సవ సభ పోస్టర్ ను ఆవిష్కరించడం జరిగింది.ఈ సందర్భంగా బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ మాట్లాడుతూ...బీఆర్ఎస్ పార్టీ రైతు సభకు పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు తరలి రావాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎదుల కొండల్ రెడ్డి,కొకొండ జగన్,ముద్దం శ్రీనివాస్ యాదవ్ అశోక్ చారి శ్రీశైలం, శ్యామ్ బాలు,జిల్లాల ప్రవీణ్,రవి వర్మ,రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## పెద్దమ్మ తల్లి ఆలయంలో కుంకుమార్చన కార్యక్రమం




**నిజాంపేట,ఏప్రిల్25(సూర్యరేఖ)**మండల కేంద్రంలో శుక్రవారం పెద్దమ్మ తల్లి ఆలయంలో ముదిరాజ్ సంఘ సభ్యుల ఆధ్వర్యంలో కుంకుమార్చన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా గ్రామ పురోహితులు వేలేటి లక్ష్మణ శాస్త్రి మాట్లాడుతూ...లోక కళ్యాణార్థం పెద్దమ్మ ఆలయ మండపంలో గ్రామ ముత్తైదుల చేత కుంకుమార్చన కార్యక్రమం చేపట్టామన్నారు.ఆ పెద్దమ్మ తల్లి కృపతో వర్షాలు సమృద్ధిగా కురవాలని పాడిపంటలు సుభిక్షంగా పండాలని అమ్మవారిని వేడుకున్నామన్నారు.ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షులు పంజా బాబు,ఉపాధ్యక్షులు మాసుల నాగరాజు,కోశాధికారిరెడ్డి,రాకేష్,మాజీ అధ్యక్షులు జలపోచయ్య మాసుల కర్ణాకర్,జిపిస్వామి,తమ్మలి రమేష్,పంజా నవీన్, చెంద్రం,జాల రవి గేరిగంటి బాబు,పున్నవెంకటస్వామి,రాజు,గ్రామ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్త యోగక్షేమాలు తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే పద్మదేవేందర్ రెడ్డి




**నిజాంపేట,ఏప్రిల్25(సూర్యరేఖ)**మండల పరిధిలోని రాంపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బందారం పర్శగౌడ్ కు గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ స్టంట్ పడడంతో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే పద్మదేవేందర్ రెడ్డి,చరవాణి ద్వారా అతని ఆరోగ్య యోగక్షేమాలు తెలుసుకొని పరామర్శించారు.ఆరోగ్యం కాపాడుకోవాలని మనోధైర్యాన్ని కల్పించారు.ఈ కార్యక్రమంలో మండల మాజీ కో–ఆప్షన్ సభ్యులు మొహమ్మద్ గౌస్,దుబ్బ రాజాగౌడ్,తదితరులు పాల్గొన్నారు.

## వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ జాతీయ పురస్కారానికి డాక్టర్ బాలు ఎంపిక..



**కామారెడ్డి,ఏప్రిల్ 25(సూర్యరేఖ)**తలసేమియా చిన్నారుల కోసం రక్తదాన శిబిరాల నిర్వహణకు వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ తెలుగు రాష్ట్రాల జాతీయ స్థాయి పురస్కారాలు –2025 కు ప్రకటించారు.జాతీయ స్థాయి పురస్కారానికి కామారెడ్డి రక్తదాతల సమూహ వ్యవస్థాపకుడు ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బాలు ఎంపిక అయ్యారు.ఈనెల 27వ తేదీ గోదావరిఖనిలో అందుకోవడం జరుగుతుంది.ఈ అవార్డుకు ఎంపిక చేసిన సంస్థ చైర్మన్ లయన్ డాక్టర్ సురభి శ్రీధర్ కు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ సందర్భంగా డాక్టర్ బాలు మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది చిన్నారులు తలసేమియా వ్యాధితో బాధపడుతున్నారని,వారి కోసం మెగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి 2500ల యూనిట్ల రక్తాన్ని సేకరించి అందజేయడం జరిగిందని,ఈ సేవను గురించి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ లో చోటు దక్కించుకొని దేశంలోనే మొదటి సంస్థగా కామారెడ్డి రక్తదాతల సమూహం ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ఐవిఎఫ్ లు సంయుక్తంగా నిలవడం జరిగిందని అన్నారు.ఈ పురస్కారం ఆదుకోవడానికి సహకరించ రక్తదాతలకు మీడియా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీని నమ్మే స్థితిలో లేరు

**బీఆర్ఎస్ కార్యకర్తలను గుండెల్లో పెట్టి చూసుకుంటాం..**
**బీఆర్ఎస్ సిల్వర్ జూబ్లీ సభను విజయవంతం చేయండి..**
**మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి,కంఠరెడ్డి తిరుపతిరెడ్డి,లు**




**నిజాంపేట,ఏప్రిల్25(సూర్యరేఖ)** ఈనెల 27న వరంగల్ లో జరిగే బీఆర్ఎస్ సిల్వర్ జూబ్లీ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి,నియోజకవర్గ ఇన్చార్జ్ కంఠారెడ్డి తిరుపతిరెడ్డి,లు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు నిజాంపేట మండల కేంద్రంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ...2001లో గులాబీ జెండాను పట్టుకుని వెళ్ళిన కేసీఆర్ 14 ఏళ్ల సుదీర్ఘ పోరాటంలో ఢిల్లీ నాయకుల మెడలో వంచి ఎంతోమంది అమరవీరుల త్యాగఫలంతో తెలంగాణ రాష్ట్రానికి సాధించుకున్నామన్నారు. దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిన ఘనత కెసిఆర్ కి దక్కుతుందన్నారు. మొన్న జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలనలో తెలంగాణ ప్రజలు అష్ట కష్టాలు పడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ ఏడాదిన్నర పాలనలోనే ప్రజల నమ్మకాన్ని కోల్పోయిందని ఎద్దేవా చేశారు. తెలంగాణలో కారు సర్కారు మరొకసారి కెసిఆర్ ని ముఖ్యమంత్రిగా చూడాలని యావత్ తెలంగాణ ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు వయస్సుకు తేడా లేకుండా కెసిఆర్ పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే పోలీసులు పట్టించుకోవడం సిగ్గుచేటు అన్నారు. అభివృద్ధిపై ప్రశ్నిస్తే బీఆర్ఎస్ పార్టీ నాయకులను అరెస్టులు చేయడం ఖండిస్తున్నామని,అధికార పార్టీకే అధికారులు మొగ్గ చూపడం సరైంది కాదన్నారు రానున్న రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తే తప్పకుండా వారికి భారీ మూల్యం చెల్లిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్లు అందే కొండల్ రెడ్డి,బాపు రెడ్డి,మండల అధ్యక్షులు సుధాకర్ రెడ్డి,గ్రామ అధ్యక్షులు నాగరాజు,మాజీ సర్పంచ్ సంగుస్వామి,అరుణ్ కుమార్,తిరుమల గౌడ్, దయాకర్,మాజీ కో-ఆప్షన్ గౌస్,రంజిత్ గౌడ్, దుబ్బ రాజాగౌడ్,పున్న వెంకటస్వామి,లక్ష్మీ నర్సింలు రాములుగౌడ్,గోపరి నర్సింలు,మావురం రాజు,నగేష్,బాల్ రెడ్డి,మైపాల్, హైమద్,నరేందర్ నాయక్,పెంటయ్య,కైలాస్,గన్నారంవెంకట్ గౌడ్, మాధవరెడ్డి,కొమురయ్య,కనకరాజు,రామ్ లక్ష్మణ్, రమేష్,తదితరులు పాల్గొన్నారు.

## పహల్గాం దాడి ఘటన బాధకరం





**పహల్గాం ఉగ్రదాడిని ఖండిస్తున్నాం :**
**నల్ల బ్యాడ్జీలతో ముస్లింల నిరసన..**
**సర్ఫరాజ్ సిద్ధిఖీ,సయ్యద్ హిదాయతుల్లా షఫీ**

**రాజేంద్రనగర్,ఏప్రిల్25(సూర్యరేఖ)** జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో టూరిస్టులపై జరిగిన ఉగ్రవాద దాడిని తీవ్రంగా ఖండిస్తున్నమనీ ఎంఐఎం పార్టీ నాయకులు సర్ఫరాజ్ సిద్ధిఖీ,జన చైతన్య ఘుడా బేగ్ మసీదు కమిటీ అధ్యక్షుడు సయ్యద్ హిదాయతుల్లా షఫీ,లు తెలిపారు. శుక్రవారం రాజేంద్రనగర్ డివిజన్ జన చైతన్య మసీదులో మధ్యాహ్నం నమాజ్ సమయంలో పహల్గామ్ ఘటనలో మరణించిన వారి ఆత్మశాంతి కోసం ప్రార్థించారు. ప్రజాస్వామ్య భారతదేశంలో హింస వాదానికి తావు లేదని,ఉగ్ర మూకల చర్యలను ప్రతి ఒక్కరు ఖండించాలని పిలుపునిచ్చారు. ప్రత్యేక ప్రార్థనలు చేసిన అనంతరం నల్ల రిబ్బన్లు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్ఫరాజ్ సిద్ధిఖీ సయ్యద్ హిదాయతుల్లా షఫీ,లు మాట్లాడుతూ ...సామాన్యులపై ఉగ్రదాడి పిరికిపంద చర్యగా అభివర్ణించారు. ఉగ్రవాదులను వారి హింసాత్మక చర్యలను యావత్ భారతదేశం ముక్తకంఠంతో ఖండిస్తోందనారు. దాడులతో భారతీయుల ఆత్మస్థైర్యాన్ని తగ్గించ లేరన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడుతున్న వారిని బహిరంగంగా కఠినాతి కఠినంగా శిక్షించాలని కలలో కూడా ఇలాంటి చర్యలు పాల్పడాలంటే వెన్నులో వణుకు పుట్టే విధంగా శిక్ష అమలు చేయాలన్నారు. కాశ్మీర్ లోని పహల్గామ్ లో జరిగిన ఉగ్రవాద దాడిని భారతదేశాన్ని మాత్రమే కాకుండా యావత్ ప్రపంచాన్ని కుదిపేసింది. ఈ దాడిలో చాలా మంది పర్యాటకులు చనిపోయారు. అనేక మంది తీవ్రంగా గాయపడ్డారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఉగ్రవాదానికి మతం ఉండదని చిన్న చీమకు కూడా హాని తలపెట్ట వద్దని ఇస్లాం చెప్తుంది అన్నారు. ప్రభుత్వం ఉగ్రవాదంపై తీసుకునే ఎలాంటి చర్య అయినా సరే మా మద్దతు ఉంటుంది. మానవత్వం ఉన్నవారు ఎవరైనా సరే ఈ హేయమైన చర్యను ఖండించాల్సిందేనని స్పష్టం చేశారు. భారత ప్రభుత్వం ఉగ్రవాదాన్ని ఉక్కు పాదంతో అణిచివేసే చర్యలకు పూనుకోవాలనారు. భారతదేశంలో ఐక్యతను దెబ్బతీసేందుకు కొందరు ఉగ్రవాదులు ఇటువంటి దాడులకు పాల్పడుతున్నారని అటువంటి వారిని ప్రభుత్వం పట్టుకొని కఠినంగా శిక్షించాలని తెలిపారు. ఈ దుర్ఘటనలో కుటుంబ సభ్యులను కోల్పోయిన వారికి భగవంతుడు మనోధైర్యాన్ని శక్తిని కల్పించాలని,గాయపడ్డ వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## బెల్లంపల్లిలో భూ భారత్ అవగాహన సదస్సు




**బెల్లంపల్లి,ఏప్రిల్25(సూర్యరేఖ)** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారత్ అవగాహన సదస్సు బెల్లంపల్లి నియోజకవర్గం బెల్లంపల్లి మండలం కన్నాల గ్రామపంచాయితీ రైతు వేదికలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్,జాయింట్ కలెక్టర్ ఆర్డీవో, తహశీల్దార్, వ్యవసాయ అధికారి తదితర ప్రభుత్వ అధికారులు పాల్గొని భూ భారత్ ఉద్దేశాన్ని రైతులకు ఎలా ఉపయోగపడుతుందో చాలా క్లుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ కారుకురి రాంచందర్,టీపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ కన్వీనర్ నాతరి స్వామి,ఏఎంసీ చైర్మన్ చింతం స్వామి,కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు ముచ్చర్ల మల్లయ్య,కాంగ్రెస్ మండల అధ్యక్షులు సింగతి సత్యనారాయణ ఏఎంసి,వైస్ ఛైర్మెన్ కంకటి శ్రీనివాస్,మాజీ ఎంపీటీసీ మహేందర్,మాజీ సర్పంచ్ మంద అనిత,రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఇంత చక్కటి చట్టాన్ని తీసుకొచ్చినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

## కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఎక్కడ త్రాగునీటి సమస్య రావద్దు..

**కామారెడ్డి శాసనసభ్యులు వెంకటరమణారెడ్డి**




**కామారెడ్డి,ఏప్రిల్ 25(సూర్యరేఖ)** కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని 49 వార్డుల్లో ఎక్కడ కూడా త్రాగునీటి సమస్య రావద్దని కామారెడ్డి శాసనసభ్యులు వెంకటరమణారెడ్డి అన్నారు శుక్రవారం వేసవి నీటి ఎద్దడి దృష్టిలో పెట్టుకొని త్రాగునీటి సమస్యలపై వార్డు అధికారులు,వాటర్ మేన్లతో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శాసనసభ్యులు వెంకట రమణారెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం వార్డు అధికారులు,వాటర్ మేన్లతో వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ...కామారెడ్డి పట్టణంలోని 49 వార్డుల్లో ఎక్కడ కూడా త్రాగునీటి సమస్య రావద్దని,ఎక్కడ సమస్య ఉన్న ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేపట్టాలని సూచించారు. ఇంటింటికి నీటి సరఫరా సమయంలో ఇంటి యజమానుల నుండి డబ్బులు వసూలు చేయరాదని,ఒకవేళ అలా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటానని ఆయన హెచ్చరించారు. వార్డు ఆఫీసర్లు తమ వార్డుల్లో నీటి అవసరాలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని తెలిపారు. ఏ వార్డులో నీటి సమస్య ఉందని ఫిర్యాదు వచ్చిన సంబంధిత వార్డు అధికారి బాధ్యత వహించాల్సి వస్తుందని ఎమ్మెల్యే అన్నారు. ఇంటింటికి నీటి సరఫరా సమయంలో సామాన్య ప్రజలకు ఎలా నీటి సరఫరా చేస్తాము,అలాగే మాజీ తాజా ప్రజా ప్రతినిధులైన అన్ని పార్టీల నాయకులు కూడా అలాగే సరఫరా చేయాలి,కానీ రాజకీయ నాయకుల ఇళ్లల్లో,అధికారుల ఇళ్లల్లో కానీ సంపుల్లో కానీ నీటిని పోయే రాదని హెచ్చరించారు పోస్తే మాత్రం కఠిన చర్యలు తప్పవని ఎమ్మెల్యే సూచించారు.

## ఉగ్ర దాడి నిరసిస్తూ జామ మసీద్ ముందు నిరసన తెలిపిన మైనారిటీ నాయకులు..



**చేగుంట,ఏప్రిల్ 25(సూర్యరేఖ)** జమ్మూకాశ్మీర్ రాష్ట్రంలో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడిని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు చేగుంట మండల మైనార్టీ నాయకులు అన్నారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని జామ మసీదు వద్ద కమిటీ అధ్యక్షులు (సదర్ )ఆధ్వర్యంలో ఉగ్ర దాడిని నిరసిస్తూ నిర్వహించిన ర్యాలీ కార్యక్రమంలో పట్టణ మైనారిటీ నాయకులు ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం నాయకులు మాట్లాడుతూ... భారతదేశంలో ఐక్యతను దెబ్బతీసేందుకు కొందరు ఉగ్రవాదులు ఇటువంటి దాడులకు పాల్పడుతున్నారని,అటువంటి వారిని ప్రభుత్వం పట్టుకొని కఠినంగా శిక్షించాలని అన్నారు. దాడులు జరగకుండా కేంద్ర ప్రభుత్వం మరింత కఠినమైన చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు షకీల్,రహీముద్దీన్,అలీ, అన్వర్ జలీల్ అజీం నయీమ్,హుసేని,ఇలియాస్, జమీల్,ఖలీల్ ఆరిఫ్,తదితరులు పాల్గొన్నారు.

## దొంగతనం కేసును చేదించిన పోలీసులు నిందితులను రిమాండ్ కు తరలింపు...




**నిజాంపేట,ఏప్రిల్25(సూర్యరేఖ)** మండల పరిధిలోని వెంకటాపూర్ కె గ్రామంలో బాలచంద్రం ఇంటిలో ఈనెల 4 తారీకున రాత్రి జరిగిన దొంగతనం కేసులో నిందితులను పట్టుకుని కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్ఐ రాజేష్ అన్నారు. అనంతరం ఇన్వెస్టిగేషన్ లో నేరస్తులను గుర్తించి వారిని శుక్రవారం అదుపులోకి తీసుకొని నేరస్తుల నుండి ఫిర్యాది పోగొట్టుకున్న సొత్తును రికవరీ చేసి రిమాండ్ కు తరలించారు. కేసు పరిశోధనలో మంచిగా పని చేసిన కానిస్టేబుళ్లు విజయకుమార్, నవీన్,అమీర్ సోహెల్,లను ఎస్ఐ అభినందించారు.

# చేగుంటలో పోషణ పక్వాడ కార్యక్రమంలో పాల్గొన్న సిడిపిఓ స్వరూప రాణి







**చేగుంట,ఏప్రిల్25(సూర్యరేఖ) :** చేగుంట మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన పోషణ పక్వాడ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.తల్లి బిడ్డకు జన్మనిచ్చిన వెంటనే శిశువుకు ముర్రుపాలు పట్టిం చాలని ముర్రుపాల వల్ల పిల్లలకు రోగ నిరోధకశక్తి తో పాటు అనేక పోషకాలు ఉంటాయని ఆమె పేర్కొన్నారు.అంగన్వాడీ కేంద్రాలలో పిల్లలకు పోషకాలతో కూడిన పౌష్టికాహారం అందిస్తున్నామ న్నారు.అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు బాలిం తలకు గర్భవతులకు కిశోర బాలికలకు వైద్యపర మైన సేవలతో పలు జాగ్రత్తలు తెలియజేస్తున్నామన్నారు. ప్రతి ఏప్రిల్ మా సంలో పోషక పక్వాడ కార్యక్రమం నిర్వహిస్తా మన్నారు.పిల్లల ఎదుగుదల పోషకలోపం ఎప్పటి కప్పుడు గుర్తించి జాగ్రత్తలు పిల్లల ఎదుగుదలకు అంగన్వాడీ కేంద్రాల తోడ్పాటు అందిస్తుందన్నారు. తహశీల్దార్ శ్రీకాంత్ ఎంపీడీవో చిన్నారెడ్డిలు మాట్లాడుతూ..అంగన్వాడీ టీచర్లు గ్రామాల్లో బాల్య వివాహాలు జరగకుండా ఎప్పటికప్పుడు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.అనంతరం పిల్లలకు అక్షరాభ్యాసం అన్నప్రాసన గావించారు.మండల ఉత్తమ అంగన్వాడీ టీచర్లుగా రాంకుమారి శోభ, సుగుణలకు బహుమతులు అందజేశారు. రామా యంపేట ప్రాజెక్టులో పరిధిలో చేగుంట సెక్టార్ కు ఉత్తమ పోషణ పక్వాడ అవార్డును సిడిపిఓ స్వరూపరాణి చేతుల మీదుగా అందించారు.ఈ కార్యక్రమం సిడిపిఓ స్వరూపరాలతో పాటు తహశీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీవో చిన్నారెడ్డి, సిహెచ్ఓ సంపతి ఐసీడీఎస్ సూపర్వైజర్లు పైనీ సువర్ణ,శ్యామల,ఈవో నరేష్,జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు పరంజ్యోతి,జిఎంఆర్ కోఆర్డినేటర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## బెల్లంపల్లి ఉగ్రదాడికి నిరసనగా ముస్లింల ర్యాలీ








**బెల్లంపల్లి,ఏప్రిల్25(సూర్య రేఖ)** జమ్ము కశ్మీర్ లో ఉగ్రదాడికి నిరసనగా బెల్లంపల్లికి చెందిన ముస్లింలు పట్టణంలో సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. పర్యాటకులపై ఉగ్రదాడికి పాల్పడిన ముష్కరులది పిరికిపంద చర్య అని పేర్కొన్నారు.దాడిలో మరణించిన వారి ఆత్మలకు శాంతి కలగాలని కోరారు. మృతుల కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.జామ మజీద్, గురువు సాదిక్ ఫుల్ ఇస్లాం అండ్ రజా మజీద్ ఇమామ్,మొహమ్మద్ యూనుస్ లు మాట్లాడుతూ. భారతదేశంలో పుట్టిన ప్రతి పౌరుడు భారతీయుడే భారతీయులపై ఉగ్రవాదుల దాడిని,మనస్ఫూర్తిగా ఖండిస్తున్నామని,వారికి జరిగిన అన్యాయం మొత్తం భారతదేశానికి బాధాకరమని,అలాంటి దుర్మార్గులతో మతంతో ముడి వేయకూడదని,ఉగ్రవాదులు ఏ మతానికి సంబంధం లేదని వారికి డబ్బు ఒక్కటే మార్గమని,ఇస్లాం మతంలో ఒక్క మనిషిని చంపిన యావత్తు మానవానికి చంపిన పాపమని అల్లా అంటున్నారు.శాంతి మార్గమే ఇస్లాం మతమని,మేము భారత ప్రభుత్వానికి తమ తరపున,ఒకటే కోరుకుంటున్నామన్నారు. మన దేశంలో ఏ ఉగ్రవాది రాకుండా వారికి కఠినమైన చర్యలు తీసుకోవాలని,దేశంలో అడుగు పెట్టాలంటే వారికి గుండెలు గడగజ వనకాలని,టీవీలో పేపర్లలో మేము చూస్తున్నాం పాకిస్తాన్ హస్తం ఉందని వార్తలు వస్తున్నాయన్నారు.అలాంటి దేశంకు తగిన గుణపాఠం చెప్పాలని,ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్న ఉక్కుపాదంతో అణచివేయాలని,ఇలాంటి నరరూప రాక్షసులతో ఇస్లాంకు ఎలాంటి సంబంధం లేదని,అందులో భారతదేశంలో పుట్టి పెరుగుతున్న ముస్లిం,హిందూ సోదరులు కలిసిమెలిసి ఉంటున్న సమయంలో ఇలాంటి రక్తపాతం సృష్టించి మతకలహాలకు దారి తీసే ఇలాంటి చీడపురుగులకు వెతికి మరి ఉరికంబానికి వేలాడదీయాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని కోరుతున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో రజా మజీద్,ఇమామ్ మొహమ్మద్ యూనుస్ రజా,జమ మజీద్ అధ్యక్షుడు ఎంఏ రెహమాన్ మహమ్మద్,ఖలీల్,అధ్యక్షులు ఖదీర్ బేగ్,అధ్యక్షులు ముక్తార్ హాదరి ముస్లిం ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయంలో కృత్రిమ మేధ వినియోగంపై బిట్స్ పిలానీ

- వ్యవసాయ విశ్వవిద్యాలయా,ల మధ్య అవగాహన ఒప్పందం..



**రాజేంద్రనగర్,ఏప్రిల్25(సూర్యరేఖ)**వ్యవసాయంలో కృత్రిమ మేధ వినియోగంపై ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం,బిట్స్ పిలాని, ల మధ్య శుక్రవారం ఒక అవగాహన ఒప్పందం కుదిరింది.రాజేంద్రనగర్ లోని వ్యవసాయ విశ్వవిద్యాలయం క్యాంపస్ లోని అగ్రి హబ్ లో జరిగిన కార్యక్రమంలో వర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య,బిట్స్ పిలాని ఉపకులపతి ప్రొఫెసర్ వి.రాంగోపాల్ రావు సమక్షంలో అవగాహన ఒప్పందం పత్రాలపై ఇరుసంస్థల అధికారులు సంతకాలు చేశారు. పరస్పరం ఒప్పంద పత్రాల్ని మార్చుకున్నారు.ఈ రెండు ప్రతిష్టాత్మకమైన సంస్థల మధ్య జరిగిన ఈ అవగాహన ఒప్పందం సంయుక్తంగా పరిశోధన ప్రాజెక్టుల రూపకల్పనకు, పీహెచ్.డి విద్యార్థులకు పరిశోధన సలహాలు ఇవ్వడానికి దోహదం చేస్తుందని బిట్స్ పిలాని ఉపకులపతి ప్రొఫెసర్ వి.రాంగోపాల్ రావు అన్నారు.ఇరు సంస్థల శాస్త్రవేత్తలు కలిసి నాణ్యమైన పరిశోధనా పత్రాలు ప్రచురించడానికి కూడా ఉపయోగపడుతుందన్నారు.దుబాయ్ తోపాటు దేశంలోని 4 చోట్ల బిట్స్ క్యాంపస్,లు ఉన్నాయని,అందులో ప్రతి ఏటా సుమారు 600 మంది పీహెచ్.డిలో ప్రవేశాలు పొందుతున్నారని తెలిపారు.దేశంలోనే మూడవ అత్యంత ప్రతిష్టాత్మకమైన స్టార్టప్ నెట్వర్క్ బిట్స్ పిలానీ సంస్థ కు ఉందని తెలిపారు.ఆధునిక టెక్నాలజీని వినియోగించి రైతులకు మెరుగైన సేవలు అందించడానికి ఈ ఒప్పందం దోహదం చేస్తుందని వివరించారు.వర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య మాట్లాడుతూ...దేశంలోనే అత్యంత ప్రాచీన వ్యవసాయ విశ్వవిద్యాలయాలలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం రెండోదని,ఇది అమెరికా ల్యాండ్ గ్రాంట్ మోడల్ లో ఏర్పాటయిందని అని తెలిపారు. గ్రామీణ స్థాయి వరకు అత్యంత పటిష్టమైన పరిశోధన నెట్ వర్క్ కలిగి ఉండడంతోపాటు అనేక వ్యవసాయ విద్య,విస్తరణ సంస్థలు రాష్ట్ర వ్యాప్తంగా కలిగి ఉండి రైతులకు మెరుగైన సేవలు అందించడంలో నిమగ్నమైందని అన్నారు.2047 నాటికి మానవ రహిత వ్యవసాయం తీసుకురావాలనే లక్ష్యంతో తాము ప్రణాళిక బద్ధంగా కృషి చేస్తున్నట్లు వివరించారు.ఇందుకోసం డిజిటల్ అగ్రికల్చర్ కు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నామని తెలిపారు.బిట్స్ ఫిలానితో జరిగిన ఈ అవగాహన ఒప్పందం వల్ల తాము అనుకున్న మానవ రహిత వ్యవసాయ లక్ష్యాలను సాధించడానికి అవకాశం కలుగుతుందని అన్నారు.వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని వ్యవసాయ పరిజ్ఞానం (హార్డ్ వేర్),బిట్స్ పిలానిలోని సాఫ్ట్ వేర్ కలిస్తే మెరుగైన ఫలితాలు వస్తాయని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ముందుగా పత్తి,వరి, మొక్కజొన్న,వేరుశనగ పంటల సాగుకి ఉపయోగపడే అగ్రి రోబోల రూపకల్పన జరగాలని జానయ్య ఆకాంక్షించారు.పరిశోధనా సంచాలకులు డాక్టర్ బలరాం అవగాహన ఒప్పందం ముఖ్య లక్ష్యాల గురించి సమావేశంలో వివరించారు. రిజిస్ట్రార్ డాక్టర్ జి.ఈ.సిహెచ్ విద్యాసాగర్,బిట్స్ ఫిలాని డీన్ ఆఫ్ రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ డాక్టర్ సంకేత్ గోయల్,వర్సిటీఅంతర్జాతీయ కార్యక్రమాల సంచాలకులు డాక్టర్ రాములు,డిజిటల్ అగ్రికల్చర్ సంచాలకులు డాక్టర్ బాలాజీ నాయక్, విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు,బిట్స్ పిలానీ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## పీజీడీఎం-ఏబీఎం 5వ స్నాతకోత్సవ వేడుక..

**రాజేంద్రనగర్,ఏప్రిల్25(సూర్యరేఖ)**ఐసీఏఆర్-నార్మ్(జాతీయ వ్యవసాయ పరిశోధన నిర్వహణ సంస్థ)లో ఈ నెల26వ తేదీన10 గంటలకు నార్మ్ ఆడిటోరియంలో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్మెంట్ (అగ్రి-బిజినెస్ మేనేజ్మెంట్)5వ స్నాతకోత్సవ వేడుకను నిర్వహించనుంది.ఈ వేడుకకు ముఖ్య అతిథిగా పద్మ భూషణ్ అవార్డు గ్రహీత డాక్టర్ ఆర్ఎస్ పరొడా హాజరుకానున్నట్లు తెలిపారు.ఆయన గతంలో డేర్ కార్యదర్శిగా,ఐసీఏఆర్ డైరెక్టర్ జనరల్గా సేవలందించారు. ప్రస్తుతం న్యూఢిల్లీ లోని ట్రస్ట్ ఫర్ అడ్వాన్స్ మెంట్ ఆఫ్ అగ్రికల్చర్ సైన్సెస్ ఛైర్మన్గా ఉన్నారు.ఈ సందర్భంగా అతిథులుగా డాక్టర్ ఏ.జనయ్య ఎన్.కే.రాజవేలు,డాక్టర్ మంగిలాల్ జాట్ హాజరు కానున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో 2021,2022,2023 బ్యాచ్లకు చెందిన సుమారు 176 మంది విద్యార్థులకు డిప్లొమాలు ప్రదానం చేయనున్నారు

## సువచ్చల సహిత హనుమాన్ ఆలయ 8 వ వార్షికోత్సవం

పాల్గొన్న కేవీఆర్



**కామారెడ్డి,ఏప్రిల్25(సూర్యరేఖ)** సువచ్చల సహిత హనుమాన్ ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని కామారెడ్డి శాసన సభ్యులు వెంకట రమణ రెడ్డి అన్నారు. ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు సీతారాముల కళ్యాణ వేడుక సందర్భంగా వేడుకలో పాల్గొన్నారు. కామారెడ్డి ఆంజనేయ స్వామివారి దీవెనలతో కామారెడ్డి జిల్లా అభివృద్ధి పథంలోముందుకు సాగాలని, స్వామి వారిని కోరుకున్నట్లు వెంకట రమణారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో నరేందర్ రెడ్డి, శ్రీనివాస్ విపుల్ జైన్, వెంకట్ స్వామి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## అదుపుతప్పి చెట్టును ఢీకొన్న బైక్

ఘటనా స్థలంలోనే బైకిస్టు మృతి





**చేగుంట,ఏప్రిల్25(సూర్య రేఖ)**బైక్ అదుపు తప్పి చెట్టును ఢీకొట్టిన ఘటనలో వ్యక్తి మృతి చెందిన సంఘటన చేగుంటలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మెదక్ జిల్లా రామాయంపేట మండలం దొంగల ధర్మారం గ్రామంలో దూదేకుల గఫర్(40) శు క్రవారం తన అన్న బైకుపై పులిమామిడి నుండి దౌల్తాబాద్ కు వెళ్లి డీజిల్ తీసుకొని ధర్మారం వస్తుండగా మార్గమధ్యలో పులిమామిడి గ్రామ శివారులో మూలమలుపు వద్దకు రాగా బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన గల చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో అక్కడికక్కడే మృతి చెందాడు.ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## టీడీపీ క్రియాశీలక సభ్యత్వ కార్డుల అందజేత





**బెల్లంపల్లి,ఏప్రిల్ 25 (సూర్య రేఖ)** తెలుగు దేశం పార్టీ క్రియాశీ లక సభ్యత్వం కార్డుల ను వార్డు మండలాల వారీగా పార్టీ కార్యక ర్తలకు నాయకులకు రాష్ట్ర అధ్యక్షులు బొక్కలిని నర్సింహులు,పెద్దపల్లి పార్లమెంట్ పరిశీల కులు వేజెండ్ల కిషోర్ ఆదేశాల మేరకు సభ్యత్వ కార్డులను పార్లమెంట్ కో కన్వీనర్ టి.మణి రామ్ సింగ్ తెలుగుదేశం పార్టీ రూ.వంద కట్టి సభ్యత్వం తీసుకున్న ప్రతి కార్యకర్తకు రూ.ఐదు లక్షల ఇన్సూరెన్స్ మెడికల్ సదుపాయం,పిల్లలు చదువుకొనుటకు విద్య అవకాశాలు కూడా ఉన్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ ప్రాంతాల్లో ముమ్మరంగా రెడ్ క్రాస్ సేవలు





**చిన్న శంకరంపేట గ్రామంలో మెగా వైద్య క్యాంపు విజయవంతం..**
**సందర్శించిన ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు**
**క్యాంపు పట్ల హర్షం...**





**రామాయంపేట,ఏప్రిల్25(సూర్య రేఖ)** గ్రామీణ ప్రాంతాల్లో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ముమ్మరంగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆ సంస్థ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సింగం శ్రీనివాసరావు తెలిపారు.శుక్రవారం చిన్న శంకరంపేట మండల కేంద్రంలో తుప్రాన్ వీఎస్టీ ఇండస్ట్రీస్ సహకారంతో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మెదక్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా వైద్య శిబిరంలో పాల్గొని ప్రసంగించారు.గ్రామీణ ప్రాంతాల్లో వైద్య ఆరోగ్య శిబిరాలు నిర్వహించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.చిన్న శంకరంపేట గ్రామంలో మెగా వైద్య క్యాంపును నిర్వహించడం శుభ పరిణామమన్నారు.ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సోసైటీ జిల్లా చైర్మన్ ఏలేటి రాజశేఖర్ రెడ్డి మేనేజ్మెంట్ కమిటీ సభ్యుడు దేమే యాదగిరి పిహెచ్ సికి చెందిన డాక్టర్లు బీ.హృదయ్ మెడికల్ సిబ్బంది కుమారి నందిని బుజ్జి మాళ మాధవి లలిత రేణుకా,వైస్ చైర్మన్ లక్ష్మణ్ యాదవ్,జిల్లా కార్యదర్శి టి సుభాష్ చంద్రబోస్ కోశాధికారి డిజి శ్రీనివాస శర్మ మేనేజ్మెంట్ కమిటీ సభ్యులు దేమే యాదగిరి రేషన్ డీలర్ తోట శ్రీనివాస్ గుప్తా,మద్దెల సత్యనారాయణ జీడి తిరుపతి ఎన్.మాధవరెడ్డితో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ కర్రెగుట్ట...



**ఖమ్మం :** కర్రెగుట్ట చుట్టూ యుద్ధవాతావరణం నెలకొంది. ఆపరేషన్ కగార్ పేరుతో 20 వేల మంది భద్రతా బలగాలు తెలంగాణ?ఛత్తీస్ గఢ్ సరిహద్దుల్లోని కర్రెగుట్టను చుట్టుముట్టాయి. అదే సమయంలో హెలికాప్టర్ ద్వారా ఆపరేషన్ కూడా నడుస్తోంది. మూడు రోజులుగా ఈ ఆపరేషన్ నడుస్తోంది. కర్రె గుట్టపై దాదాపు వెయ్యి మంది మావోయిస్టులు డెన్ ఏర్పాటు చేసుకున్నట్టు సీఆర్పీఎఫ్ అనుమానిస్తోంది. కర్రెగుట్టపై ది మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు నేత హిడ్మా ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఆపరేషన్ కగార్ పేరుతో ఇప్పటి వరకు దండకారణ్యంలోని అబూజ్ మడ్ ప్రాంతాన్ని దాదాపుగా స్వాధీనం చేసుకున్నాయి కేంద్రబలగాలు. అబూజ్ మడ్ కు అనుకొని కర్రెగుట్ట మొదలవుతుంది.కర్రెగుట్టకు సంబంధించి.. బీజాపూర్ జిల్లాలోని ఊసూరు బ్లాక్, ఆవు పల్లి, పూజారి కాంకేడ్ ప్రాంతాలు ఛత్తీస్ గఢ్?లో ఉండగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల, ములుగు జిల్లా వాజేడు, వెంకటాపురం మండలాలకు విస్తరించి ఉన్నాయి. కర్రె గుట్టలపై తెలంగాణలో పాముదూరు, తడపల, జెల్ల, డోలి, చెలిమల, బండారు పల్లి, ముకునూరు గ్రామాలుండేవి. ఈ గ్రామాలను గతంలోనే ఖాళీ చేయించి వారికి వేరే ప్రాంతాల్లో పునరావాసం కల్పించారు. అయితే పెనుగోలు గ్రామస్తులు మాత్రం అక్కడే ఉన్నారు.ఆబూజ్ మడ్ పై కేంద్ర బలగాలు ఆపరేషన్ మొదలు పెట్టగానే మావోయిస్టులు సమీపంలోనే ఉన్న కర్రెగుట్టకు మారినట్టు తెలెస్తోంది. ఇక్కడ డెన్ లు ఏర్పాటు చేసుకొని ఆయుధాలను దాచినట్టు చెబుతున్నారు. ఇక్కడికి పోలీసులు, భద్రతా బలగాలు రాకుండా గుట్ట చుట్టూ ల్యాండ్ మైన్స్ పెట్టినట్టు సమాచారం. పలువురు ఆదివాసీలు వేట కోసం కర్రెగుట్టకు వెల్లి ఇటీవల మృత్యువాత కూడా పడ్డారు.మావోయిస్టులు కర్రెగుట్టపై డెన్ ఏర్పాటు చేసుకున్నట్టు సమాచారం అందుకున్న కేంద్ర బలగాలు స్పెషల్ ఆపరేషన్ కు శ్రీకారం చుట్టాయి. మూడు వైపుల నుంచి గుట్టను చుట్టుముట్టాయి. దీంతో పాటు హెలిక్యాప్టర్లు, డ్రోన్ల ద్వారా అణువనువూ తనిఖీ చేస్తున్నాయి. అబూజ్ మడ్ పరిధిలోని ఆదివాసీ గూడేలకు రోడ్లు వేసుకుంటూ ఆపరేషన్ మొదలు పెట్టిన సీఆర్పీఎఫ్ బలగాలు ప్రస్తుతం కర్రెగుట్ట వద్దకు చేరుకున్నాయి. అయితే ఈ ఆపరేషన్ రాష్ట్ర పోలీసులకు సంబంధం లేకుండా జరుగుతోంది. అదే విధంగా ఫారెస్టు అధికారులు సైతం కర్రెగుట్ట వైపు రావద్దంటూ సీఆర్పీఎఫ్ ఆదేశాలు జారీ చేసింది. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చే వరకు స్థానిక పోలీసులు ఎంటర్ అయ్యే అవకాశం లేదు.మావోయిస్టులు కర్రెగుట్టను సేఫ్టీ ప్లేస్?గా భావిస్తున్నారు. ఇదొక గుట్టల సముదాయం.. ఒక గుట్ట దిగగానే కొంత మైదాన ప్రాంతం ఉంటుంది.. ఆ వెంటనే గుట్ట స్టార్ట్ అవుతుంది. గుట్టల కింద సహజ సిద్ధంగా ఉండే బంకర్లు, సొరంగ మార్గాలున్నాయి. ఒక్కో బంకర్ చాలా విశాలంగా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. సెలయేళ్లు కూడా ప్రవహిస్తూ ఉంటాయి. మూడు కాలాలూ నీటి వసతి ఉంటుందని అంటున్నారు. అయితే అబూజ్ మడ్?ను సీఆర్పీఎఫ్ బలగాలు స్వాధీనం చేసుకున్న దరిమిలా.. మావోయిస్టులు కర్రెగుట్టలను సేఫ్టీ ప్లేస్ గా భావించే భారీ మొత్తంలో ఆయుధాలను తీసుకొని ఇక్కడికి వచ్చి ఉంటారని తెలుస్తోంది. ఇక్కడే డెన్ ఏర్పాటు చేసి ఉంటారనే అనుమానాలున్నాయి.ఆపరేషన్ కగార్?లో భాగంగా కర్రెగుట్టపై బేస్ క్యాంప్ ఏర్పాటు చేసుకొనేందుకు సీఆర్పీఎఫ్, భద్రతా బలగాలు రెడీ అవుతున్నాయి. ఇక్కడ ఆయుధాలను భద్రపర్చిన మావోయిస్టులు తిరిగి వస్తే వారిని పట్టుకోవడమే ఈ బేస్ క్యాంప్ లక్ష్యమని అంటున్నారు. ఈ ఆపరేషన్ మూడు నెలల పాటు కొనసాగుతుందని తెలుస్తోంది. ఏది ఏమైనా మావోయిస్టుల ఏరివేతలో ఇది అతి పెద్ద ఆపరేషన్ గా చెబుతున్నారు.

# మైనింగ్ ఆఫీసు మూసివేత

**మహబూబ్ నగర్ :** నాగర్ కర్నూల్ జిల్లా మైనింగ్ శాఖ కా ర్యాలయానికి అద్దె భవనం దొరకక అవస్థలు తప్పడం లేదు. గత కొద్దికాలంగా ప్రస్తుతం ఉన్న అద్దె భవనంలో కార్యాలయం ఖాళీ చేయాలని యజమానులు ఒత్తిడి తేవడంతో అధికారులు అయోమయంలో పడ్డారు. గత ప్రభుత్వం అన్ని శాఖలకు ఉమ్మడిగా జిల్లా ల్లో కలెక్టరేట్ కార్యాలయాన్ని నిర్మించినప్పటికీ ఆ కార్యాలయంలో మైనింగ్ శాఖకు భవనాన్ని కేటాయించకపోవడంతో చాలాకాలంగా మార్కెట్ యార్డ్ సమీపంలోని అదే భవనంలోనే మైనింగ్ శాఖను కొనసాగించారు. గత కొన్ని నెలలపాటు ఖాళీ చేయా లని ఒత్తిడి తెచ్చినప్పటికీ అధికారులు స్పం దించకపోవడంతో గత రెండు రోజుల క్రితం అద్దె భవనం యజమానులు కార్యాలయానికి ఇంటర్నెట్, విద్యుత్ కనెక్షన్ వంటివి తొలగించారు. కార్యాలయానికి సేవ లు అందుకునే వినియోగదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్న పరిస్థితి ఏర్పడింది. పట్టణంలోని ఆయా రెంట్ బిల్డింగ్ కోసం అన్వేషణ జరుగుతున్నప్పటికీ రెంట్ ధర ఎక్కువగా చెబుతుండడంతో అధికారులు అయోమయంలో పడ్డారు. ప్రభు త్వం నిర్మించిన పాత కలెక్టరేట్ భవనం, ప్రస్తుత కలెక్టరేట్ భవనాలు అందుబాటులో ఉన్నప్పటికీ కొన్ని కార్యాలయాలు నేటికీ అద్దె భవనంలోనే కొనసాగుతుండడంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోందని విమర్శలు ఉన్నాయి.ప్రస్తుతం అద్దె భవనం దొరకక తీవ్ర ఇబ్బందులు పడుతున్న మై నింగ్ శాఖ కార్యాలయానికి కూడా జిల్లా ఉన్నతాధికారులు కార్యాలయాన్ని ఏర్పాటుకు సహకరించకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న సామాన్యులు.ప్రస్తుతం జిల్లాలో మన ఇసుక వాహనం పథకం అమల్లోకి తీసుకొచ్చిన నేపథ్యంలో వినియోగదారులు సామాన్యులు ఇంటి నిర్మాణం కోసం ఇసుక ఆన్లైన్ దరఖాస్తులను చేసుకుంటున్నారు. దీంతోపాటు ఆయా వినియోగదారులకు రీచ్ నుం చి ఇసుకను తరలించిన అనంతరం వాటి నివేదికలను ఆన్లైన్లో పొందుపరచాల్సి ఉం టుంది ఆ తర్వాతే ఇసుక ట్రాక్టర్ యజమానులకు చెల్లింపులు బ్యాంకు ద్వారా పూర్తి అ వుతాయి. దీంతోపాటు మైనింగ్ శాఖ సం బంధించిన అన్ని సేవలు నిలిచిపోయాయి. దీంతో సామాన్యులు వినియోగదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్న పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం అద్దె భవనం కోసం జిల్లాలో అక్కడక్కడ అన్వేషణ జరుగుతోంది. ఒక ప్రాంతంలో అద్దె భవనాన్ని పరిశీలించారు. శుక్రవారం లేదా శనివారం రో జు పరిశీలించి మైనింగ్ శాఖ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తాం. ప్రస్తుతం సేవలు ఫోన్ ద్వారా కొనసాగిస్తూనే ఉన్నామంటున్నారు అధికారులు.

## లక్ష్మీప్రసన్న కుటుంబాన్ని ఆదుకోవాలని ధర్నా

**-బాధిత కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలి**
**-బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యల ఏమాజి డిమాండ్**




**బెల్లంపల్లి,ఏప్రిల్25(సూర్య రేఖ)**మంచిర్యాలలోని సాంఘిక సంక్షేమ శాఖ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ రెండవ సంవత్సరం చదువుతున్న లక్ష్మీ ప్రసన్న కుటుంబాన్ని ఆదుకోవాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యల ఏమాజి డిమాండ్ చేశారు.విద్యార్థినీ ప్రభుత్వ ఆసుపత్రిలో చనిపోయింది.మృతురాలు లక్ష్మీ ప్రసన్న కుటుంబ సభ్యులతో కలిసి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట ఆమె తల్లిదండ్రులతో కలిసి ధర్నా చేశారు.ఆమె మృతిపై విచారణ జరిపి బాధ్యులపై చర్య తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.విద్యార్థిని కుటుంబ సభ్యులకు రూ.50 లక్షల నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.వారి కుటుంబ సభ్యులకు ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని అన్నారు.విద్యార్థిని ఉదయం చనిపోతే సాయంత్రం వరకు ఒక్క అధికారి కూడా రాకపోవడం దురదృష్టం అన్నారు.జిల్లా కేంద్రంలో జరిగినా కనీసం పట్టించుకోలేదని విమర్శించారు.అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్ సంఘటన స్థలానికి చేరుకుని కుటుంబ సభ్యులను ఓదార్చారు.ప్రభుత్వం తరపున వారి కుటుంబ సభ్యులను ఆదుకుంటామని అన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు వేంకటేశ్వర గౌడ్,మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి కృష్ణ నవీన్,నర్సింగ్,శీతల్,సంగీత,స్రవంతి,కమల,దుర్గం ఎల్లయ్య,వాణి,శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం చేసిన తాజా మాజీ జడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్త



**శివంపేట,ఏప్రిల్25(సూర్య రేఖ)** శివంపేట్ మండలంలోని సికింద్లపూర్ గ్రామంలో నిమ్మల ఆంజనేయులు అకస్మాత్తుగా మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని ప్రముఖ సంఘ సేవకులు తాజా మాజీ జెడ్పిటిసి పబ్బ మహేష్ గుప్త పరామర్శించారు.అలాగే వారి సొంత నిధుల నుండి రూ.10 వేలు,ఒక నెలకు సరిపడా నిత్య అవసర సరుకులు ఆ కుటుంబానికి అందజేశారు.అలాగే ఆ కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ ఏనుగు సుధాకర్ రెడ్డి,నరేష్ యాదవ్,పొట్ట ఆంజనేయులు శ్రీను వెంకటేష్,బుల్లెట్ రాజు రాజిపేట నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

## 97దాడులతో జాతీయ సమైక్యతను దెబ్బతీయలేరు ఉగ్రవాదుల చర్యను తిప్పికొట్టాలి

**జామితే ఉమ్మ హింద్ జిల్లా అధ్యక్షుడు మౌప్తి మాజర్ ఖాస్మీ**

**కోరుట్ల :** ఉగ్రవాదులు జరిపే దాడులతో భారతీయుల జాతీయ సమైఖ్యత దెబ్బతినదని జామితే ఉమ్మ హింద్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు మౌప్తి మాజర్ ఖాస్మీ అన్నారు..కాశ్మీర్ లోని పహల్గవ్ లో ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో మృతి చెందినవారి ఆత్మలు శాంతించాలని కోరుకుంటూ జామితే ఉమ్మ హింద్ పట్టణాధ్యక్షుడు మౌప్తి ముజీబుర్ రహ్మాన్ ఆధ్వర్యంలో శుక్రవారం జుమ్మ నమాజ్ అనంతరం పట్టణంలోని కార్గిల్ చౌక్ వద్ద మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి కొవ్వొత్తులు వెలిగించి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా జామితే ఉమ్మ హింద్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు మౌప్తి మాజర్ ఖాస్మీ మాట్లాడుతూ ఉగ్రవాదులు అత్యంత హేయంగా వ్యవహరిస్తూదాడులు జరిపినంత మాత్రాన భారతీయుల మధ్య ఉన్న సోదరభావాన్ని చెరిపి వేయలేరని అన్నారు. ఉగ్రవాదుల దాడిలో ఇతర మతస్థులతో పాటు ముస్లింలు సైతం చనిపోయిన విషయాన్ని ప్రతి ఒక్కరూ గమనించాలని కోరారు. ఉగ్రవాద దాడులు జరిగిన ప్రతీసారి వాటిని ఒక మతానికి ఆపాదిస్తూ అసత్య ప్రచారం చేయడం కేవలం రాజకీయ దురుద్దేశమేనని ఆన్నారు. ఇస్లాం ఎప్పుడు శాంతిని ప్రబోధిస్తుందని అది ఉగ్రవాదన్ని సహించదన్నారు.ఉగ్రవాదుల పిరికిపంద చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని కేంద్ర ప్రభుత్వం వారిపై ఉక్కు పాదం మోపి అంతమోదించల్సిన అవసరం ఉందన్నారు. పహల్గవ్ లో ఉగ్రవాదులు దాడిలో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు తమ సంఘం తరుపున ప్రగాఢ సంతాపం,సానుభూతిని వ్యక్తం చేశారు. మృతి చెందిన కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం అండగా నిలవాలన్నారు.ఈ కార్యక్రమంలో మౌప్తి ముజీబుర్ రహ్మాన్,మౌలానా హాఫేజ్ ఇలియాస్, మౌలానా హాఫేజ్ ముజఫర్, మౌలానా హాఫేజ్ సులేమాన్, మౌలానా హాఫేజ్ అబ్దుల్లా, మౌలానా హాఫేజ్ జాక్రియా, మౌలానా హాఫేజ్ జాకీర్, మౌలానా హాఫేజ్ ముస్తాక్, మౌలానా హాఫేజ్ ముబాసీర్ ఆలం ఖాన్,నాయిమ్ తదితరులు పాల్గొన్నారు.

## భూ సమస్యల సత్వర పరిష్కారానికే భూభారతి చట్టం

**కరీంనగర్ :** నిర్ణీత గడువులోగా రైతుల భూ సమస్యలను పరిష్కరించేందుకే రాష్ట్ర ప్రభుత్వం భూభారతి చట్టం తీసుకొచ్చినట్లు కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. శుక్రవారం జమ్మికుంట మున్సిపల్ కార్యాలయం, ఇల్లందకుంట రైతు వేదికల్లో ఏర్పాటుచేసిన భూభారతి చట్టంపై అవగాహన సదస్సుల్లో కలెక్టర్ మాట్లాడారు.ధరణి చట్టంలో నిబంధనలు సరిగా లేకపోవడంతో తమ భూ సమస్యలను పరిష్కరించు కునేందుకు రైతులు కోర్టుల చుట్టూ తిరిగే వారన్నారు.కేవలం కలెక్టర్ కే బాధ్యతలు అప్పగించడంతో పని భారం పెరిగి దరఖాస్తులు పరిష్కరించలే కపోయామని అన్నారు.

# బిజినెస్

## కుప్పకూలిన స్టాక్ మార్కెట్లు.. లక్షల కోట్లు ఆవిరి..



కాశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రవాద దాడి నేపథ్యంలో భారతదేశం, పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలు పెరగడంతో భారత మార్కెట్లు నష్టాల్లో ట్రేడవుతున్నాయి . అంతర్జాతీయంగా సానుకూల సంకేతాలు ఉండటంతో లాభాలతో ప్రారంభమైన సెన్సెక్స్ తర్వాత దాదాపు 950 పాయింట్లు నష్టపోయి ప్రస్తుతం 79,000 మార్కు కంటే దిగువన ట్రేడవుతోంది. మరోవైపు నిఫ్టీ 24,000 పాయింట్ల కంటే దిగువకు పడిపోయింది. దేశంలోని మూడవ అతిపెద్ద ప్రైవేట్ రంగ బ్యాంకు అయిన యాక్సిస్ బ్యాంక్ మార్చి త్రైమాసికంలో అంతగా ఆకట్టుకోలేకపోయింది. త్రైమాసిక లాభం గతేడాది ఇదే కాలంలో రూ.7,130 కోట్లు ఉండగా ప్రస్తుతం రూ.7,117 కోట్లకు తగ్గినట్లు నివేదికలు చెబుతున్నాయి. బ్యాంక్ షేర్లు 4.65% పడిపోవడం మదుపర్లను కలవరపెడుతోంది. యాక్సిస్ బ్యాంక్‌తో పాటు, బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, టాటా మోటార్స్, టెక్ మహీంద్రా ఇవాళ భారీ నష్టాల్లో ట్రేడవుతున్నాయి. టీసీఎస్, ఇన్ఫోసిస్, రిలయన్స్, హెచ్‌సీఎల్ టెక్, హెచ్‌డీఎఫ్‌సి బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ లాభాల్లో ఉన్నాయి. పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్, పాక్ మధ్య ఏర్పడిన ఉద్రిక్తతలు ఏ పరిస్థితులకు దారితీస్తాయోనని పెట్టుబడిదారులు జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. మరోవైపు ఆసియా మార్కెట్లు సహా ప్రపంచ మార్కెట్లు సానుకూల సంకేతాలు అందిస్తున్నాయి. దక్షిణ కొరియా కోస్పి ఇండెక్స్, టోక్యో నిక్కీ 225, హాంకాంగ్ హాంగ్ సెంగ్, షాంఘై గాజు కాంపోజిట్ అన్నీ గ్రీన్‌లో ఉన్నాయి. అమెరికా ఈక్విటీలలో కూడా ఇలాంటి ధోరణులు కనిపించాయి. నిన్న సాయంత్రం నాస్‌డాక్ కాంపోజిట్ 2.74 శాతం లాభపడింది. ఎస్‌డ పి 500 2 శాతం పైగా పెరిగింది, డౌ జోన్స్ ఇండస్ట్రియల్ యావరేజ్ 1.23 శాతం పెరిగింది.

## టెక్ మహీంద్రా లాభం జూమ్

మార్చి 31తో ముగిసిన 2024-25 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికం (క్యూ4)లో టెక్ మహీంద్రా ఏకీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన 76.5 శాతం వృద్ధి చెంది రూ.1,166.7 కోట్లకు పెరిగింది. ఆదాయం 4 శాతం పెరిగి రూ.13,384 కోట్లుగా నమోదైంది. డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)తో పోలిస్తే మాత్రం కంపెనీ లాభంలో 19 శాతం, ఆదాయంలో కేవలం 1 శాతం వృద్ధి నమోదైంది. 2024-25 ఆర్థిక సంవత్సరం మొత్తానికి టెక్ మహీంద్రా నికర లాభం 80 శాతం వృద్ధితో రూ.4,252 కోట్లకు, ఆదాయం 2 శాతం పెరుగుదలతో రూ.52,988 కోట్లకు చేరుకుంది. ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉండ టంతో గడిచిన ఆర్థిక సంవత్సరానికి గాను వాటాదారులకు ఒక్కో షేరుకు రూ.30 తుది డివిడెండ్ చెల్లించనున్నట్లు తెలిపింది. క్యూ4లో కంపెనీ 79.8 కోట్ల డాలర్ల (సుమారు రూ.6,800 కోట్లు) విలువైన కొత్త ఆర్డర్లను దక్కించుకుంది. ఏడాది క్రితం ఇదే కాలానికి లభించిన ఆర్డర్లతో పోలిస్తే 60 శాతం అధికమిది. 2024-25 ఆర్థిక సంవత్సరం మొత్తానికి లభించిన కొత్త డీల్స్ విలువ 270 కోట్ల డాలర్లు (దాదాపు రూ.23,000 కోట్లు)గా ఉంది. 2023-24 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 42 శాతం ఎక్కువ. క్యూ3తో పోలిస్తే క్యూ4లో సంస్థ ఉద్యోగుల సంఖ్య 1,757 మేర తగ్గింది. పూర్తి ఆర్థిక సంవత్సరంలో 3,276 మంది తగ్గారు. దాంతో, ఈ మార్చి 31 నాటికి టెక్ మహీంద్రాలో పనిచేస్తున్న ఉద్యోగుల సంఖ్య 1,48,731కి జారుకుంది. కాగా, మార్చి త్రైమాసికంలో కంపెనీ ఉద్యోగుల వలసల (అట్రిషన్) రేటు 11.8 శాతంగా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో ప్రాంగణ నియామకాల ద్వారా 6,000 మంది ఫ్రెషర్లను చేర్చుకోవాలన్న లక్ష్యాన్ని మించి 6,100 నియామకాలు చేపట్టినట్లు కంపెనీ తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2025-26) క్యాంపస్ హైరింగ్ లక్ష్యాన్ని వెల్లడించేందుకు కంపెనీ నిరాకరించింది. ట్రంప్ సుంకాలతో అంతర్జాతీయంగా ఆర్థిక అనిశ్చితి పెరిగిన నేపథ్యంలో ఐటీ సేవలకు డిమాండ్ మందగించడం ఇందుకు కారణంగా పేర్కొంది.

# మరోసారి పెరిగిన బంగారం ధరలు..

దేశ రాజధాని ఢిల్లీలో బంగారం ధరలు మళ్లీ పెరిగాయి. మంగళవారం బంగారం ధరలు రికార్డు స్థాయికి చేరుకుని లక్ష రూపాయలు దాటాయి. ఆ తర్వాత బుధవారం బంగారం ధరలో పెద్ద తగ్గుదల కనిపించింది. ఇప్పుడు ధరలో తగ్గుదల ఉంటుందని అనిపించింది. కానీ అలాంటిలేమి జరగలేదు. గురువారం బంగారం ధరలో పెరుగుదల కనిపించింది. దీనికి ప్రధాన కారణం డాలర్ ఇండెక్స్ పతనమని భావిస్తున్నారు. నిపుణుల అభిప్రాయం ప్రకారం, డాలర్ ఇండెక్స్ పతనం ప్రభావం రాబోయే రోజుల్లో కనిపిస్తుంది. అలాగే బంగారం ధర కొత్త రికార్డు స్థాయికి చేరుకుంటుందని నిపుణులు చెబుతున్నారు. దేశ రాజధాని ఢిల్లీలో బంగారం ధర ఎంత పెరిగిందో, ధరలు ఎలా ఉన్నాయో చూద్దాం. దేశ రాజధాని ఢిల్లీలో బంగారం ధరలు 200 రూపాయలు పెరిగి 10 గ్రాములకు 99,400 రూపాయలకు చేరుకున్నాయని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ తెలిపింది. 99.9 శాతం స్వచ్ఛత కలిగిన బంగారం ధర బుధవారం చారిత్రాత్మకమైన రూ.1 లక్ష స్థాయి నుండి యు-టర్న్ తీసుకుని 10 గ్రాములకు రూ.2,400 తగ్గి రూ.99,200కి చేరుకుంది. అదే సమయంలో 99.5 శాతం స్వచ్ఛత కలిగిన బంగారం ధర కూడా 10 గ్రాములకు రూ.200 పెరిగి రూ.98,900కి చేరుకుంది. మునుపటి ముగింపు ధర 10 గ్రాములకు రూ.98,700గా ఉంది. ఇదిలా ఉండగా, గురువారం వెండి ధరలు కిలోకు రూ.700 పెరిగి రూ.99,900కి చేరుకున్నాయి. మునుపటి ముగింపు ధరలో వెండి కిలోకు రూ.99,200 వద్ద ముగిసింది. బంగారం ధర ఎందుకు పెరిగింది?: అమెరికా, చైనా మధ్య ప్రస్తుతం నెలకొన్న వాణిజ్య ప్రతిష్టంభన కొంతకాలం కొనసాగవచ్చని అమెరికా ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెస్సెంట్ బుధవారం అన్నారు. ఇది కాకుండా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రాబోయే రెండు, మూడు వారాల్లో చైనాకు కొత్త సుంకాల రేట్లు అందుకోవచ్చని సూచించారు. సాంకేతిక దిద్దుబాటు కారణంగా బంగారం ధర ఆల్ టైమ్ గరిష్ట స్థాయిల నుండి పడిపోయిన తర్వాత ట్రంప్, బెసెంట్ వ్యాఖ్యలు సురక్షితమైన ఆస్తిగా బులియన్ డిమాండ్‌ను పునరుద్ధరించడానికి సహాయపడ్డాయని కమోడిటీ మార్కెట్ నిపుణులు అంటున్నారు. స్వల్పకాలిక తగ్గుదల తర్వాత బంగారం ధరలు పెరిగాయని, లాభాల బుకింగ్ కారణంగా బంగారం రికార్డు స్థాయికి చేరుకుందని అబాన్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సిఇఒ చింతన్ మెహతా అన్నారు. ట్రంప్ తాజా ప్రకటన అమెరికా ఆర్థిక పరిస్థితి గురించి అనిశ్చితిని సృష్టించింది. ఇది సురక్షితమైన పెట్టుబడిగా బంగారానికి డిమాండ్‌ను పెంచింది.



# ఇకపై అమెరికా మార్కెట్‌లో విక్రయించే ఐఫోన్‌ల తయారీ భారత్‌లోనే..!

%గాజాజూశ్రీవ% : అమెరికా చైనా దేశాల మధ్య టారిఫ్‌ల యుద్ధం మరింత ముదురుతోంది. ఈ నేపథ్యంలో ఈ టారిఫ్‌ల నుంచి తప్పించుకునేందుకు దిగ్గజ సంస్థ యాపిల్ ఇప్పుడు ప్రత్యామ్నాయ మార్గాలను వెతుకుతోంది. ఇందులో భాగంగానే అమెరికా మార్కెట్లో విక్రయించే ఐఫోన్ల తయారీకి సంబంధించిన పూర్తి అసెంబ్లీని భారత్‌కు తరలించాలని కంపెనీ యోచిస్తోంది. వచ్చే ఏడాది సాధ్యమైనంత తొందరగానే అమెరికా ఫోన్‌లకు సంబంధించిన యాపిల్ ఐఫోన్ అసెంబ్లీ భారత్‌కు తరలివచ్చే అవకాశం ఉంది. ఈ విషయాన్ని పలు ఆంగ్ల మీడియా కథనాలు స్పష్టం చేస్తున్నాయి. 2026 నాటికి అమెరికా మార్కెట్ కోసం తయారు చేసే ఐఫోన్ల తయారీ ప్రక్రియ మొత్తం భారత్ కేంద్రంగానే జరిగేలా యాపిల్ ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు మీడియా రిపోర్ట్స్ చెబుతున్నాయి. ఇప్పటివరకు అమెరికా వెలుపల తయారు చేస్తున్న ఐఫోన్లలో భారత్ వాటా 14 శాతం కాగా, దాదాపు 80 శాతం ఐఫోన్‌లు చైనాలోనే తయారవుతున్నాయి. ఇప్పుడు సుంకాల నేపథ్యంలో యాపిల్‌పై అదనపు భారం పడనుంది. చైనా నుంచి అమెరికాకు దిగుమతి చేసుకుంటే 145% పన్ను కట్టాల్సిన పరిస్థితి నెలకొంది. ఫలితంగా చైనా, భారత్‌లలో తయారయ్యే ఐఫోన్ల ధరల మధ్య అమెరికా మార్కెట్‌లో భారీ వ్యత్యాసం ఉండనుంది. చైనాతో పోలిస్తే భారత్‌లో తయారయ్యే ఐఫోన్‌ల ధరలు తక్కువగా ఉండనున్నాయి. ఈ క్రమంలోనే ఐఫోన్‌ల తయారీని భారత్‌కు మార్చాలని యాపిల్ కంపెనీ యోచిస్తోంది. అదే జరిగితే అమెరికా మార్కెట్‌లో ఇక నుంచి 'మేక్ ఇన్ ఇండియా' ఐఫోన్లే కనిపించనున్నాయి. అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ తొలిసారి ఎన్నికైనప్పుడే చైనాతో వాణిజ్య విరోధం మొదలైంది. దాంతో చైనా కాకుండా బలమైన ప్రత్యామ్నాయ తయారీ కేంద్రంగా మరో దేశాన్ని ఎంచుకోవాలని యాపిల్ సహా పలు బహుళజాతి సంస్థలు భావించాయి. అదే సమయంలో స్మార్ట్‌ఫోన్లపై తయారీ ఆధారిత ప్రోత్సాహకాలు కల్పిస్తామని 2020లో భారత ప్రభుత్వం ప్రకటించింది. దాంతో యాపిల్ కంపెనీ మన దేశంలో ఐఫోన్ల అసెంబ్లింగ్‌ను ప్రారంభించింది. గత ఆర్థిక సంవత్సరంలో యాపిల్ కంపెనీ 22 బిలియన్ డాలర్ల విలువైన ఐఫోన్లను భారత్‌లో తయారు చేసింది.



# ఆర్సీబీని గెలుపు వెనుక అసలు హీరో

ఐపీఎల్ 2025లో సొంత మైదానంలో వరుస ఓటములకు ఆర్సీబీ బ్రేక్ వేసింది. ఈ సీజన్‌లో బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో వరుసగా మూడు మ్యాచ్‌లో ఓడిపోయిన ఆర్సీబీ.. గురువారం రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో సూపర్ విక్టరీ సాధించింది. చివరి రెండు ఓవర్లలో 18 పరుగుల డిఫెండ్ చేసుకొని ఔరా అనిపించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఆర్సీబీకి సూపర్ స్టార్ ప్లేయర్ విరాట్ కోహ్లీ అద్భుతమైన స్టార్ట్ అందించాడు. మొత్తంగా 42 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్సులతో 70 పరుగులు చేసి అదరగొట్టాడు. కోహ్లీతో పాటు దేవదత్ పడిక్కల్ 27 బంతుల్లోనే 4 ఫోర్లు, 3 సిక్సులతో 50 పరుగులు చేసి దుమ్మురేపాడు. టిమ్ డేవిడ్ 23, జితేష్ శర్మ 10 బంతుల్లో 20 రన్స్ చేసి మంచి ఫినిష్ ఇచ్చారు. దీంతో ఆర్సీబీ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 205 పరుగుల భారీ స్కోర్ చేసింది. చిన్నస్వామి స్టేడియంలో ఆర్సీబీ ఈ సీజన్‌లో తొలిసారి 200 ప్లస్ స్కోర్ చేసింది. ఇంత పెద్ద స్కోర్‌ను కాపాడుకోవడంలో ఆర్సీబీ బౌలర్లు ఆరంభంలో తడబడినా.. కృనాల్ పాండ్యా, జోష్ హేజల్‌వుడ్ సూపర్ బౌలింగ్‌తో రాజస్థాన్ చేతుల్లోంచి మ్యాచ్‌ను లాక్కున్నారు. ఈ మ్యాచ్ విజయంలో విరాట్ కోహ్లీ, హేజల్‌వుడ్, కృనాల్ పాండ్యా పాత్ర చాలా ఉంది. కానీ, రాజస్థాన్ ఆల్‌మోస్ట్ గెలిచేసింది అనే మూమెంట్‌లో వికెట్ కీపర్ జితేష్ శర్మ తీసుకున్న ఓ రివ్యూ మ్యాచ్‌ను ఆర్సీబీ వైపు తిప్పేసింది. 34 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సులతో 47 పరుగులు చేసి.. మ్యాచ్‌ను ఈజీగా ఫినిష్ చేసేలా కనిపించాడు ఆర్ఆర్ బ్యాటర్ ధృవ్ జురెల్. భువనేశ్వర్ కుమార్ వేసిన ఇన్నింగ్స్ 18వ ఓవర్‌లో ఏకంగా 22 పరుగులు వచ్చాయి. ఆ ఓవర్‌లో జురెల్ ఓ సిక్స్, రెండు ఫోర్లు బాదేసి.. మ్యాచ్‌ను రాజస్థాన్‌దే అని డిసైడ్ చేశాడు. అతని కొట్టుడు చూసి.. ఆర్సీబీ ఆటగాళ్ల ముఖాలు మాడిపోయాయి, భుజాలు జారిపోయాయి.. హోం గ్రౌండ్‌లో ఈ మ్యాచ్ కూడా పోయినట్టే అని అంతా అనుకున్నారు. ఆర్సీబీ అభిమానులతో నిండిపోయిన ఎర్ర సముద్రంలా మారిన చిన్నస్వామి స్టేడియంలో నిశ్శబ్ధ భూతం ఆవహించింది. అలాంటి టైమ్‌లో హేజల్‌వుడ్ ఇన్నింగ్స్ 19వ ఓవర్ మూడో బంతిని వైడ్ ఆఫ్ ది ఆఫ్ స్టంప్ యార్కర్‌గా వేశాడు. ఆ బాల్‌ను అస్సలు ఎక్స్‌పెక్ట్ చేయని జురెల్.. ఆ బాల్‌కు షాట్ ఆడలేకపోయాడు. బాల్ వెళ్లి కీపర్ జితేష్ చేతుల్లో పడింది. హమ్మయ్య డాట్ బాల్ అనుకొని.. అంతా ఊపిరి పీల్చుకున్నారు. హేజల్‌వుడ్ కూడా నెక్ట్స్ బాల్ వేసేందుకు వెనక్కి వెళ్తున్నాడు. కానీ, కీపర్ జితేష్ మాత్రం క్యాచ్ అవుట్ అంటూ అప్పీల్ చేశాడు. వీడికేమైనా పిచ్చా.. ఒక వేళ బాల్ బ్యాట్‌కు తాకినా.. గ్రౌండ్‌పై పడి ఉంటుందని ఫ్యాన్స్ అనుకున్నారు. జితేష్ అప్పీల్‌ను ఆర్సీబీ ఆటగాళ్లు కూడా సీరియస్‌గా తీసుకోలేదు. అయినా కూడా జితేష్ కెప్టెన్ రజత్ పాటిదార్‌ను ఒప్పించి రివ్యూ తీసుకునేలా చేశాడు. సరే మ్యాచ్ చివరి కి వచ్చేసింది ఎలాగో గెలిచేలా కూడా లేరు, ఉన్న రివ్యూను వేస్ట్ ఎందుకు చేయడం అంటూ తీసుకుంటున్నారులే.. అని అంతా అనుకున్నారు.కానీ, రీప్లే చూస్తే.. అందరి మైండ్ బ్లాంక్ అయిపోయింది. ఒక్కసారిగా చిన్నస్వామి స్టేడియం హోరెత్తిపోయింది. ఆ దెబ్బకు విరాట్ కోహ్లీ కూడా చెవులు మూసుకున్నాడు. ఎందుకంటే.. బాల్ స్టప్ పడిన తర్వాత బ్యాట్‌కు తాకి వికెట్ కీపర్ చేతుల్లో సేఫ్‌గా పడింది. థర్డ్ అంపైర్ అవుట్ ప్రకటించాడు అంతే.. ఆర్సీబీ జట్టులో తెలియని ఎనర్జీ వచ్చేసింది. ఆ నెక్ట్స్ బాల్‌కు ఆర్చర్ అవుట్. మ్యాచ్ ఒక్కసారిగా ఆర్సీబీ చేతుల్లోకి వచ్చేసింది. జితేష్ శర్మ ఆ రివ్యూ తీసుకోవడానికి బలవంతం చేసి ఉండకపోతే.. కచ్చితంగా ఆర్సీబీ రివ్యూ తీసుకొనేది కాదు, అంపైర్, బౌలర్, కెప్టెన్, మిగిలిన ప్లేయర్లు ఎవరూ కూడా బ్యాట్ ఎడ్జ్ తీసుకుందని అనుకోలేదు. కానీ, జితేష్ ఒక్కడే బలంగా నమ్మాడు.. రిజల్ట్ సాధించాడు. మ్యాచ్ ఆల్‌మోస్ట్ వన్‌సైడ్ అయిన తర్వాత పడిన ఆ వికెట్ ఆర్సీబీకి విజయాన్ని అందించింది. సో.. జితేష్ శర్మ ఇజ్ ది రియల్ హీరో.



# పాకిస్థాన్‌తో ద్వైపాక్షిక సిరీస్ ఆడబోము

భారత క్రికెట్ నియంత్రణ మండలి(బిసిసిఐ) కీలక నిర్ణయం తీసుకుంది. భవిష్యత్తులోనూ పాకిస్తాన్ క్రికెట్ జట్టుతో ద్వైపాక్షిక సిరీస్‌లు ఆడబోమని ప్రకటించింది. పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రదాడి నేపథ్యంలో బిసిసిఐ గురువారం కీలక ప్రకటన విడుదల చేసింది. బిసిసిఐ కార్యదర్శి దేవజిత్ సైకియా, ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. రాజీవ్ శుక్లా మాట్లాడుతూ.. పాకిస్తాన్‌తో ద్వైపాక్షిక సిరీస్‌లు ఆడే అంశం గురించి సమీప భవిష్యత్తులో కనీసం చర్చ కూడా ఉండదు. అయితే, ఐసిసి ఈవెంట్లలో మాత్రం నిబంధనలకు అనుగుణంగా పాకిస్తాన్‌తో భారత్ మ్యాచ్‌లు ఆడుతుంది" అని తెలిపారు. ఇక దేవజిత్ సైకియా స్పందిస్తూ.. బిసిసిఐ తరఫున ఉగ్రవాదుల చర్యను తీవ్రంగా ఖండిస్తున్నాం. బాధిత కుటుంబాలకు సంతాపం తెలియజేస్తున్నాం అని పేర్కొన్నారు. పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో ఐపిఎల్-2025లో భాగంగా బుధవారం సన్‌రైజర్స్ హైదరాబాద్-ముంబయి ఇండియన్స్ మధ్య మ్యాచ్ సందర్భంగా బీసీసీఐ బాధితులకు నివాళి అర్పించింది.


# స్పోర్ట్స్

## అరుదైన రికార్డుల్లో చేరనున్న చెన్నై సారథి..



ఐదుసార్లు ఐపీఎల్ ఛాంపియన్స్ చెన్నై సూపర్ కింగ్స్ జట్టులో అత్యుత్తమ ఆటగాళ్లు ఉన్నారు. ప్రస్తుత చెన్నై కెప్టెన్ ఎంఎస్ ధోనీ ఐపీఎల్‌లో పాల్గొన్న అతి పెద్ద వయస్సు గల ఆటగాడిగా నిలిచాడు. ఎంఎస్ ధోని కెప్టెన్సీలో చెన్నై 5 సార్లు ఐపీఎల్ టైటిల్‌ను గెలుచుకుంది. 2024 సీజన్‌కు ముందు ఎంఎస్ ధోని చెన్నై కెప్టెన్సీ నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకున్నాడు. నేడు చెపాక్‌లో ఐపీఎల్ సీజన్ 18 వ సీజన్‌లో భాగంగా 43వ మ్యాచ్ జరగనుంది. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో చెన్నై సూపర్ కింగ్స్ జట్టు తపలడనుంది. ప్రస్తుత చెన్నై కెప్టెన్ ధోని సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగే టీ20లో భారీ చరిత్రను సృష్టించనున్నాడు. ధోని నేడు తన 400వ టీ20 మ్యాచ్ ఆడనున్నాడు. ధోని టీ20 కెరీర్ గురించి మాట్లాడితే, 399 మ్యాచ్‌ల్లో 350 ఇన్నింగ్స్‌ల్లో 7566 పరుగులు చేశాడు. ఈ పరుగులు 38.02 సగటు, 135.90 స్ట్రైక్ రేట్‌తో సాధించాడు. ఇందులో 28 హాఫ్ సెంచరీలు కూడా చేశాడు. ధోని మొత్తం 98 3అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడి మ్యాచ్‌లు ఆడాడు. ఇందులో అతను 126.13 స్ట్రైక్ రేట్‌తో 1617 పరుగులు చేశాడు. ఇందులో 2 అర్ధ సెంచరీలు ఉన్నాయి. ధోని ఐపీఎల్‌లో 272 మ్యాచ్‌లు ఆడాడు. 137.87 స్ట్రైక్ రేట్‌తో 5377 పరుగులు చేశాడు. ఇక దేశీయ క్రికెట్‌లో జారండ్ తరఫున మొత్తం 24 టీ20 మ్యాచ్‌లు ఆడాడు. ఛాంపియన్స్ లీగ్‌లో చెన్నై తరఫున 449 పరుగులు చేశాడు. ఐపీఎల్‌లో 400 మ్యాచ్‌లు ఆడిన నాలుగో భారత ఆటగాడిగా ధోనీ నిలిచాడు. దీనికి ముందు, రోహిత్ 456 మ్యాచ్‌లు ఆడి 12058 పరుగులు చేశాడు. దీంతో టీ20లో అత్యధికంగా ఆడిన భారత ఆటగాడిగా నిలిచాడు. 412 మ్యాచ్‌ల్లో 7537 పరుగులు చేసిన దినేష్ కార్తీక్ రెండవ స్థానంలో ఉన్నాడు. ఈ జాబితాలో విరాట్ కోహ్లీ 412 మ్యాచ్‌లతో మూడో స్థానంలో ఉన్నాడు. కోహ్లీ 408 మ్యాచ్‌ల్లో 13278 పరుగులు చేశాడు. ఈ మ్యాచ్ చెన్నై, హైదరాబాద్ జట్లకు డూ ఆర్ డై పరిస్థితిలా మారింది. ఐపీఎల్ 2025 సీజన్ రెండు జట్లకు షాక్ లాంటిదే. 8 మ్యాచ్‌ల్లో 2 విజయాలతో చెన్నై పాయింట్ల పట్టికలో చివరి స్థానంలో ఉంది. హైదరాబాద్ తొమ్మిదవ స్థానంలో ఉంది. ఇప్పుడు రెండు జట్లు సీజన్‌లోని మిగిలిన భాగంలో తిరిగి పునరాగమనం చేయాలని ఆసక్తిగా ఉన్నాయి.

## స్విమ్మింగ్ పూల్‌లో చిల్ అవుతూ అందాలతో కిర్రెక్కిస్తున్న సుప్రీతా నాయుడు



# అల్లు అర్జున్- అట్లీ మూవీలో హీరోయిన్ ఫిక్స్.. భలే ఛాన్స్ కొట్టేసిందిగా..!

అల్లు అర్జున్ సినిమాలంటే జనాలలో ఎంత క్రేజ్ ఉందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. బన్నీ నటించిన పుష్ప2 చిత్రం బాక్సాఫీస్ దగ్గర భారీ హిట్ కొట్టింది. ఈ చిత్రం ఏకంగా రూ.1800కోట్లు వసూలు చేసింది. దాదాపు -బాహుబలి 2- రికార్డులను బ్రేక్ చేసింది. క్రియేటివ్ జీనియస్ సుకుమార్‌తో కలిసి సంచలనాలకి తెర లేపిన బన్నీ ఇప్పుడు మరో భారీ సినిమాతో రాబోతున్నారు. కోలీవుడ్ డైరెక్టర్ అట్లీ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం సైన్స్ ఫిక్షన్‌గా, ఇండియాలో ఇప్పటి వరకు రాని జోనర్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందుతుంది. మూవీకి సంబంధించిన పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇటీవల ముంబై బాంద్రాలోని మోహబూబా స్థూడియోస్ లో అల్లు అర్జున్ లుక్ టెస్ట్, కాన్సెప్ట్ ఫొటో షూట్ జరిగినట్లు సమాచారం. బన్నీ పాత్ర కోసం డైరెక్టర్ అట్లీ డిఫరెంట్ లుక్స్ ట్రై చేస్తున్నట్టు తెలుస్తుంది. రగ్గడ్ నుంచి స్టైలిష్ వరకు ఇలా చాలా ట్రై చేసిన అట్లీ చిత్రంలో అల్లు అర్జున్ ని ఓ భిన్నమైన ఇమేజ్ తో పరిచయం చేయాలని అనుకుంటున్నారట అట్లీ. అంతా అనుకున్నట్లు జరిగితే జూన్ చివరి వరకు చిత్రీకరణ ప్రారంభం కానుందని తెలుస్తుంది. సినిమా తారాగణానికి సంబంధించిన విషయాలను త్వరలోనే వెల్లడించనున్నారు. సన్ పిక్చర్స్ భారీ బడ్జెట్ తో ఈ మూవీని నిర్మిస్తోంది. ఇందులో కథానాయికగా మృణాల్ ఠాకూర్‌ని పరిశీలిస్తున్నట్టు తెలుస్తుంది. ఇటీవల కథని మృణాల్‌కి చెప్పగా, ఆమె ఓకే చెప్పినట్టు సమాచారం. మృణాల్ బన్నీ పక్కన బాగుంటుందని, వారి జోడి చూడముచ్చటగా ఉంటుందని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఇక ఈ చిత్రంలో మృణాల్‌తో పాటు దీపికా పదుకొణే, జాన్వీ కపూర్ కూడా నటించబోతున్నట్టు వార్తలు వస్తున్నాయి. వీటిపై అయితే క్లారిటీ రావలసి ఉంది. టైమ్ ట్రావెల్, సూపర్ హీరోలను తలపించేలా ఈ మూవీ ఉంటుందని తెలుస్తుంది. ఏది ఏమైన ఈ సినిమాతో బన్నీ హాలీవుడ్ రేంజ్‌కి కూడా చేరుకుంటాడని సమాచారం.



# నాని కోసం పాడిన అనిరుధ్.. ఫ్రీగానే!

నాని హీరోగా చేసిన లేటెస్ట్ మూవీ హిట్ 3 మే 1న పాన్ ఇండియా వైడ్ థియేటర్లలోకి రానుంది. ఇప్పటికే ముంబయి, కేరళ అంటూ నాని తెగ తిరిగేస్తున్నాడు. మరోవైపు ఇన్వెస్టిగేషన్ యాక్షన్ బ్యాక్ డ్రాప్ స్టోరీతో తీసిన ఈ సినిమా నుంచి ఇప్పుడో పాట రిలీజ్ చేశారు. దీన్ని అనిరుధ్ పాడటం విశేషం. హిట్ 3 మూవీ నుంచి ఇదివరకే ప్రేమ వెల్లువ, అభీ బార్ అర్జున్ సర్కార్ అనే పాటలు రిలీజయ్యాయి. ఇప్పుడు 'తను..' అంటే సాగే గీతాన్ని రిలీజ్ చేశారు. ఇందులో పోలీస్ స్టేషన్ లో ఉన్న నాని.. హీరోయిన్ కోసం పాడే సాంగ్ ఇదని అనిపిస్తుంది. దీన్ని మిక్కీ జే మేయర్ కంపోజ్ చేయగా.. ప్రముఖ సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ పాడాడు. స్వతహాగా సినిమాలకు కంపోజ్ చేసే అనిరుధ్.. కోట్లకు కోట్లు రెమ్యునరేషన్ తీసుకుంటాడు. కానీ పాడటానికి మాత్రం రూపాయి కూడా తీసుకోడు. గతంలో అతడే ఈ విషయం చెప్పాడు. ఇప్పుడు కూడా నాని కోసమే అనిరుధ్ ఈ పాట పాడినట్లు అనిపిస్తుంది. గతంలో నాని 'జెర్సీ', 'గ్యాంగ్ లీడర్' చిత్రాలకు అనిరుధ్ మ్యూజిక్ డైరెక్టర్ గా పనిచేశాడు. నెక్స్ట్ రాబోయే 'ప్యారడైజ్' కూడా ఇతడే సంగీతమందించబోతున్నాడు. అలా వీళ్లిద్దరి మధ్య ఉన్న బాండింగ్ దృష్ట్యా హిట్ 3లో అనిరుధ్ పాట పాడినట్లున్నాడు.



Ediited Printed & Published Mekkonda Premraj on behalf MPR publications and Printed RNI NO:TELTEL/ 2023/89546 Cell No.9397303326,